తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

సంపుటి : 02 సంచిక 346 హైదరాబాద్ : సంపాదకులు : గున్నాల అనిల్‌రెడ్డి సోమవారం 2-06-2025 పేజీలు : 12 వెల : 5

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur




## హామీలను అమలు చేస్తూ ప్రజల్లో విశ్వాసం నింపాలి: కేసీఆర్

**హైదరాబాద్, జూన్ 1:**



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దినోత్సవం జూన్ 2 సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటరీ పంథాలో కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఉమ్మడి పాలనలో ఆగమైన తెలంగాణను స్వయం పాలనలో అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. సమస్త రంగాల్లో ప్రగతిని సాధిస్తూ, పదేండ్ల అనతికాలంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుకొన్నామని పేర్కొన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, అన్ని వర్గాల ప్రజల జీవన విధానం మరింత గుణాత్మకంగా సాగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకొని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేసీఆర్ సూచించారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల్లో విశ్వాసం నింపాలన్నారు.

# ఆపరేషన్ సిందూర్‌ను కూడా వదల్లేదు..

### మమతా బెనర్జీపై అమిత్‌షా ఫైర్



కోల్‌కతా: ముస్లింల ఓటు బ్యాంకు కోసమే ఆపరేషన్ సిందూర్ వక్ఫ్ సవరణ చట్టాన్ని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యతిరేకిస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం ద్వారా ఈ దేశంలోని తల్లులు, సోదరీమణులను అగౌరవపరుస్తున్నారని తప్పుపట్టారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర మహిళలంతా ముఖ్యమంత్రికి, టీఎంసీకి గట్టి గుణపాఠం చెప్పాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ రాజకీయం చేస్తున్నాయని మమతాబెనర్జీ ఇటీవల ఆరోపించారు. కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో బీజేపీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి అమిత్‌షా ఆదివారం నాడు మాట్లాడుతూ, రాష్ట్రంలో రాబోయే ఎన్నికలు బెంగాల్ భవిష్యత్తును మాత్రమే కాకుండా జాతి భద్రతను నిర్ణయించే ఎన్నికలని అన్నారు. బంగ్లాదేశీయుల కోసం దేశ సరిహద్దులను మమతా బెనర్జీ తెరిచిపెట్టారని ఆరోపించారు. చొరబాటుదారులను రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారని, వారిని అడ్డుకోవడం ఆమె వల్ల కాదని, ఒక్క బీజేపీ ప్రభుత్వం మాత్రమే ఆపని చేయగలదని చెప్పారు. సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ ఆపరేషన్, కంచె కోసం భూములు కేటాయించమని అడిగినా ఆమె కేటాయించలేదని మండిపడ్డారు. అందువల్లే చొరబాట్లు కొనసాగుతున్నాయని ఆరోపించారు. 'అధికారం కోసం, ఓటు బ్యాంకు పెంచుకునేందుకు ఇవన్నీ చేస్తున్నారు. మీ తర్వాత మీ మేనల్లుడు సీఎం కావచ్చు. కానీ ఇదెంతమాత్రం కొనసాగనీయరాదు' అని అమిత్‌షా అన్నారు.

## ఆవిర్భావ దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

### నేడు పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు
### ఉదయం 9.40గంటలకు ప్రారంభం
### జాతీయ జెండా ఎగురవేయనున్న సీఎం



**హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూన్ 1:** తెలంగాణ రాష్ట్రం 12వ పడిలోకి అడుగుపెడుతున్న వేళ.. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో సోమవారం ఉదయం 9.40 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. కార్యక్రమంలో సీఎం రేవంత్ జాతీయ జెండాను ఎగురవేస్తారు. తర్వాత జాతీయ గీతాన్ని, తెలంగాణ రాష్ట్ర గీతాలాపన, పోలీసుల గౌరవ వందనం, పరేడ్ ఉంటాయి. అనంతరం సీఎం ప్రసంగిస్తారు. పలు రంగాల్లో విశేష సేవలు అందించినవారికి పతకాలను అందిస్తారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కవులు, కళాకారులు, ఇతర ప్రముఖులను సత్కరిస్తారు. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా సీఎం చేసిన ప్రకటన మేరకు గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి, అందెశ్రీ, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్‌తేజ, గొడిశాల జయరాజ్, పాశం యాదగిరి, ఎక్కా యాదగిరిలకు రూ.కోటి చెక్కు, ఫ్యూచర్‌సిటీలో 300 గజాల చొప్పున ఇంటి స్థలం పత్రాలను అందించనున్నారు. మరణించినవారికి సంబంధించి వారి కుటుంబ సభ్యులకు అందజేస్తారు.

# ప్రచారం కాదు, శత్రువుపై దృష్టిపెట్టండి : ఖర్గే

**బెంగళూరు:** ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభల్లో చేస్తున్న ప్రసంగాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారాలకు ప్రధాని దూరంగా ఉంటూ శత్రువుపై దృష్టిసారించాలని సూచించారు.

బెంగళూరులో ఆదివారంనాడు మీడియాతో ఖర్గే మాట్లాడుతూ, ఆయన (మోదీ) ఇచ్చే ప్రతి ప్రకటనకు తాను స్పందించాలని అనుకోవడం లేదని చెప్పారు. అయితే ఇటీవల ఆయన ఇస్తున్న బహిరంగ ప్రకటనలు, రాజకీయాల కార్యకాలాపాలను దృష్టిలో ఉంచుకుని తాను ఒక సూచన చేస్తున్నానని అన్నారు. ప్రస్తుతానికి కొంతకాలం ఆయన ఎన్నికల ప్రచారాలకు దూరంగా ఉంటూ దేశంపై దృష్టి సారించాలని అన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చామంటూ గతంలో చెప్పిన ప్రధాని మోదీ ఇప్పుడు అంతా తానే చేశానని చెప్పుకోవడం ఏమిటిని ప్రశ్నించారు. సొంత గొప్పలు చెప్పుకోవడం మంచిది కాదన్నారు. దానికి బదులుగా శత్రువుపై దృష్టి సారించాలని సూచించారు. సాయుధ బలగాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని ఖర్గే చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన తాజా పరిణామాలపై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రతినిధి బృందం కన్సల్టేషన్స్ కోసం విదేశాలకు వెళ్లిందని చెప్పారు. వాళ్లు వచ్చేంత వరకూ ఆ వివరాలు మాట్లాడటం సరికాదని అన్నారు.



# రష్యా గడ్డ మీది నుంచే రష్యాపై భీకర దాడులు

### ఎయిర్‌బేసలే లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్ల బీభత్సం

కీవ్, జూన్ 1: ఉక్రెయిన్‌ను వారంరోజుల్లో చుట్టేస్తామంటూ మూడేళ్ల క్రితం యుద్ధానికి దిగిన రష్యాకు ఆదివారం పెద్ద దెబ్బ తగిలింది. ఈ యుద్ధం 1,192వ రోజుకు చేరుకోగా.. 'ఆపరేషన్ వెబ్' పేరుతో రష్యా గడ్డ మీది నుంచే ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడుల్లో రష్యాలోని నాలుగు ఎయిర్‌బేసలు టార్గెట్ అయ్యాయి. 18 నెలలుగా ఆ ఆపరేషన్‌ను వ్యూహాత్మకంగా కొనసాగించి, ట్రక్కుల్లో రష్యాకు డ్రోన్లను పంపిన ఉక్రెయిన్.. ఆధునిక యుద్ధతంత్రంలో తనదైన ముద్రవేస్తూ రిమోట్ కంట్రోళ్లతో ఆకస్మిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 41 రష్యా యుద్ధ విమానాలను బుల్లి డ్రోన్లు(ఎఫ్‌పీవీ కామికాజి) తుత్తునియలు చేశాయి. ఉక్రెయిన్ సరిహద్దుల నుంచి 700 కిలోమీటర్లు మొదలు.. 4వేలకు పైగా కిలోమీటర్ల దూరంలో ఉండే నాలుగు ఎయిర్‌బేసలు బెలాయా, డియాగిలెవ్, ఒలేన్యా, ఇవానోవోపై ఆదివారం ఉదయం ఉక్రెయిన్ ముప్పేట దాడులు చేసింది. వీటిల్లో బెలాయా ఎయిర్‌బెస్ ఉక్రెయిన్ సరిహద్దులకు 4 వేలకు పైగా కిలోమీటర్ల దూరంలో ఉండే ఇర్కుట్స్క్ రీజియన్‌లో ఉండడం గమనార్హం..!"రష్యాపైఉక్రెయిన్‌దీర్ఘశ్రేణి క్షిపణుల, డ్రోన్లను ఉపయోగించుకోవచ్చు" అంటూ పాశ్చాత్య దేశాల నుంచి అనుమతి వచ్చిన వెంటనే.. రష్యా అవాక్కయ్యేలా ఉక్రెయిన్ క్షిపణులతో కాకుండా.. ఆ దేశ గడ్డ మీద నుంచే చిన్న డ్రోన్లతో దాడులు జరపడం గమనార్హం..!

## జీహెచ్‌ఎంసీ అత్యవసర బృందాల.. టెండర్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

- స్థానిక కాంట్రాక్టర్లకు అన్యాయం జరిగేలా, ప్రజాధనం వృధా అయ్యేలా నిబంధనలు
- రెండు సంస్థలకు లబ్ధి చేకూర్చేలా అధికారుల యత్నం
- వారిపై చర్యలు తీసుకోవాలి - డివిజన్ల వారీగా టెండర్లు : కవిత - సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ



**హైదరాబాద్, జూన్ 1:** గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో వర్షాకాల అత్యవసర, తక్షణ మరమ్మతు బృందాలకు సంబంధించిన టెండర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. ప్రభుత్వాన్ని కోరారు. డివిజన్ల వారీగా తిరిగి టెండర్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం ఆమె బహిరంగ లేఖ రాశారు. స్థానిక కాంట్రాక్టర్లకు అన్యాయం జరిగేలా, ప్రజాధనం వృధా అయ్యేలా టెండర్ నిబంధనలున్నాయని, తమకు నచ్చిన సంస్థలకు పనులు కట్టబెట్టేలా అధికారులు వ్యవహరిస్తున్నారని లేఖలో కవిత ఆరోపించారు. డివిజన్ల వారీగా టెండర్లు పిలిస్తే.. 150 మంది కాంట్రాక్టర్లకు ఉపాధి కలుగుతుందన్నారు. కానీ, జోన్‌ల వారీగా టెండర్లు పిలవడంతో తొమ్మిది టెండర్లు మాత్రమే దాఖలు చ్టేస అవకాశం లభించిందని, వాటిని కూడా రెండు సంస్థలకే కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. పైగా, ఈ పనులు చేపట్టేందుకు వినియోగించే వాహనాల్లో కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలన్న నిబంధన ఉందని, కానీ.. అలాంటి వాహనాలు విక్రయించే డీలర్లు హైదరాబాద్‌లో ఇద్దరే ఉన్నారని తెలిపారు. స్థానిక కాంట్రాక్టర్లకు వాహనాలు సరఫరా చేసేందుకు ఆయా డీలర్లు సమ్మతి తెలపకపోవడంతో.. వారు కర్ణాటక డీలర్ల నుంచి ఎంవోయూ తీసుకొని టెండర్లలో పాల్గొన్నారని చెప్పారు. అయితే ఆ కాంట్రాక్టర్లు ఎంవోయూ ఫిజికల్ కాపీలు సమర్పించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సమయం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఫిజికల్ కాపీలు సమర్పించలేదనే సాకు చూపించి స్థానిక కాంట్రాక్టర్లను టెండర్లలో అనర్హులుగా నిర్ణయించి.. ముందే ఒప్పందం కుదుర్చుకున్న రెండు సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు కొందరు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. వర్షాకాల అత్యవసర, తక్షణ మరమ్మతు పనుల కోసం గతంలో వినియోగించిన వాహనాల ద్వారా రెండు, మూడు క్యూబిక్ మీటర్ల మెటీరియల్‌ను తరలించే అవకాశం ఉండేదని కవిత గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు జీహెచ్‌ఎంసీ జారీ చేసిన టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఏర్పాట్లు ఒక విదేశీ కంపెనీకి చెందిన వాహనాలకు మాత్రమే ఉందన్నారు. ఆ వాహనాల్లో ఒక క్యూబిక్ మీటర్ మెటీరియల్‌ను తరలించడం కూడా సాధ్యం కాదని మీడియా కథనాల ద్వారా తెలుస్తోందన్నారు. పైగా, ఇందుకోసం గతంలో వ్యయమైన రూ.5.40 కోట్లు రెట్టింపయి రూ.11.25 కోట్లకు చేరిందని తెలిపారు. దీంతో ఏటా రూ.5.85 కోట్ల ప్రజాధనం అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. మునిసిపల్ శాఖను ముఖ్యమంత్రే చూస్తున్నందున.. ఆ శాఖ పరిధిలోని జీహెచ్‌ఎంసీ టెండర్లలో తెలంగాణ బీసీ కాంట్రాక్టర్లకు అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టాలని లేఖలో కవిత కోరారు. టెండర్ల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మావోయిస్టులపై మారణహోమం ఆపాలి

- మోదీ, అమిత్ షాకు మానవత్వం లేదు
- కార్పొరేట్లకు ఖనిజ సంపద దోచిపెట్టేందుకే 'కగార్' - టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- ఆపరేషన్ కగార్ నిలిపివేతకు 14న లెఫ్ట్ పార్టీల ధర్నా - మద్దతు ప్రకటించిన కాంగ్రెస్, బీఆర్ఎస్



**హైదరాబాద్ సిటీ, జూన్ 1:** మావోయిస్టులపై మారణ హోమం నిలిపివేయాలని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఆదివారం శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు కనీస మానవత్వం కూడా లేదని విమర్శించారు. ఛత్తీసగఢ్, జార?ండ్ రాష్ట్రాల్లోని అత్యంత విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఆదివాసీలు, వారికి అండగా నిలిచిన మావోయిస్టుల నిర్మూలనకు కేంద్రం పూనుకున్నదని ఆరోపించారు. మావోయిస్టు సిద్ధాంతాలను తాను అంగీకరించకపోయినా, సమ సమాజ స్థాపన కోసం సర్వం తాగ్యం చేసిన నంబాల కేశవరావు మరణం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. వ్యక్తులను చంపగలరే గానీ, సిద్ధాంతాలను నిర్మూలించలేరని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తు చేశారు. శాంతి చర్చల కమిటీ చేపట్టే కార్యాచరణకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉంటుందని మహేశ్ చెప్పారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌ను ట్రంప్ జోక్యంతో నిలిపిన వారు దేశ పౌరులపై మారణ హోమం సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ మార్గంలోనే ఈ సమస్యలకూ పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌కు తమ పార్టీ వ్యతిరేకమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. మానవ హక్కుల వేదిక కన్వీనర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ నిలిపివేత కోరుతూ దేశంలోని ఆదివాసీ, దళిత, ప్రతిపక్ష ఎంపీలకు లేఖలు రాద్దామని ప్రతిపాదించగా, సభికులంతా అంగీకారం తెలిపారు. ఆపరేషన్ కగార్ నిలిపేయడంతోపాటు శాంతి చర్చలు జరుపాలని కోరుతూ 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా చేపట్టాలని వామపక్ష పార్టీల తీర్మానానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు మద్దతు ప్రకటించారు. ఈ సమావేశానికి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షత వహించారు.

**చితాభస్మాన్నీ ఇవ్వలేదు**

నంబాల కేశవరావు మృతదేహం ఇవ్వడానికి నిరాకరించిన కేంద్రం.. చివరకు ఆయన చితాభస్మాన్ని కూడా కుటుంబ సభ్యులు తీసుకోవడాన్ని నిరాకరించడం అమానుషమని పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక సదస్సులో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. 'సాయుధ విప్లవ పోరాటం- శాంతి చర్చలు' అనే అంశంపై జరిగిన సదస్సును సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్ ప్రారంభిస్తూ రాజ్యం హద్దులు దాటినప్పుడు పౌర సమాజం గళం విప్పాలని హితవు చెప్పారు.

# భగవద్గీత ఆయనే విజేత..

**18 అధ్యాయాలు.. 700 శ్లోకాలు - అలవోకగా ఆలపించిన షాద్ నగర్ వాసి ప్యారసాని రాములు..**

**విశాఖ జిల్లాలో జరిగిన పోటీల్లో బంగారు పతకం..**

హిందూ జాతికి ధర్మాధర్మ విచక్షణను నేర్పే పవిత్ర గ్రంథం.. పద్యాల మకరందం భగవద్గీత.. అలాంటి గీతలో 18 అధ్యాయాలను, 700 పద్యాలను అలవోకగా ఆలపించి అలరించాడు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జరిగిన పోటీలో విజేతగా నిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. అతని పేరు ప్యారసాని రాములు. లర్న్ గీత అనే ఆన్లైన్ ప్రోగ్రాంలో చేరి భగవద్గీతలోని ఈ అధ్యాయాలను కంఠస్థం చేసిన ఆయన విశాఖపట్నంలో ఏర్పాటుచేసిన గీతా మైత్రి మిలన్ కార్యక్రమంలో పాల్గొని విజేతగా నిలిచారు. రెండు తెలుగు రాష్ట్రాలకు జరిగిన



ఈ పోటీలలో షాద్ నగర్ పట్టణం నుంచి ప్రాతినిధ్యం వహించి విజేతగా నిలిచిన ఆయన తెలంగాణ పేరును నిలబెట్టారు. ఆదివారం అక్కడ జరిగిన కార్యక్రమంలో గీతా విశారద డాక్టర్ ఆమా గోయల్ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని, సత్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి అధ్యక్షుడు టి స్వరాజ్ బాబు, కార్యదర్శి నక్క నర్సింలు ఇతర సభ్యులు ఆయనను అభినందించారు..

# జకీర్ నాయక్‌తో సన్నీ యాదవ్ ఇంటర్వ్యూ

**ఎన్ఐఏ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి - మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలతో జకీర్ నాయక్ పాప్యులర్**

**ఉగ్రవాదులకు ఆర్థిక సాయం చేశాడని జకీర్ నాయక్ పై ఆరోపణలు - మోస్ట్ వాంటెడ్ లిస్టులో చేర్చిన భారత ప్రభుత్వం**

**మలేషియాకు పారిపోయిన జకీర్ నాయక్**




ప్రముఖ యూట్యూబర్ భయ్యా సన్నీయాదవ్ ను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పాక్ కు గూఢచర్యం చేస్తున్న విషయం బయటపడడంతో ప్రముఖ యూట్యూబర్లపై అధికారులు నిఘా పెట్టారు. పాకిస్థాన్ లో పర్యటించిన యూట్యూబర్ల వివరాలు ఆరా తీస్తున్నారు. అనుమానాస్పద యూట్యూబర్లను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.ఇందులో భాగంగా సన్నీ యాదవ్ ను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విచారణలో పలు సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు సమాచారం. సన్నీ యాదవ్ యూట్యూబ్ ఖాతాలో జకీర్ నాయక్ తో ఇంటర్వ్యూ వీడియోలు బయటపడ్డాయని అధికార వర్గాలు తెలిపాయి. మత విద్వేషాలను రెచ్చగొట్టే జకీర్ నాయక్ ను సన్నీయాదవ్ ఇంటర్వ్యూ చేశాడని, ఇందుకు సంబంధించిన వీడియోలు అతడి యూట్యూబ్ లో లభించాయని అధికారులు తెలిపారు.భారతదేశంలోనే పుట్టిపెరిగిన జకీర్ నాయక్.. తన ప్రసంగాలతో మత విద్వేషాలను రెచ్చగొడుతుంటాడు. అతడిపై ఉగ్రవాదులకు ఆర్థిక సాయం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2016లోనే జకీర్ నాయక్ పై మనీలాండరింగ్ కేసు నమోదైంది. దీంతో జకీర్ నాయక్ మలేషియాకు పారిపోయాడు. కేంద్ర ప్రభుత్వం అతడిని మోస్ట్ వాంటెడ్ లిస్టులో చేర్చింది. అతడిని వెనక్కి రప్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ తో భయ్యా సన్నీయాదవ్ ఇంటర్వ్యూ వీడియోలు బయటపడడంతో ప్రస్తుతం వారిద్దరి మధ్య సంబంధాలపై ఎన్ఐఏ అధికారులు ఆరా తీస్తున్నారు.

# తిరుమల ఆలయం మీదుగా తక్కువ ఎత్తులో వెళ్లిన విమానం

**తిరుమల శ్రీవారి ఆలయంపై ఆదివారం ఉదయం విమానం ప్రయాణం**

**చాలా తక్కువ ఎత్తులో వెళ్లడంపై భక్తుల ఆందోళన, వీడియో రికార్డింగ్**

**ఆగమశాస్త్ర నిబంధనలకు విరుద్ధమంటూ టీటీడీ ఆవేదన**

**'నో ఫ్లై జోన్'గా ప్రకటించాలన్న విజ్ఞప్తిని పట్టించుకోని కేంద్రం**

**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ చూపాలని భక్తుల డిమాండ్**

గతంలోనూ పలుమార్లు ఇలాంటి ఘటనలు, చర్యలు శూన్యంతిరుమల పుణ్యక్షేత్రంలో మరోసారి అపచారం జరిగిన ఘటన భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. శ్రీవారి ఆలయ గోపురం మీదుగా ఆదివారం ఉదయం ఓ విమానం అత్యంత సమీపం నుంచి ప్రయాణించడం తీవ్ర కలకలం రేపింది. స్వామివారి ఆలయంపై చాలా తక్కువ ఎత్తులో విమానం వెళ్లడాన్ని పలువురు భక్తులు ప్రత్యక్షంగా చూశారు. ఈ దృశ్యాలను కొందరు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించారు.ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు వెంటనే ఈ విషయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న టీటీడీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆలయం మీదుగా ప్రయాణించిన విమానం ఎక్కడి నుంచి వచ్చింది, ఎక్కడికి వెళుతోంది అనే వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.ఆగమశాస్త్ర నియమాల ప్రకారం, తిరుమల శ్రీవారి ఆలయం మీదుగా విమానాలు గానీ, హెలికాప్టర్లు గానీ ప్రయాణించడం పూర్తిగా నిషిద్ధం. ఇలాంటి ప్రయాణాలను అపచారంగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలోనే తిరుమలను 'నో ఫ్లై జోన్'గా ప్రకటించాలని టీటీడీ చాలాకాలంగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది. అయితే, కేంద్ర పౌరవిమానయాన శాఖ ఈ ప్రతిపాదనను ఆచరణ సాధ్యం కాదని తెలుపుతూ వస్తోంది. దీంతో ఈ విషయంలో టీటీడీ కూడా ఏమీ చేయలేని నిస్సహాయ




స్థితిలో ఉండిపోయిందిగతంలోనూ అనేకసార్లు శ్రీవారి ఆలయం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు వెళ్లిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. గత రెండు, మూడేళ్లుగా ఇటువంటి ఘటనలు పునరావృతమవుతూనే ఉన్నాయి. ప్రతిసారీ భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, వారి ఆందోళనను పరిగణనలోకి తీసుకోవాలని టీటీడీ వర్గాలు పేర్కొంటున్నాయి. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది.ప్రస్తుతం కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రామ్మోహన్ నాయుడు బాధ్యతలు నిర్వహిస్తుండటం గమనార్హం. అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని, తిరుమలను 'నో ఫ్లై జోన్'గా ప్రకటించేలా కేంద్రాన్ని ఒప్పించాలని భక్తులు కోరుతున్నారు.

# తిరుమలపై రాజకీయాలు నెత్తి మీద చేయి పెట్టుకున్నట్లే !



దేవుడితో రాజకీయాలు చేయడం ప్రమాదకరం. ఆ విషయం దేవుడిపై భయం, భక్తి ఉన్న వారందరికీ తెలుస్తుంది.కానీ రాజకీయం కోసం దేనికైనా దిగజారే మనస్థత్వం ఉన్న పార్టీలతోనే పెద్ద సమస్యలు వస్తున్నాయి. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా వ్యవరిస్తూ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. దీని వల్ల ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నామని అనుకుంటున్నారు కానీ వారు దాడి చేస్తోంది శ్రీవారి భక్తుల విశ్వాసం మీద.క్యూలైన్ లో ఓ భక్తుడు సౌకర్యాలు అందలేదని రచ్చ చేశాడు. అలా రచ్చ చేస్తానని వీడియో కూడా తీసుకునేలా ఏర్పాట్లు చేసుకున్నాడు. వెంటనే వైసీపీ సోషల్ మీడియాకు దాన్ని పంపాడు. వాళ్లు వైరల్ చేశారు. ఒక్క భక్తుడు చేసిన ఆందోళనతో అందరి పై ముద్ర వేశారు. అతను ఎవరో కాదు..వైసీపీ నేత అని తేలింది. పక్కా ప్లాన్ ప్రకారం ఇలా చేశాడు. తర్వాత పశ్చాత్తాపంతో దర్శనం ఆలస్యం అయిందని అందుకే ఫ్రస్ట్రేషన్ తో ఇలా చేశానని కూడా చెప్పుకొచ్చాడు.ఇదే మొదటి సారి కాదు. కొన్ని కొన్ని విచిత్రాలు వైసీపీ సోషల్ మీడియాస్ చిక్కుతాయి. ఓ ముస్లిం డ్రైవర్..నమాజ్ చేశాడని వాళ్లే ప్రచారం చేస్తారు. గోవులు చనిపోకపోయినా చనిపోయాయని వారే ప్రచారం చేస్తారు. ఓ దేవుడి మీద ఇంత తప్పుడు ప్రచారం చేసి.. ఎం రాజకీయ లాభం సాధిద్దామని..?. దేవుడు ఎవరి వినాశనాన్ని కోరుకోడు కానీ.. చేసిన తప్పులకు విధి బలీయంగా శిక్షిస్తుందన్నది మాత్రం ప్రతి ఒక్కరి జీవితంలో అవగతమయ్యే నిజం. దీన్ని ఎందుకు వారు గుర్తుంచుకోవడం లేదు ?

# దేశవ్యాప్తంగా NIA సోదాలు




NIA: దేశవ్యాప్తంగా 15 చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టింది. వీటిల్లో ఢిల్లీ, ముంబై, హరియాణా, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్గఢ్, అస్సాం, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. పాకిస్థాన్ నిఘా సంస్థ NIA%తో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులకు చెందిన నివాస గృహాలు, ఆఫీస్లు వీటిల్లో ఉన్నాయి. ఈ దాడుల సందర్భంగా పలు ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు కొన్ని సున్నితమైన ఆర్థిక పత్రాలను కూడా NIA స్వాధీనం చేసుకుంది.

# బిగ్ బ్రేకింగ్


KALVAKUNTLA KAVITHA
M.L.C.
LOCAL AUTHORITIES CONSTITUENCY
NIZAMABAD

తేది : 31 మే 2025,
హైదరాబాద్.

జీహెచ్ ఎంసీలో మాన్ సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, ఇన్ స్టంట్ రిపేర్ టీమ్స్ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సీఎం రేవంత్ రెడ్డి గారికి లేఖ రాశారుగ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వర్షాకాలంలో చేపట్టాల్సిన ఎమర్జెన్సీ పనుల టెండర్లలో కొందరు అధికారులు తమకు అనుకూలంగా ఉన్న సంస్థలకు లాభం చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయి తెలంగాణకు చెందిన బీసీ కాంట్రాక్టర్లకు నష్టం చేసేలా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు వ్యవహరిస్తున్నారుఒక విదేశీ సంస్థకు చెందిన వాహనాలు మాత్రమే ఈ పనుల కోసం వినియోగించేలా నిబంధనలు రూపొందించారుఆ సంస్థకు హైదరాబాద్ రెండు షోరూములు మాత్రమే ఉన్నాయి.. ఆ షోరూంల నిర్వాహకులు తెలంగాణకు చెందిన కాంట్రాక్టర్లతో ఎంఓయూ చేసుకునేందుకు ససేమిరా అంటున్నారు.. తెలంగాణ కాంట్రాక్టర్లు కర్నాటక షోరూంల డీలర్ల నుంచి ఎంవోయూలు తెచ్చుకున్నా వాటి ఫిజికల్ కాపీలు తక్కువ వ్యవధిలో తెచ్చి ఇవ్వాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారుఇప్పటి వరకు జీహెచ్ ఎంసీలోని 150 వార్డులకు వేర్వేరుగా టెండర్లు పిలిచేవారు.. ఇప్పుడు తొమ్మిది జోన్ ల వారీగా మాత్రమే టెండర్లు పిలవడంతో తెలంగాణ కాంట్రాక్టర్లకు నష్టం వాటిల్లుతోంది. అధికారులు పేర్కొన్న స్పెసిఫికేషన్స్ కూడిన వాహనాల్లో ఒక క్యూబిక్ మీటర్ మెటీరియల్ కూడా తరలించడం సాధ్యం కాదు.. గతంలో ఇందుకు వినియోగించిన వాహనాల్లో రెండు నుంచి మూడు క్యూబిక్ మీటర్ల మెటీరియల్ తరలించే వారు. అధికారులు ఒక సంస్థకు, రెండు కాంట్రాక్టు ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చేలా నిబంధనలు మార్చడంతో ఒక్కో ఏడాదికి రూ. 5. 85 కోట్ల అదనపు భారం పడుతుంది.ఈ టెండర్లను వెంటనే రద్దు చేసి.. గతంలో మాదిరిగా వార్డుల వారీగా టెండర్లు పిలిస్తే 150 మంది స్థానిక కాంట్రాక్టర్లకు ఉపాధి లభిస్తుంది.. మున్సిపల్ శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రిగారు తన శాఖలో జరుగుతోన్న అక్రమాలపై దృష్టి సారించి వెంటనే చర్యలు చేపట్టాలి.

## జపాన్? లోని కితాక్యూషూ సిటీ మేయర్ కజుహిసా టకేచీ ప్రతినిధి బృందం

Kazuhisa Takeuchi

Mayor, Kitakyushu City



కొద్దిసేపటి క్రితమే హైదరాబాద్?కు చేరుకున్నారు. రేపు పరేడ్? గ్రౌండ్స్?లో జరిగే తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు జపాన్? ప్రతినిధి బృందం హాజరవ నుంది. అనంతరం ఐటీసీ కాకతీయ హెూటల్?లో తెలంగాణ, కితాక్యుషూ పరస్పర సహకార ఒప్పందం చేసుకుంటాయి. ఇటీవల ముఖ్యమంత్రి ఎ.రేవంత్? రెడ్డి జపాన్? పర్యటనకు వెళ్లిన సందర్భంగా కితాక్యుషూ సిటీని సందర్శించారు. అదే సందర్బంగా హైదరాబాద్?కు రావాలని మేయర్ ను ఆహ్వానించారు. ఒకప్పుడు జపాన్‌లో అత్యంత కాలుష్యంతో ఉన్న సిటీ కితక్యూషూ. గాలి, నీరు, నేల విషపూరితంగా ఉండేవి. ఇప్పుడు ఈ నగరం పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఉత్తమ ఉదాహరణగా నిలిచింది.

## జగన్ను చంపేందుకు కుట్ర: మాజీ ఎమ్మెల్యే

**AP: రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత**



తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రాప్తాడు పర్యటనకు వచ్చినప్పుడు ఆయనను చంపేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. రెడ్ బుక్ పాలనలో లా అండ్ ఆర్డర్ గాడితప్పిందని మంత్రి లోకేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ తమ చేతులను కట్టేశారని, లేదంటే చుక్కలు చూపించే వాళ్లమని హెచ్చరించారు.

# జగన్, లోకేశ్ మధ్య వాదనలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉంది: షర్మిల..

**పదో తరగతి రీకౌంటింగ్‌పై జగన్, లోకేశ్ వాదనలు- హాస్యాస్పదమన్న షర్మిల**

**వైసీపీ హయాంలో రీకౌంటింగ్‌లో 20% మందికి అదనపు మార్కులు**

**కూటమి ప్రభుత్వంలో 30 వేల దరఖాస్తులకు 11 వేల మందికి ఫస్ట్ క్లాస్**

**ఇది ప్రభుత్వాల వైఫల్యమేనన్న ఏపీ కాంగ్రెస్ చీఫ్ - అన్ని పేపర్లు ఉచితంగా రీవెరిఫికేషన్ చేయాలని డిమాండ్**




పదో తరగతి పరీక్ష ఫలితాల రీకౌంటింగ్ విషయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మధ్య జరుగుతున్న వాదనలు "దెయ్యాలు వేదాలు వల్లించినట్లు" ఉన్నాయని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. విద్యావ్యవస్థను గత, ప్రస్తుత ప్రభుత్వాలు భ్రష్టు పట్టించాయని ఆమె ఆరోపించారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు."వైసీపీ పాలనలో ప్రతి సంవత్సరం రీకౌంటింగ్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల్లో దాదాపు 20 శాతం మంది తిరిగి అధిక మార్కులతో పాస్ అయ్యేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా అదే పరిస్థితి నెలకొంది. రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న 30 వేల మంది విద్యార్థుల్లో ఏకంగా 11 వేల మందికి ఫస్ట్ క్లాస్ మార్కులు రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీన్నిబట్టి పేపర్ల మూల్యాంకనంలో ఎంత చిత్తశుద్ధి ఉందో, ఎంత క్రమశిక్షణతో పేపర్లు దిద్దారో అర్థం చేసుకోవచ్చు. ఫలితాల్లో పారదర్శకత కొరవడిందని స్పష్టమవుతోంది. విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేశారనడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి అవసరం లేదు" అని షర్మిల విమర్శించారు.గత పదేళ్లుగా రాష్ట్రంలో విద్యార్థులు కాదు, ప్రభుత్వాలే ఫెయిల్ అవుతున్నాయని షర్మిల దుయ్యబట్టారు. "వాస్తవానికి ఫెయిల్ అయ్యింది విద్యార్థులు కాదు. పేపర్లు సరిగ్గా దిద్దలేని వైసీపీ, కూటమి ప్రభుత్వాలే రాష్ట్రంలో గత 10 ఏళ్లుగా ఫెయిల్ అవుతున్నాయి. పిల్లల భవిష్యత్తును నిర్ణయించడంలో విఫలమైన వీళ్లు రాష్ట్రాన్ని ఏం ఉద్ధరిస్తారు? చదువులతో చెలగాటం ఆడుతున్నారు. విద్యార్థుల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారు. ధనదాహం మీద ఉన్న శ్రద్ధ విద్యావ్యవస్థను బాగుచేయడం మీద వీరికి లేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు."30 వేల మంది విద్యార్థులకు సంబంధించి 60 వేల పేపర్లకు రీకౌంటింగ్ దరఖాస్తులు వస్తే, అందులో 11 వేల మందికి అత్యున్నత మార్కులు రావడం పూర్తిగా మీ ప్రభుత్వ వైఫల్యమే. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ గారు విఫలమైనట్లే. దీనిపై తక్షణమే విచారణ జరిపించాలి. పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి పేపర్‌ను ఉచితంగా రీవెరిఫికేషన్ చేయాలి" అని షర్మిల డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని ఆమె స్పష్టం చేశారు.

# ఏటీఎంలో దొంగలు పడ్డారు?

**సూర్యపేట జిల్లా:మే 01:** సూర్యాపేట జిల్లాలో భారీ ఏటీఎం చోరీ జరిగింది జిల్లాలోని హుజూర్ నగర్ లింగగిరి రోడ్డులో ఉన్న ఎస్బిఐ ఎటిఎం లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్టు తెలిసింది.. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...హుజూర్ నగర్ పట్టణం లోని లింగగిరి రోడ్డులో గల ఎస్బీఐ బ్యాంక్ సంబం ధించిన ఏటీఎం దగ్గర ఆదివారం అర్ధరాత్రి 2-30 గంటలకు సమయంలో



నలుగురు వ్యక్తులు ఫార్చు నర్ కారులో అనుమానాస్ప దంగా కనిపిస్తున్నారని ఒక లారీ డ్రైవర్ పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు.వెంటనే పోలీస్ సిబ్బంది సమయానికి అక్కడికి వెళ్లేసరికి అక్కడి నుంచి దుండగులు పరారైనట్లు తెలిపారు. అప్పటికే గ్యాస్ కట్టర్లతో వచ్చి అందులోని లాకర్ పగలగొట్టి అందులో ఉన్న నగదును దొంగలించి వెళ్లారని గ్యాస్ కట్టర్ తో కట్ చేసే సమయంలో కొంత నగదు కూడా కాలిపోయిందని తెలిపారు. వెంటనే ఫైర్ సిబ్బందిని అధికారులు పిలిపించి మంటలు అర్పించామని తెలిపారు. అందులో సుమారు 20 లక్షల వరకు నగదు ఉండవచ్చునని తెలుస్తుంది. అందులో ఎంత నగదు ఉన్నది అనేది బ్యాంకు సంబంధించిన అధికారులు తెలియజేయా ల్సి ఉంది..

# చిన్న పిల్లాడి సైకిల్‌పై వైసీపీ సైకోల ప్రతాపం నెటిజన్ల ఆగ్రహం!

వైసీపీలో అందరూ సైకోలే ఉంటారని మరోసారి నిరూపితమయింది. జోగి రమేష్ ఇంట్లో శుభకార్యం జరుగుతూంటే.. రాజకీయంగా ర్యాలీ నిర్వహించారు. అంతేనా వారు వెళ్లే దారిలో ఓ చిన్న పిల్లవాడు .. చిన్న సైకిల్ తొక్కుకుంటూ ఉంటే..దాన్ని లాక్కుని విసిరి కొట్టి పైశాచిక ఆనందం పొందారు. తన సైకిల్ ఎందుకు లాక్కున్నారో.. తెలియని ఆ పిల్లవాడు బిక్కచచ్చిపోయాడు. వారు ఆ సైకిల్ తన సైకోతనం చూపించిన తర్వాత మిగిలిన సైకిల్ ను తీసుకెళ్లాడు.ఈ దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. బలహీనుడు.. పిల్లవాడు ఏమీ చేయలేదని అతని వద్ద సైకిల్ లాక్కుని చూపించిన సైకోతనం చూసి ఎవరికైనా భయం వేస్తుంది. వీళ్లు అధికారంలో ఉన్నప్పుడు సామాన్యులపై ఎన్ని అఘాయిత్యాలకు పాల్పడ్డారో ఈ ఘటనే సాక్ష్యంగా కనిపిస్తోంది. సైకిల్ అనేది టీడీపీ గుర్తు



కావొచ్చు అంత మాత్రాన అంత సైకోతనం చూపించాల్సిన అవసరం ఏముంది ?ఇలాంటి సైకోలు ఐదు సంవత్సరాల పాటు.. తమ ఘోరాలు చేశారు. వారిని పోలీసులు చూసీ చూడనట్లుగా వదిలేశారు. బలహీనులు, పిల్లలు ఎదురుపడితే కనీసం విచక్షణ కూడా ఉండకుండా ప్రవర్తిస్తారని మరోసారి నిరూపితమయింది. ఇలాంటి వారిపై ఎన్ని కేసులు పెట్టి..ఎన్ని రోజుల్లో జైల్లో ఉంటే మార్పు వస్తుంది. జగన్ రెడ్డి పార్టీ క్యాడర్ ను ఇలా తయారు చేశారు. జనంపైకి రాక్షసుల్ని వదిలారని నెటిజన్లు ఉగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నారా లోకేష్ పోస్టు చేసిన వీడియో వైరల్ అవుతోంది. వైసీపీ ఎప్పటికీ మారదని వారికి శాశ్వత రాజకీయ సమాధి కట్టడమే మార్గమన్న అభిప్రాయం ఎక్కువ మంది వ్యక్తం చేస్తున్నారు.

# కేసీఆర్ రిటైర్మెంట్ రెండు పార్టీలకు గౌరవాధ్యక్షుడు?



భారత రాష్ట్ర సమితి రాజకీయాలు ఎవరూ ఊహించని విధంగా మారుతున్నాయి. కవిత మాట్లాడినప్పుడల్లా ఆమెకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తారు అని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. కానీ అలాంటి సూచనలేమీ లేవు. పైగా కేసీఆర్ ఫోటోతోనే కవిత రాజకీయం చేస్తున్నారు. కేసీఆర్ , ప్రొఫెసర్ జయశంకర్ ఫోటోలతోనే జాగృతి కొత్త కార్యాలయాన్ని ప్రకటించారు. కేసీఆర్ పై ఈగ వాలితే సహించేది లేదన్నారు. అంతే కాదు.. కేసీఆర్‌కు బీఆర్ఎస్ ఎంతో జాగృతి కూడా అంతేనని తేల్చారు.

**కేసీఆర్ ఆశీస్సులు ఉన్నాయని కవిత నమ్మకం**

తన రాజకీయ పోరాటం విషయంలో కవిత చాలా స్పష్టంగా ఉన్నారు. తెలంగాణ జాగృతిని రాజకీయ పార్టీగా మార్చబోతున్నారు. పూర్తి స్థాయిలో రాజకీయ పార్టీగా ప్రకటించే ముందే ఆమె దాన్ని ఓ పోరాట సంస్థగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. అప్పటి వరకూ బీఆర్ఎస్ నీడలోనే ఉంచుతారు. పేరుకే అలా ఉంచుతారు కానీ.. సరైన సమయం కోసం ఎదురు చూస్తారు.కేసీఆర్ ఆశీస్సులు తనకు ఖచ్చితంగా ఉంటాయని ఆయన మార్గనిర్దేశకత్వంలోనే పోరాటం ఉంటుందని కవిత సంకేతాలు ఇస్తున్నారు. ఇది ఆశ్చర్యకరమైన పరిణామమే అనుకోవచ్చు.

**కేసీఆర్ రాజకీయ రిటైర్మెంట్ ?**

ప్రస్తుతం కేసీఆర్ బీఆర్ఎస్ ను పూర్తిగా కేటీఆర్ కు అప్పగించారు. ఆయన రోజువారీ వ్యవహారాలు చూడటం లేదు. ఇప్పుడు కవిత ఇష్యూతో ఆయన మరింత మనస్తాపానికి గురయ్యారు. రాజకీయం కోసం తన బిడ్డల మధ్య చిచ్చు పెట్టి తాను ఒకరికి దూరం కావాలని అనుకోవడం లేదు. కవిత అంటే ఆయనకు ప్రత్యేకమైన అభిమానం ఉంది. అందుకే ఇప్పటి వరకూ చర్యలు తీసుకోవడం లాంటివి చేయలేదు. చేస్తారని కూడా అనుకోవడం లేదు. జాగృతి అనేది ఇంకా రాజకీయ పార్టీగా మార్చలేదు కాబట్టి పార్టీకి వ్యతిరేకం కాదని చెప్పుకోవచ్చు. కానీ ఇవాళ కాకపోతే రేపైనా వాస్తవాన్ని అంగీకరించక తప్పదు. అందుకే కేసీఆర్ రాజకీయంగా రిటైర్మెంట్ తీసుకుని.. పరోక్షంగా రెండు పార్టీలకు గౌరవాధ్యక్షుడిగా నేరుగా లేకపోతే పరోక్షంగా అయినా వ్యవహరించవచ్చని భావిస్తున్నారు.

**కలుపుకుని పోలేని కేటీఆర్ వల్లే !**

కేటీఆర్ చేసే దూకుడు రాజకీయాలపై కేసీఆర్ కు అంత నమ్మకం లేదు. చాలా కాలంగా పార్టీని నడిపించే బాధ్యతను ఇచ్చినా పెద్దగా మార్పును కేటీఆర్ చూపించలేకపోయారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆయన పాత్ర ప్రభావం తక్కువగానే ఉంది. పైగా నేతల్ని కాపాడుకోలేకపోతున్నారు. సొంత పార్టీలో కొంత మందిని ప్రోత్సహిస్తూ మరికొంత మందిని దూరం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ లో చేరిన చాలా మంది ప్రముఖ నాయకులు కేటీఆర్ తీరు వల్లనే పార్టీకి దూరమయ్యారు. అందుకే కేటీఆర్ నాయకత్వంపై కేసీఆర్ కూ అంత నమ్మకం లేదని అంటున్నారు.కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరైన తర్వాత కేసీఆర్ అమెరికా వెళ్లే అవకాశం ఉంది. ఐదారు నెలల పాటు రాకపోవచ్చని చెబుతున్నారు. అప్పుడు బీఆర్ఎస్ రాజకీయం మరింత ముదిరి పాకాన పడనుంది.

# జగన్ భవిష్యత్ ను భయంకరం చేసినట్లుగా చేయగలవా సజ్జలా ?



ముఖ్యమంత్రి చంద్రబాబుకు భవిష్యత్ భయంకరంగా ఉంటుందని నెల్లూరు జైలు ముందు నిలబడి సజ్జల రామకృష్ణారెడ్డి వార్నింగ్ ఇచ్చారు. ఆయన మాటలు విని పక్కన ఉన్న వాళ్లు కూడా.. కావాలంటే జగన్ రెడ్డిని చూడండని మనసులో అనుకుని ఉంటారు. చంద్రబాబు ఇప్పటికి నాలుగోసారి సీఎం అయ్యారు. ఎప్పుడూ లేనంతగా ఇప్పుడు అక్రమార్కుల్ని వెంటాడుతున్నారు. తప్పు చేసిన వాళ్లు రాజకీయ ముసుగులో ఉన్నా వదిలి పెట్టడం లేదు. అధికారం శాశ్వతం అనుకుని అడ్డగోలుగా చెలరేగిపోయారు. ఇప్పుడు వారంతా జైలుకెళ్తూంటే.. చంద్రబాబును బెదిరిస్తున్నారు.చంద్రబాబు తన రాజకీయ జీవితంలో చూడనంతటి ఘోరాలని వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చూశారు. కానీ జగన్ రెడ్డి ఇప్పుడు చూస్తున్నారు. ఎంతో రాజకీయ భవిష్యత్ ఉందనుకున్న ఆయనను పాతాళంలోకి నెట్టేసే సలహాలు ఇచ్చింది సజ్జల. జగన్ రెడ్డి భవిష్యత్ ను అత్యంత భయానకం చేసింది సజ్జల. అంత కంటే ఎక్కువ భయానకాన్ని ఎవరూ చేయలేరు. చంద్రబాబును బెదిరించినంత మాత్రాన ఆయన భవిష్యత్ ను ఎవరూ భయానకం చేయలేరు. అరిచే కుక్కలు కరవవన్న సామెత ఉంది. ఎంత బెదిరించినా.. భయపడేవారు ఉండరు.ముందు జగన్ రెడ్డికి ఉన్న భయానక భవిష్యత్ కు సజ్జల బాధ్యత తీసుకోవాల్సి ఉంది. ఇప్పుడే ఆయన నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. వచ్చే కొద్ది రోజుల్లో సజ్జలకు భయంకరమైన భవిష్యత్ కనిపిస్తుంది. ఇప్పటికే ఆయన కుమారుడి కోసం కిందా మీదా పడుతున్నారు. రేపు సజ్జల టైం రాదని ఎవరూ చెప్పలేరు. పిట్ట బెదిరింపులకు భయపడి.. వైసీపీ నేతలు చేసిన తప్పుడు పనుల్ని చూసి వదిలి పెట్టేస్తారనుకుంటే సజ్జల కంటే అమాయకుడు ఉండరేమో ?

# మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్ గా మేఘా సుధా రెడ్డి



మిస్ వరల్డ్ పోటీలు ఫైనల్‌కు వచ్చిన సమయంలో హైదరాబాద్‌లోని హై ప్రొఫైల్ వర్గాల్లో ఎక్కడా లేనంత సందడి కనిపిస్తోంది. ధనవంతులు, ఫ్యాషన్ ప్రియులు అంతా హైటెక్స్ లోనే కొలువుదీరారు. అందరిలోనూ ప్రత్యేకంగా మేఘా సుధారెడ్డి నిలిచారు. ఆమెను మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్ గా నియమించారు. ఈ నియామకం సందర్భంగా జ్ఞాపికను మిస్ వరల్డ్ సిఈఓ జూలియా మోర్లీ అందించారు. తనను నియమించినందుకు చాలా ఆనందంగా ఉందని సుధారెడ్డి అన్నారు. అద్భుతమైన ఏర్పాట్లకు తెలంగాణ ప్రభుత్వానికి, టూరిజం శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.మేఘా సుధారెడ్డికి ఫ్యాషన్ పై ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. మిస్ వరల్డ్ పోటీల విషయంలో ఆమె పెద్ద ఎత్తున ఖర్చు పెట్టి కొన్ని కార్యక్రమాలనూ నిర్వహించారు. తన ఇంట్లో 'బ్యూటీ విత్ ఏ పర్పస్' గాలా విందు కూడా ఇచ్చారు. ఈ విందుకు దేశంలోని రాజ కుటుంబాల ప్రతినిధులు హాజరయ్యారు. చాలా హై రేంజ్ లో ఈ పార్టీ జరిగింది. అలాగే ముఖ్యమైన కార్యక్రమాలకూ స్పాన్సర్ షిప్ ఇచ్చారు. అందుకే గ్లోబల్ అంబాసిడర్ గా నియమించారు.గతంలో అమెరికాలో జరిగే మెట్ గాలా వేడుకల్లోనూ సీటు రిజర్వ్ చేసుకుని వెళ్లారు. ఆమె కోసం మేఘా కృష్ణారెడ్డి ప్రత్యేకమైన ఫ్యాషన్ కార్యక్రమాలకు స్పాన్సర్ చేస్తూంటారని ప్రచారం జరుగుతూ ఉంటుంది. మొత్తంగా మిస్ వరల్డ్ పోటీల విషయంలో మేఘా కృష్ణారెడ్డి కి ఖర్చు కాస్త ఎక్కువే అయిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయనకు భార్యపై ఉన్న ప్రేమ ముందు ఈ ఖర్చు తక్కువేనని కొంత మంది అంటున్నారు.

# థాయ్ బ్యూటీకి మిస్ వరల్డ్ కిరీటం!




హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల్లో థాయ్ ల్యాండ్ సుందరి ఓపల్ సుచాతా చువాంగ్ శ్రీ విజేతగా నిలిచారు. మిస్ వరల్డ్ గా ఎంపికైన తర్వాత తాను మానసిక ఆరోగ్యం కోసం ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తానని..తన ఆశయాల గురించి గొప్పగా చెప్పారు. దాంతో జడ్జిలు ఆమెకే ఓటేశారు. హైదరాబాద్ లోని హైటెక్స్ లో అత్యంత వైభవంగా జరిగిన ఈ ఫైనల్స్ కు.. 108 మంది అందగత్తెలు ఆయా దేశాల నుంచి ప్రాతినిధ్యం వహించారు. భారత సుందరి నందిని గుప్తా.. టాప్ 20కి చేరుకున్నారు కానీ టాప్ 8వరకూ చేరుకోలేకపోయారు.హైదరాబాద్‌లో ఈ వేడుక జరగడంతో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకమైన క్రేజ్ వచ్చింది. హైటెక్స్ లో ఏర్పాటు చేసిన ఫైనల్స్ కోసం దేశంలోని ప్రముఖులంతా వచ్చారు. చిరంజీవి దంపతులు , రేవంత్ రెడ్డి దంపతులు కూడా హాజరయ్యారు.ఇండస్ట్రీ వర్గాల నుంచి ఫ్యాషన్ పై ఆసక్తి ఉన్న అందరూ హాజరయ్యారు. వేదికపై ఇషాన్ ఖట్టర్, జాక్వలైన్ ఫెర్నాండెజ్ పర్ఫామెన్స్ ఇచ్చారు. జడ్జిలలో సోనుసూద్, రానా దగ్గుబాటి, నమ్రతా శిరోద్కర్ కూడా ఉన్నారు. సోనుసూద్ కు బెస్ట్ మానవతావాది అవార్డు కూడా ఇచ్చారు.భారతీయతతో కలసి.. అద్భుతంగా జరిగిన మిస్ వరల్డ్ పోటీలకు అంతే ఘనమైన ముగింపు లభించింది. థాయ్ ల్యాండ్ యువతికి పెద్దఎత్తున అభినందనలు అందుతున్నాయి. పోటీలను విజయవంతంగా నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వానికి అందరూ కృతజ్ఞతలు తెలిపారు.

# పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్



పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్ పంచాయతీ ఎన్నికల్లో వికలాంగుల రిజర్వేషన్ పై పక్క రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు లేఖ రాసి రోజులు గడుస్తున్న నేటికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించకపోవడంపై ఆగ్రహంపంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం నరేష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గరిడేపల్లి మండలం ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాడు పీసీసీ అధ్యక్షుని హోదాలో తమ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే అదే నెల నుంచి వికలాంగుల పెన్షన్ 6 వేలకు వృద్ధులు వితంతులు గీతా కార్మికుల బీడీ కార్మికుల పింఛలను 4 వేలకు పెంచుతామని అనేక బహిరంగ సభల్లో అనేక వేదికల మీద చెప్పి పింఛన్దారుల ఓట్లను కొల్లగొట్టి 16 నెల నుంచి ముఖ్యమంత్రిగా చలామణి అవుతూ నేటికీ ఎన్నికల సమయంలో పింఛన్దారులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచేందుకు కృషి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగాలేదని తనను కోసిన తాను ఏమీ చేయలేవనంటూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా దాదాపు 26 వేల మంది వికలాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా రాజకీయ అవకాశం కల్పించే అవకాశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతిలో ఉన్న ఎందుకు పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించేందుకు వెనకడుగు వేస్తున్నారో తెలంగాణ వికలాంగుల సమాజానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని ముఖ్యంగా ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలు అయినా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం హామీని రాష్ట్రంలో వికలాంగుల అట్రాసిటీ చట్టం అమలు హామీని రాష్ట్రంలో వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాల భర్తీ హామీని వికలాంగుల సంక్షేమ శాఖ ప్రత్యేక శాఖ గుర్తింపు హామీని ముఖ్యంగా ఏఐసీసీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్ కల్పిస్తామన్న హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 16 నెలల పాలనాకాలంలో నెరవేర్చకుండా అడుగడుగున వికలాంగుల సమాజంపై వివక్ష ప్రదర్శిస్తున్న తీరు బాధాకరమని రాష్ట్రంలో వికలాంగులకు అవసరమైన పరికరాలను సైతం అందించలేని ద్రౌభాగ్యకరమైన స్థానంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తీరు మార్చుకొని పైసా ఖర్చు లేకుండా ఉన్న పంచాయతీ ఎన్నికల్లో వికలాంగుల రిజర్వేషన్ హామీని అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన పెన్షన్ పెంపు హామీతో పాటు ఇతర హామీలను వెంటనే నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని లేకుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై అసెంబ్లీ ఎన్నికల హామీలు నెరవేర్చేంతవరకు ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం నరేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు సంఘం గరిడేపల్లి మండల మహిళా అధ్యక్షురాలు నాగమణి జిల్లా మాజీ అధ్యక్షుడు కుర్ర గోపి యాదవ్ చారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

# అలంపూర్ జోగులాంబ దేవి బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్గాలోని ప్రత్యేక ప్రార్థనలు

అలంపూర్ జోగులాంబ దేవి బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్గాలోని ప్రత్యేక ప్రార్థనలో చర్చిలోని ప్రత్యేక ప్రార్థన పాల్గొన్న?జోగులాంబ గద్వాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్.కిషోర్ గారు? జోగులాంబ గద్వాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్.కిషోర్ గారు వారి జన్మదిన సందర్భంగా అలంపూర్ జోగులాంబ దేవి బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్శించుకుని , అలంపూర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు మరియు చర్చిలోని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి , సర్వ మత ప్రార్థనలో పాల్గొనడం సంతోషకరమైన అన్నారు .

**అనంతరం**

అలంపూర్ ప్రభుత్వ ఆసుపత్రి లో తన జన్మదిన సందర్భంగా పాలు, పండ్లు, బ్రేడ్లు పంపిణి చేసి పేషెంట్ ఆరోగ్య సమస్య లు తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

**అనంతరం**

అలంపూర్ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిర్వహించిన కేక్ కటింగ్ లో పాల్గొనడం జరిగినది. ?ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రుక్కు గారు , కనకం



బాబు గారు , శ్రీను గారు , నాగరాజు గారు, వెంకట రాములు గారు , సురేష్ గారు, కిషోర్ గారు , విజయ్ గారు , ప్రతాప్ గారు , ఏసేపు గారు, దివాకర్ గారు , అలంపూర్ బిఆర్ఎస్ పార్టీ టౌన్ నాయకులు , బిఆర్ఎస్ పార్టీ నాయకులు, యూత్ సభ్యులు మరియు కిషోర్ అన్న యువసైన్యం సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

# కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లురవికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



విమానాశ్రయంలో మల్లురవిని కలుసుకున్న ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని అధిష్ఠానం ఇటీవల నియమించింది. 70 మందితో కూడిన పలు కమిటీలను ఏఐసీసీ ప్రకటించింది. వినేపద్యంలో డాక్టర్ మల్లు రవి ఢిల్లీలో ఈ కార్యక్రమానికి హాజరై ఆదివారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి తదితరులు డాక్టర్ మల్లురవిని కలుసుకొని స్వాగతం పలికారు. అదేవిధంగా స్థానిక మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, పట్టణ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, పార్లమెంటరీ యువ నాయకుడు పురుషోత్తం రెడ్డి తదితరులు డాక్టర్ మల్లు రవికి సన్మానం చేసి స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా. 22 మందితో రాజకీయ వ్యవహారాల కమిటీని.. 15 మందితో సలహా కమిటీ, ఏడుగురితో డీలిమిటేషన్ కమిటీ, 16 మందితో 'సంవిధాన్ బచావో ప్రోగ్రాం' కమిటీ, ఆరుగురితో క్రమశిక్షణ కమిటీని నియమించారు. ఈ కమిటీలు తక్షణమే అమల్లోకి వస్తాయని కేసీ వేణుగోపాల్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

**రాజకీయ వ్యవహారాల కమిటీలో ఎవరంటే**

మీనాక్షి నటరాజన్, మహేశ్ గౌడ్, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, వంశీచంద్ రెడ్డి, జి.రేణుకా చౌదరి, పోరిక బలరాం నాయక్, డి.శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, షబ్బీర్ అలీ, మహ్మద్ అజారుద్దీన్, ఆది శ్రీనివాస్, శ్రీహరి, బీర్ల అయిలయ్య, పి.సుదర్శన్ రెడ్డి, కె.ప్రేమ్‌సాగర్ రావు, కుసుమ్‌కుమార్, అనిల్ కుమార్ కమిటీలో ఉన్నారు. ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల ప్రధాన బాధ్యులు ఉంటారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మంత్రులు వ్యవహరించనున్నారు.

**సలహా కమిటీ..**

మీనాక్షి నటరాజన్, రేవంత్‌రెడ్డి, మహేశ్ గౌడ్, వి.హనుమంతరావు, కె.జానారెడ్డి, కె.కేశవరావు, మధుయాష్కీ గౌడ్, జి.చిన్నారెడ్డి, గీతారెడ్డి, ఎం. అంజన్‌కుమార్‌యాదవ్, జగ్గారెడ్డి, జాఫర్ జావేద్, టి.జీవన్‌రెడ్డి, రాజయ్య, రాములు నాయక్ డీలిమిటేషన్ కమిటీ..: చల్లా వంశీ చంద్ రెడ్డి, గద్వాల విజయలక్ష్మి, ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, శ్రావణ్‌కుమార్ రెడ్డి, పవన్ మల్లాది, వెంకటరమణ సంవిధాన్ బచావో ప్రోగ్రాం కమిటీ..: పి.వినయ్ కుమార్, అద్దంకి దయాకర్, వీర్లపల్లి శంకర్, ఎన్.బాలు నాయక్, నర్సారెడ్డి, ఆత్రం సుగుణ, రాచమల్ల సిద్ధేశ్వర్, సంతోష్ కోల్కొండ, అనిల్‌కుమార్, జూలూరి ధనలక్ష్మి, మజీద్‌ఖాన్, జి.రాములు, అర్జున్‌రావు, సౌరి, వల్లభరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి

**క్రమశిక్షణ కమిటీ..**

ఎంపీ మల్లు రవి (చైర్మన్), ఎ.శ్యామ్‌మోహన్ (వైస్ చైర్మన్), సభ్యులుగా ఎం. నిరంజన్ రెడ్డి, బి. కమలాకర్‌రావు, జాఫర్ జాయెద్, జి.వి.రామకృష్ణ ఉన్నారు..

# పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమావేశం

**తెలుగు - వెలుగు, తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):**

అనపర్తి ద్వారంపూడి బుల్లెమ్మాయి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 2006-07 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు. ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వపు విద్యార్థులంతా గతంలో చదువుకున్న పాఠశాలలో ఆదివారం కలుసుకుని ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు.18 ఏళ్ళ అనంతరం కలుసుకోవడంతో సందడి నెలకొంది. నాటి తీపి గుర్తులను గుర్తు చేసుకుంటూ పూర్వపు విద్యార్థులు రోజంతా ఆనందంగా గడిపారు.



# జపాన్లో బుల్లెట్ ట్రైన్ ట్రయల్ రన్

ముంబై-అహ్మదాబాద్ మధ్య పరిగెత్తబోయే మొట్టమొదటి బుల్లెట్ ట్రైన్ ట్రయల్ రన్ జపాన్లో జరుగుతోంది. ఇండియాలో వాతావరణ పరిస్థితులను ఈ ట్రైన్ తట్టుకోగలదా అనే విషయాలను పరీక్షిస్తున్నారు. ట్రయల్ రన్ పూర్తి కాగానే 2026లో వీటిని భారత్కు అందిచనున్నారు. ఈ ట్రైన్ రాకతో ముంబై-అహ్మదాబాద్ మధ్య 508%ఖవీ% దూరాన్ని కేవలం 2.7.గంటల్లోనే ప్రయాణించవచ్చు. రెండు షింకన్సెన్ బుల్లెట్ ట్రైన్లను జపాన్ గిఫ్ట్ గా ఇస్తోంది.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ లను అమలు చేయాలి. సిపిఐ రామకృష్ణ





శేరిలింగంపల్లి. మసీద్ బండ. సిపిఐ శాఖల మహాసభలు. బి నారాయణ అధ్యక్షతన సిపిఐ మండల కార్యాలయం ఇజ్జత్ నగర్ లో జరిగినవి. ఈ కార్యక్రమానికి. ముఖ్య అతిథులుగా సిపిఐ రామకృష్ణ శేర్లింగంపల్లి నియోజకవర్గ కార్యదర్శి. పాల్గొని మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ. ఎలక్షన్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. 6 గ్యారంటీలను. తక్షణమే అమలు చేయాలని.. లేనిపక్షంలో. ప్రజా ఆందోళన. కార్యక్రమాలు చేపడతామని. ప్రభుత్వాన్ని. హెచ్చరించారు... అకాల వర్షాల వల్ల. రైతులు ఎంతో నష్టపోయారని. వారికి తక్షణ సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్షాలు మొదలు కావడంతో హైదరాబాద్ మహానగరంలో జిహెచ్ఎంసి. మొద్దు నిద్ర నువ్వు విడాలని. తక్షణమే. నాళాలను కాలువలను. పునర్నిర్మాణం చేపట్టాలని. జిహెచ్ఎంసిని దుయ్యబట్టారు. ముఖ్యంగా శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ఇల్లు లేని నిరుపేదలకు. తక్షణమే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చి ఆదుకోవాలని చెప్పి కోరారు. ఈ కార్యక్రమంలో. తుపాకుల రాములు. ఏఐటీయూసీ శేర్లింగంపల్లి అధ్యక్షులు. బి నారాయణ. ఎం వెంకటేష్. తదితరులు పాల్గొన్నారు. శేరిలింగంపల్లి మసీదు బండల నూతన కమిటీని ప్రకటించడం జరిగింది...

# శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దీవెనలు ప్రజాలందరిపై ఉండాలి

**శ్రీమతి.శ్రీ.వి.పూజిత జగదీశ్వర్ గౌడ్ గారు,ఆలయ ధర్మకర్తలు**



**నల్లగండ్ల గ్రామం,గచ్చిబౌలి డివిజన్**

శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వార్ల కల్యాణం ఈరోజు శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో నల్లగండ్ల గ్రామంలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు ఆలయ ధర్మకర్త,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్/హాఫీజ్ పెట్ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి.శ్రీ.వి.పూజిత జగదీశ్వర్ గౌడ్ గారు..కల్యాణం విశిష్టత తెలియచేస్తూ ఒగ్గలో,పోతురాజుల విన్యాసాల నడుమ భక్తులు స్వామివారికి బోనాలు సమర్పించారు..టీపిసిసి అధ్యక్షులు, గౌరవ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు,ప్రభుత్వ ముఖ్య సలహాదారులు మహమ్మద్ అలీ షబీర్ గారు ,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ గారు,ఖైరతాబాద్ ఎంఎల్ఏ శ్రీ దానం నాగేందర్ గారు,కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ గారు, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు రోహిన్ రెడ్డి గారు,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్ల నర్సింహ రెడ్డి గారు,ఎమ్మెల్సీ ఎం ఎస్ ప్రభాకర్ గారు, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్,ఉప్పలపాటి శ్రీకాంత్,బొంతు శ్రీదేవి,పుష్ప నగేష్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు శ్రీమతి కాల్వ సుజాత, జేరిపేటి జైపాల్ , మెట్టు సాయి కుమార్ గార్లు, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గా రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ గారు, ప్రచార కమిటి చైర్మన్ మరియు మాజీ పార్లమెంట్ సభ్యులు మధు యాష్కీ గారు,కూకట్పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ గారు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు , నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# క్యాన్సర్ బాధితుడికి బిఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు శివ ప్రకాష్ ఆర్థిక సహాయం



**మన సాక్షి గొంతుక ప్రతినిధి/ శంకర్‌పల్లి**

గత కొన్ని రోజులుగా చైతన్యపురి డివిజన్ కాలనీలో నివాసం ఉంటున్న డాక్టర్ శ్రీధర్ సోదరుడు గోపాల్ ముక్కు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని కాలనీ వెల్ ఫేర్ సభ్యులు రాష్ట్ర యువజన నాయకుడు శివ ప్రకాష్, కాలనీ ప్రెసిడెంట్ అజయ్ కుమార్ లకు తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళవారం శివ ప్రకాష్, అతని మిత్రులు బాధితుడికి రూ.41 వేలు అందజేశారు. అనంతరం శివ ప్రకాష్ మాట్లాడుతూ క్యాన్సర్ బాధితుడి చికిత్స కొరకు మల్లారెడ్డి క్యాన్సర్ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడతానని హామీ ఇచ్చాడు. బాధితుడు శివ ప్రకాష్ కు కృతజ్ఞతలు తెలిపాడు

# ఉగ్రవాదుల అంతమే ఆపరేషన్ సింధూర్ లక్ష్యం

### బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు




**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

ఆపరేషన్ సింధూర్ విజయం, త్రివిధ దళాలకు వందనం అంటు స్వామి వివేకనంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఆల్విన్ కాలనీ డివిజన్ సాయినగర్ లో వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు లంగటి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కుమార్ యాదవ్ , శ్రీనాథ్ ల అధ్యక్షతనఘనంగా నిర్వహించారు. ఈ తిరంగా ర్యాలీకి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యువమోర్చా ప్రబారి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు యాదవ్ విచ్చేసి యువతను ఉద్దేశించి మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయం, చరిత్రలో మర్చిపోలేనటువంటి దినమని పాకిస్తాన్ భారత్ పై ఎన్ని కుట్రలు చేసినా భారత్ను ఎదుర్కొనే శక్తి పాకిస్తాన్ కు లేదన్నారు. ఉగ్రవాదుల స్థావరాలపైనే టార్గెట్ చేసి ఉగ్రవాదుల స్థావరాలను ఎయిర్ బేస్లను కూల్చి ఉగ్రవాదుల గుండెల్లో వణుకు పుట్టేలా మన సైనికులు పని చేశారు అన్నారు. పాకిస్తాన్ పౌరుల మీద కాకుండా కేవలం ఉగ్రవాదుల స్థావరాల మీదనే దాడులు చేసి ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకిలిస్తామని సంకేతం అందించిన గొప్ప దేశం మనదనీ గొప్ప సందేశాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్ స్పెక్టర్ నర్సింహా, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు, డాక్టర్ కొరదాల నరేష్, నాయకులు రామరాజు, దుర్గ ప్రసాద్, ఎత్తరి రమేష్ వివిధ కాలనీల కమిటీ సభ్యులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ క్రీడలకు అధిక ప్రాధాన్యత : బండి రమేష్

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో క్రీడలకు ప్రత్యేక ప్రోత్సాహాన్ని ఇస్తుందని ఇందుకు అవసరమైన వ్యయం ఎంతైనా భరించేందుకు సిద్ధంగా ఉందని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. నేషనల్ ఓపెన్ కరాటే టోర్నమెంట్ పోటీలు ఆదివారం కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో బాకీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బండి రమేష్ హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు పురుష లు అనే లేకుండా ప్రతి ఒక్కరికి ఆత్మ రక్షణ కోసం దృఢంగా ఉండాలని దీనికోసం ఆటలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అందులో ప్రత్యేకంగా కరాటే ఆత్మ రక్షణతో పాటు శారీరకంగా మానసికంగా వ్యక్తికి ఎంతో ధైర్యాన్ని ఇస్తుందన్నారు. అంతేకాకుండా క్రీడలు వ్యక్తుల మధ్య సత్సంబంధాలను పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. అలాగే దేశాల మధ్య వారధిగా కూడా క్రీడలు



దోహదపడతాయన్నారు. రాష్ట్రంలో ఆటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందన్నారు. ఇందుకోసం నిధులు సైతం విరివిగా ఖర్చు పెడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పుష్ప రెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్‌లో రూ.7.5 లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాల పట్టివేత



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో రూ.7.5 లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు నమ్మదగ్గ సమాచారం మేరకు మేడ్చల్ ఎస్ఓటి ఎస్సై ధనుంజయ, స్థానిక ఎస్సై శరత్, వ్యవసాయ శాఖ ఇన్చార్జ్ ఏడి నిశాంత్ కుమార్ సంయుక్తంగా షాద్ నగర్ పరిగి రోడ్డు బకర్మన్ గార్డెన్ ఆపోజిట్ లోని ఖాళీ స్థలం దగ్గర నిషేధిత నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారని సమాచారం అందింది. అక్కడ ఆపి ఉన్న హోండా మొబిలియో ఏపీ 03 బిఎల్ 5204 నంబరు గల వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 300 కిలోల నిషేధించిన పత్తి విత్తనాలను గుర్తించడం జరిగిందనీ వ్యవసాయ అధికారి తెలిపారు. వీర వసంత రావు అనే వ్యక్తి అమరావతి మండలం పల్నాడు జిల్లా నుండి చంద్రలపాడు గ్రామము, ఎన్టీఆర్ జిల్లా వాస్తవ్యుడు అయిన జంపాని నాగేశ్వర్ రావు పరిగి పట్టణంలో ఉంటూ వికారాబాద్ మండలం ధ్యాచెర్ల గ్రామములో పొలం కౌలుకు తీసుకోని నిషేదిత పత్తి విత్తనాలను సాగు చేస్తూ పక్క రైతులకు అమ్మడానికి షాద్ నగర్ లోని పరిగి రోడ్ లో గల బక్కర్మన్ గార్డెన్ ఆపొసిట్ లో గల కాళీ స్థలంలో ఇట్టి నిషేదిత పత్తి విత్తనాలను ముగ్గురు రైతులకు అంటగట్టడానికి చూడగా పోలీసు మరియు వ్యవసాయ శాఖ వారు పట్టుకోవడం జరిగిందనీ తెలిపారు..ఇట్టి తనిఖీ కార్యక్రమంలో షాద్ నగర్ ఇన్చార్జ్ ఏడి అగ్రికల్చర్ నిశాంత్ కుమార్, ఫరూక్ నగర్ వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్ కుమార్, ఎస్సై శరత్, మేడ్చల్ ఎస్ఓటి ఎస్సై ధనుంజయ పాల్గొనడం జరిగిందనీ పేర్కొన్నారు..

# కూలిన షాద్ నగర్ ఎక్సైజ్ కార్యాలయ పైకప్పు

### ఎక్సైజ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్ కు తీవ్ర గాయాలు

### ప్రాణాపాయస్థితిలో ఉన్న కానిస్టేబుల్ హైదరాబాద్ కు ఆసుపత్రికి తరలింపు

కాలం చెల్లిన ఎక్సైజ్ ప్రభుత్వ కార్యాలయం భవనం పైకప్పు అకస్మాత్తుగా కొంత భాగం కూలడంతో ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోనీ ఫరూక్ నగర్ లో ఉన్న ఎక్సైజ్ శాఖ కార్యాలయం పైకప్పు కొంత భాగం కూలింది. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విజయకుమార్ పై పడడంతో తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. వెంటనే మిగతా సిబ్బంది గాయపడిన విజయ్ కుమార్ ను ఆసుపత్రికి చికిత్స కోసం



తరలించారు. అతని పరిస్థితి విషమిస్తుండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించనున్నట్లు పేర్కొన్నారు. ఎప్పుడో కాలం చెల్లిన ఎక్సైజ్ శాఖ భవనం పైకప్పు కూలడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. భవనం నిర్మించి చాలా సంవత్సరాలు అయిందని స్థానికులు చెబుతున్నారు. కాలం చెల్లిన భవనం కాబట్టి ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సంఘటనతో స్థానికులు ఒకసారిగా కంగుతిన్నారు.

# కార్మికుల సంక్షేమం కోసం, ఐక్యత కొరకు, నిరంతరం కృషి చేయాలి

### ఐక్యతతోనే అన్నీ సాధ్యం - సెంట్రింగ్ అసోసియేషన్ అధ్యక్షులు నడికుడ ఆంజనేయులు

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో సెంట్రింగ్ అసోసియేషన్ కార్యాలయంలో నెలవారి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సెంట్రింగ్ అసోసియేషన్ అధ్యక్షులు నడికుడ ఆంజనేయులు యాదవ్ మాట్లాడుతూ.. అనేక ప్రయాసలకు ఓర్చి సెంట్రింగ్ అసోసియేషన్ కు ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషం గా ఉందని, ఇంకా పనులు పూర్తి స్థాయిలో కాకపోవడం కొంత సమయం పడుతుందనీ అన్నారు. ముఖ్యంగా అందరం ఐక్యంగా ఉండబట్టే కార్యాలయం పూర్తి చేయగలిగామని, ఇదే ఐక్యతను కొనసాగిస్తూ ముందుకు వెళ్లాలని, కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నడికూడ ఆంజనేయులు యాదవ్, టేకులపల్లి నర్సింలు, పాత్లావత్ భాస్కర్, పాత్లావత్ రమేష్ నాయక్, కె నర్సింలు, కె రాజు, అలీ భాయ్, రవి, మధు, నరసింహ, చందు, లక్ష్మణ్, గిరి తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్ గురై పాడి ఆవు మృతి



పాడి ఆవు మృతి చెందిన సంఘటన ఫలక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో చోటుచేసు కుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఆగుల నరసింహ అలియాస్ బకని చిన్న నరసింహ కు చెందిన పాడి ఆవు ఆదివారం గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్కు తగలడంతో షాక్ గురై మృత్యువాత పడింది. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ భద్రతా వలయం లేకపోవడంతో ప్రమాదం సంభవించిందని, చనిపోయిన ఆవు విలువ సుమారు 60 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం రైతును ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు

### ఘనంగా పోలీసు అధికారి

# అశోక్ రిటైర్మెంట్ వేడుకలు

### పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



కూకట్ పల్లి 'వై' జంక్షన్ లోని అభినందన్ హొటల్ లో పోలీసు అధికారి అశోక్ రిటైర్మెంట్ వేడుకలు ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని అశోక్ ని సన్మానించి అభినందించారు. తెలంగాణ పోలీస్ డిపార్ట్మెంట్లో గత 35 సంవత్సరాలుగా సేవలందించి విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకుని నేడు రిటైర్ అయిన అశోక్ కి అభినందనలు తెలియజేస్తూ, రిటైర్మెంట్ జీవితాన్ని కుటుంబ సభ్యులకు ఆనందంగా, హాయిగా జీవించాలని రాజేశ్వరరావు ఆకాంక్షించారు.

# మాజీ ఎమ్మెల్యే "సత్తి"కి కృతజ్ఞతలు

# తెలిపిన మణికంఠ రెడ్డి



**తెలుగు - వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):**
వైయస్సార్సీపి రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ గా నియామకానికి కృషిచేసిన అనపర్తి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి కి నల్లమిల్లి విజయ మణికంఠ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే సత్తి ని విజయ మణికంఠ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రెటరీ నల్లమిల్లి విజయ మణికంఠ రెడ్డిని శాలువా కప్పి సత్కరించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం యువతపై ఉందని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కడిమి శ్రీను, సబ్బెళ్ళ సుధాకర్ రెడ్డి, నల్లమిల్లి వేణు రెడ్డి, కర్రీ శ్యామ్ సందీప్ రెడ్డి, సుభాష్ రెడ్డి, నల్లమిల్లి వినయ్ రెడ్డి, సబ్బెళ్ళ సంజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతి కాపరి అహల్యాబాయి

# హెూల్కర్ జయంతి వేడుకలు

### బిజెపి ఆధ్వర్యంలో ర్యాలీ




**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

పుణ్య శ్లోక, లోకమాత రాణి, అహల్యాబాయి హెూల్కర్ జయంతిని పురస్కరించుకుని, బాలానగర్ డివిజన్‌లో వేడుకగా ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్, జిల్లా బిజెపి కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరయ్యారు. అనంతరం ఈటెల రాజేందర్ మాట్లాడుతూ "అహల్యాబాయి హెూల్కర్ మంచి పాలనకు, సమాజ సేవకు, ధార్మికతకు ప్రతీక. నేటి యువత ఆమె జీవితం నుంచి ఎంతో నేర్చుకోవాలి అన్నారు. దేశానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమైనవి, అని అన్నారు. ఈ వేడుకలు అహల్యాబాయి హెూల్కర్ మహెూన్నత సేవలను స్మరించుకోవడమే కాకుండా, సమాజంలో సదాచారాన్ని ప్రోత్సహించే దిశగా కీలకంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో రాష్ట్ర జిల్లా నాయకులు కార్యకర్తలు,పలువురు విద్యార్థులు, యువత, స్థానిక నాయకులు మరియు సామాజిక కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం





శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ భేరి రామ్ చందర్ యాదవ్ పాల్గొన్నారుశేరిలింగంపల్లి నియోజకవర్గ గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం లో కాంగ్రెస్ ఇంచార్జ్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మహేశ్వర్ గౌడ్ గారు మరియు తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ బృందం. గచ్చిబౌలి డివిజన్నల్లగండ్ల భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో కళ్యాణ మహోత్సవం మరియు పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగింది జాతర అంగరంగ వైభవంగా వైభవోపేతంగా జరిగింది. శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ కార్పొరేటర్ శ్రీమతి పూజిత శ్రీ జగదీశ్వర్ గౌడ్ గారి ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం పూజా కార్యక్రమాలు జాతర.. స్వామివార్ల ఊరేగింపు మరియు భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణం వేడుక ఘనంగా గొప్ప వైభవోపేతంగా బ్రాహ్మణోత్తములచే కళ్యాణం చూడముచ్చటగా జరిపించారు. కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ గారు అందరికీ ఆహ్వానిస్తూ వచ్చిన పెద్దలకు నాయకులకు శాలువాలతో సత్కరించి కళ్యాణానికి వచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ మహేశ్వర్ గౌడ్ గారు ఈ కళ్యాణోత్సవానికి హాజరు కావడం జగదీశ్వర్ గౌడ్ గారు సన్మానించడం వేడుకగాని జరిగింది శేర్లింగంపల్లి ప్రజలకు నల్లగండ్ల ప్రజలకు సంతోషదాయకం. ప్రతి సంవత్సరం ఇలాగే భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం వైభోపేతంగా జరుపుకోవడం ఆనంద్ దాయకమని శ్రీ జగదీశ్వర్ గౌడ్ గారి దంపతులను అభినందించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు అభిమానులు కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం జరిగింది. బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భ్రమరాంబ మల్లికార్జున స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొని జగదీశ్వర్ గౌడ్ గారు ప్రతి సంవత్సరం కల్యాణోత్సవం చేయడం సంతోషిదాయకమని దంపతులను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ గౌడ్ గారు కూడా పాల్గొనడం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున శేరిలింగంపల్లి ప్రజలకు కూడా ఆనందం. బేరి రామ్ చందర్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యంగా హిందూ ధర్మాన్ని పాటించే ప్రజలందరూ ఆధ్యాత్మికంగా దేవదేవతలను పూజించేవారు ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ భగవంతుని దర్శించుకుంటూ ఆశీర్వాదం తీసుకోవడం గొప్పగా ఉంటుందని మనశ్శాంతిగా ఉండటానికి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని తమ వంతు సహకారం నిర్వహకులకు అందిస్తున్నందుకు బేరి రామచందర్ యాదవ్ మరొకసారి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్ గౌడ్ దంపతులు ఉద్దేశించి హృదయపూర్వకంగా అభినందించారు. నల్లగండ్ల ప్రజలు గచ్చిబౌలి డివిజన్లోని ప్రజలతోపాటు శేరిలింగంపల్లి అభిమాన గణం నాయకులు కార్యకర్తలు పాల్గొనడం విశేషం. ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ మహేష్ గౌడ్ గారితో పాటు కాంగ్రెస్ నాయకులు అనేక మంది పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ పాల్గొని జగదీశ్వరి గౌడ్ దంపతులను సన్మానించారు. మాజీ కౌన్సిలర్లు ముఖ్య నాయకులు, శ్రీమతి సునీత ప్రభాకర్ రెడ్డి వారి బృందం పాల్గొని పూజా కార్యక్రమాల్లో నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, జయా రెడ్డి, ఎన్ ఎన్ రెడ్డి టెక్స్టైల్స్ బోటిక్ ప్రొప్రైటర్ కుషన్ రెడ్డి, అందిన కిరణ్ యాదవ్ బేరి చంద్రశేఖర్ యాదవ్, యువజన నాయకులు రాజు, లవణాచారి, మరి కాలనీ పెద్దలు మహిళా సోదరులు యోజన నాయకులు మరియు ప్రజా ప్రతినిధులు ప్రజలు పెద్దెచ్చిన పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు

# “వెన్నుపోటు దినం” పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా వైసీపీ అధ్యక్షులు వేణు





**తెలుగు - వెలుగు, తూ.గో.జిల్లా బ్యూరో(అనపర్తి):** ప్రజా సౌలభ్యం కోసం వైసిపి పాలనలో నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చక్కటి వ్యవస్థని ఏర్పాటు చేస్తే ఆ వ్యవస్థలను విధ్వంసం చేసి ప్రజలకు కష్టం కలిగిస్తున్న వ్యక్తి చంద్రబాబు నాయుడు అని మాజీ మంత్రి, తూర్పుగోదావరి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం అనపర్తి వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 4 న జరిగే”వెన్నుపోటు దినం”పోస్టర్ మాజీ మంత్రి వేణు ఆవిష్కరించారు. అనంతరం వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ఇంటింటికి రేషన్ పంపిణీ వ్యవస్థని జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేస్తే నేడు ఆ వ్యవస్థను రద్దుచేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. విచ్చలవిడిగా గంజాయి ప్రోత్సహించి యువతను నాశనం చేస్తున్నారని మాజీ మంత్రి వేణు ఆరోపించారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారంటూ వేణు ధ్వజమెత్తారు. గత సంవత్సరం సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన మొత్తం సొమ్ము వెంటనే లబ్ధిదారుల ఖాతాలో వేయాలని ఆయన డిమాండ్ చేశారు. వెన్నుపోటు దినం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఈ నెల నాలుగున జరుగుతుందని ప్రతి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున వైఎస్ఆర్సిపి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని మాజీ మంత్రి వేణు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ విభాగం సెక్రెటరీ బొడ్డు ముత్యాల రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు నల్లమిల్లి మురళి మోహన్ బాలకృష్ణారెడ్డి, నియోజకవర్గం లీగల్ విభాగం అధ్యక్షులు వెలగల లక్ష్మీనారాయణ రెడ్డి, వల్లభ శెట్టి రామ సతీష్, పెదపూడి,బిక్కవోలు పార్టీ మండల కన్వీనర్లు గుత్తుల రమణ, పోతుల ప్రసాద్ రెడ్డి, బీసీ సెల్ విభాగం నియోజవర్గ అధ్యక్షులు కొండేటి భీమేష్, వైస్ ఎంపీపీ కర్రి దాసు, సర్పంచ్ వారా కుమారి తదితరులు పాల్గొన్నారు.

# సీసీకెమెరాల ఏర్పాటుతో నేరాల గుర్తింపు

**- పట్టణాల్లో ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సాహం - పలు పట్టణాల్లో సహకారాం అందిస్తున్న దాతలు**



**హైదరాబాద్ :** శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల పాత్ర కీలకంగా మారింది. దీంతో పోలీసులు వీటిని ఏర్పాటు చేసేందుకు ఎక్కడిక్కడ ప్రోత్సహిస్తున్నారు. సిసి కెమెరాల ఏర్పాటుకు సంఘాలను పిలిచి మాట్లాడుతున్నారు. ఓ మోస్తరు పట్టణంలో ఇప్పుడు వీటి ఏర్పాటు సాగుతోంది. 33 జిల్లాల కేంద్రాలతో పాటు చోటమోటా పట్టణాల్లో కూడా వీటి ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులను ఇతరలను పిలిచి మాట్లాడుతున్నారు. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ బాగా పనికి వస్తోంది. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో అవి కీలకంగా మారాయి. అందుకే కాలనీలు మొదలు,రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని సిసి కెమెరాల ఏర్పాటును చేయిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని పోలీస్ అధికారులు కూడా ప్రకటించారు. ఇకపోతే నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించ గలిగారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని, దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిదిగంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదు. ఒకవేళ నేరగాళ్లను గుర్తించిన కేసుల సమయంలో సాక్ష్యులుగా వీరు ఉండలేరని, అదే సీసీ కెమేరాలైతే నిజనిర్ధారణ వేగంగా అవుతుందన్నారు. కోర్టుల్లో కూడా సీసీ కెమెరాల ద్వారా ఎటువంటి సంశయం లేకుండా శిక్షలు విధించే అవకాశాలు ఉంటాయి. అందుకే నగరంలో అన్ని ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రాన్ని నేరరహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు పోలీస్శాఖ విశేషంగా కృషి చేస్తున్నది. దానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తున్నది. దేశంలోనే తెలంగాణ పోలీసింగ్కు మంచి గుర్తింపు కూడా వచ్చింది. దానిని కాపాడుకుంటూ మరింత పేరుపొందేలా, ప్రజల్లో భరోసా కల్పించేలా ముందుకు సాగుతున్నారు. ఇటీవల అనేక కేసుల పరిష్కారంలో సిసి కెమెరాల ఫుటేజీ కీలకంగా మారింది.

## కాలుష్యం కోరల్లో

# కాగజ్‌నగర్

**-ఎస్పీఎం మిల్లు వెలువడుతున్న కాలుష్యం**
**-భరించలేని కళ్ల మంట**
**-పట్టించుకోని యాజమాన్యం**



**కాగజ్‌నగర్ :** ఎస్పీఎం కాలుష్యం కోరల్లో కాగజ్‌నగర్ పట్టణం కొట్టుమిట్టాడుతోంది. ఎస్పీఎం నుంచి వెలువడుతున్న కాలుష్యం మిల్లు పరిసర కాలనీవాసులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పట్టించుకోవాల్సిన కాలుష్య నియంత్రణ మండలి వారు పత్తా లేకుండా పోయారు. వర్షాలు కురిస్తే చాలు ఎస్పీఎం నుంచి వెలువడే వాయు కాలుష్యం ఇళ్లలోకి వ్యాపిస్తోంది. దీంతో కళ్ల మండుతున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. అలాగే భరించ లేని వాసన వస్తోందంటున్నారు.

**భరించలేని వాసన..**

రైల్వేస్టేషన్‌కు వేళ్లే దారిలో మూడు పొగగొట్టాలున్నాయి. ఈ పొగ గొట్టాల నుంచి పైకి వెళ్లాల్సిన పొగ కిందకు రావటంతో సమీపంలో ఉన్న కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భరించ లేని వాసన వస్తోందంటున్నారు. చిన్నారులు కళ్ల మంట భరించలేక ఏడుస్తుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కడుపు ఉబ్బటం లాంటి సమస్యలు కూడా వస్తున్నాయని పేర్కొంటున్నారు. శ్వాసకోశ సమస్యలు అధికంగా వస్తున్నాయని తెలిపారు. రాత్రి పూట సమస్య మరింత ఎక్కువగా ఉండటంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక అంతా భయం గుప్పిట్లో కాలం గడుతున్నారు.

**కాలుష్య తీవ్రతపై విచారణ..**

కాలుష్య తీవ్రతపై సమీపకాలనీ వాసులు నేరుగా ఎస్పీఎం గేటు ఎదుట ఆందోళన చేయటంతో మంగళవారం రాత్రి తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పొగ ఎక్కడి నుంచి వస్తోందని, దీని తీవ్రత ఎలా ఉందనే అంశాలపై కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్నింటిని ఉన్నతాధికారులకు తెలియజేస్తానన్నారు.

# పాఠశాలల నిర్వహణకు నిధులేవి?

**- జిల్లాలో నిధులు లేక కేటాయించని అధికారులు**
**- పారిశుధ్య నిర్వహణ లోపంతో విద్యార్థుల ఇబ్బందులు**



**పెద్దపల్లి :** ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రం చేసే వారు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి స్వీపర్లు, స్కావెంజర్లను నియమించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి నెల రోజులు కావస్తోంది. ఇప్పటివరకు నిధులు కేటాయించకపోవడంతో పరిసరాలు బాగా లేక విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. డిస్ట్రిక్ట్ మినరల్ ట్రస్టు ఫండ్(డీఎంఎఫ్‌టీ) నుంచి మూడు మాసాలకోసారి నిధులను అమ్మ ఆదర్శ కమిటీలకు కేటాయించాలని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు జిల్లా విద్యా శాఖ అధికారులు కలెక్టర్‌కు ఫైల్ పెట్టగా, డీఎంఎఫ్‌టీలో నిధులు లేవని, ఆ ఫైలును తిరిగి పంపిస్తూ, పాఠశాల విద్యా శాఖ డైరెక్టరేట్‌కు పంపించాలని సూచించారని సమాచారం. పాఠశాలలు ఏడాదిలో 10 మాసాలు నడుస్తాయి. రెండు మాసాలు వేసవి సెలవులకే పోతాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి విద్యా శాఖాధికారులు ఏ పాఠశాలకు ఎంత మంది స్వీపర్లు, స్కావెంజర్లు అవసరమో గుర్తించారు. వారికి నెలకు 25 లక్షల 9 వేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేశారు. 10 మాసాలకు 2 కోట్ల 50 లక్షల 90 వేల రూపాయలు అవసరం ఉంటాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో అటెండర్లు, స్వీపర్లు లేక పాఠశాలలను పరిశుభ్రం చేసేవారు కరువయ్యారు. ప్రభుత్వం ప్రతి ఏటా పాఠశాలల నిర్వహణకు అరకొరగా ఇచ్చే గ్రాంట్లు సరిపోక నానా కష్టాలు పడ్డారు. ఇక నుంచి పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ ఇస్తామని, పాఠశాలల నిర్వహణకు ఇచ్చే గ్రాంటు పెంచుతామని గత నెల 2వ తేదీన పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు పాఠశాలల నిర్వహణకు విద్యార్థుల సంఖ్యను బట్టి నెలకు 3 వేల నుంచి 20 వేల రూపాయలు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం జీవో నంబర్ 21 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఆ డీఎంఎఫ్‌టీ నుంచి నిధులను వాడుకోవాలని జీవోలో పేర్కొన్నారు.

**అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు నిర్వహణ బాధ్యత...**

పాఠశాలల నిర్వహణ బాధ్యతను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించారు. 1 నుంచి 30 మంది వరకు విద్యార్థులు గల పాఠశాలలకు 3 వేలు, 31 నుంచి 100 మంది వరకు విద్యార్థులు గల పాఠశాలలకు 6 వేలు, 101 నుంచి 250 మంది విద్యార్థులు గల పాఠశాలలకు 8 వేలు, 251 నుంచి 500 మంది విద్యార్థులు గల పాఠశాలలకు 12 వేలు, 501 నుంచి 700 మంది విద్యార్థులు గల పాఠశాలలకు 15 వేలు, 750 మందికి పైగా విద్యార్థులు గల పాఠశాలలకు 20 వేల రూపాయలు కేటాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిధులతో పాఠశాలల్లో గల మరుగుదొడ్లను శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పోయడం, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ పనులు చేసేందుకు సర్వీస్ వర్కర్లు, స్కావెంజర్లను నియమించుకోవాలన్నారు. పాఠశాలల నిర్వహణ బాధ్యతను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకే అప్పగించారు. ఆయా పాఠశాలలకు కేటాయించే నిధులను మూడు నెలలకు సంబంధించి అడ్వాన్స్‌గా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఖాతాల్లో జమ చేయాలని పేర్కొన్నారు. దీంతో జిల్లాలో డీఎంఎఫ్‌టీ నిధులు లేక పాఠశాలల్లో స్కావెంజర్లు, సర్వీస్ వర్కర్లను నియమించలేకపోతున్నారు. దీంతో పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ, పరిసరాలు పరిశుభ్రంగా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో బొగ్గు గనులు, ఇసుక క్వారీలు, క్రషర్ క్వారీలు, సిమెంట్ పరిశ్రమ ఉండగా, వాటి ద్వారా, ఏడాదికి 120 నుంచి 140 కోట్ల రూపాయల వరకు జమ కావాల్సి ఉంటుంది. ఆ నిధులన్నీ నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికే వెళుతున్నాయి. జిల్లాకు 550 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు రావాల్సి ఉన్నాయి. అవి విడుదల కాకపోవడంతో ఆ నిధులతో చేపట్టిన పనులు నిలిచిపోయాయి. పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఆరు మాసాల నుంచి బిల్లులు చెల్లించడం లేదు. జిల్లా డీఎంఎఫ్‌టీలో ఒక్క రూపాయి కూడా లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో పాఠశాలల నిర్వహణకు డీఎంఎఫ్‌టీ నుంచి కేటాయించలేకపోతున్నారు.

# ఉచిత పథకాలపై ప్రజలే నిలదీయాలి !



అధికారం కోసం పాలకులు ప్రజలను ఓటు బ్యాంకుగా చేసుకుని పథక రచన చేస్తున్నారు. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా పథకాలను రూపొందిస్తున్నారు. సంక్షేమం అన్న ముసుగు తగిలించి దేశ, రాష్ట్ర ఖజానాలను గుల్ల చేస్తున్నారు. లక్షల కోట్ల అప్పులు చేస్తున్నారు. ఇలాంటి దుబారా పథకాలను నిలువరించాలి. ప్రజలు కూడా నిలదీయాలి. తమ చేతికి ఎముక లేదన్నట్లుగా నగదు జమ చేస్తున్నారు. ఎపిలో అయితే బటన్ నొక్కుడు..నగదు జమచేయడం నిత్యకృత్యంగా మారింది. తెలంగాణలో కూడా గత ప్రభుత్వం దళితబంధు, రైతుబంధు వంటి పథకాలతో బొక్కసాన్ని కొల్లగొట్టింది. అధికారం పోయాక ఇప్పుడు అవే పథకాలు అమలు చేయాలంటూ ప్రజలను రెచ్చగొడుతోంది. ఇది అభివృద్ధి, సంక్షేమం ఎలా అవుతుందో చెప్పలేకపోతున్నారు. ఇలాంటి పథకాలపై ప్రజలే నిలదీసేలా చైతన్యవంతులు కావాలి. ప్రజలు చెమటోడ్చి కట్టిన పన్నుల డబ్బులను ఇలా దుబారా చేయడంపై నిలదీసే రోజులు రావాలి. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటుంటే..పాలకులు అధికారం కోరుకుంటున్నారు. ఎంతకు తెగించి అయినా అధికారం లోకి రావడమే లక్ష్యంగా అనేకానేక ఉచిత పథకాల హామీలను గుప్పిస్తున్నారు. ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న విన్యాసాలతో దేశ,రాష్ట్రాల ఆర్థిక ముఖచిత్రం మారిపోతోంది. అభివృద్ధి పడకేస్తోంది. నిరుద్యోగం పెరుగుతోంది. వస్తూత్పత్తి పడిపోతోంది. నిరంతరంగా ఏదో ఒక పథకం పేరుతో నగదు బదిలీలు జరుగుతున్నాయి. దీనికి కాంగ్రెస్, బిజెపిలతో పాటు ప్రాంతీయ పార్టీల నేతలంతా బరి తెగిస్తున్నారు. పేదరికం నుంచి ప్రజలను బయటపడేసే ఉద్దేశ్యంతో చేస్తున్న ఆర్బాటాలతో పథకాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయి. 75 ఏళ్ల దాటినా ఇంకా పేదల పేరు చెప్పి రాజకీయం చేస్తున్నారు. ఇలా నగదు బదిలీ పథకాలతో బొక్కసం గుల్ల చేస్తున్నారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వగలిగే స్థితిలో ఉండడం లేదు. ఉపాధి, ఉద్యోగాలంటును బలోపేతం చేసే చర్యలు చేయడం లేదు. అలాగే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా అందుకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి ఆదుకోవడం లేదు. ఉన్న పరిశ్రమాలను మూసేస్తున్నారు. లాభాల బాటలో ఉన్న సంస్థలను తెగనమ్మే స్తున్నారు. దేశంలో ప్రజలు అన్నమో రామచంద్రా అంటున్నా పట్టించుకోవడం లేదు. రైతుబంధు, ఉచిత విద్యుత్, ఉపాధిహామీ, కిలోరూపాయి బియ్యంలాంటి పథకాలన్నీ దండగమారివే అయినా కొనసాగి స్తున్నారు. గణతంత్ర వేడుకలు జరుపుకుంటున్న వేళ మార్పులకు నాందిప్రస్తావన కావాలి. పేద ప్రజలకు తామే అధికారం లోకి వస్తే ఉచిత పథకాలతో లబ్ధిచేకూరుస్తామని రాజకీయ పార్టీలు, నేతలు, ఎన్నికలవేళ చేస్తున్న వాగ్దానాల పట్ల ప్రజలు అప్రమత్తం కావాలి. ఉచిత వాగ్దానాలు సాధారణ బడ్జెట్ను మించి ఉంటున్నా యని, ఇలాంటి జనాకర్షక హామీలను గుప్పించడం తీవ్రమైన అంశమని గుర్తించాలి. గతంలో సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి అభిప్రాయమే వెలిబుచ్చింది. ఇకనుంచైనా ఉచిత వాగ్దానాల వర్షం కురిపించే రాజకీయ పక్షాలను, నేతలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. ప్రజలు ఎక్కడి నుంచి తెస్తారో నిలదీయాలి. తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి ప్రభుత్వానికి అవకాశం లేదు. గత ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి బయటపడడం ఎలా అన్నదే ప్రస్తుతం ఉన్న సమస్య. ఎన్నికలకు ముందు ప్రజానిధులతో ఉచిత తాయిలాలు ప్రకటిస్తూ, ఉచిత హామీలిస్తున్న పార్టీల ఎన్నికల గుర్తును స్తంభింపజేయాలని, రిజిస్ట్రేషన్ను రద్దు చేయాలని గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అయినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. త్వరలో పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల ముందు మరోమారు ఈ సమస్య చర్చ కావాలి. ఉచితాలపై ప్రజలే నిలదీయాలి. మనకెందుకు లే అని అనుకుంటే మనలను నిండా ముంచుతారు. అందుకు తెలంగాణలో కెసిఆర్ ఏలుబడే చక్కటి ఉదాహరణ. ఏపిలో జగన్ పాలన కూడా అందుకు ఉదాహరణలే. రాజకీయ పార్టీలు ఉచిత వాగ్దానాలతో ఓటర్లను ప్రలోభ పెడుతున్న తీరును ప్రజలు చైతన్యవంతులయి ఎక్కడికక్కడ నిలదీయాలి. ఈ ఎన్నికల్లోపే ఇది చేయగలమా? వచ్చే ఎన్నికల వరకైనా చేయగలమా? అన్నది ఆలోచించాలి. ఉచిత హామీలకు అయ్యే ఖర్చు సాధారణ బడ్జెట్ను మించిపోతోందని గతంలో సుప్రీం సిజె గా పనిచేసిన జస్టిస్ ఎన్వీ రమణ చేసిన వ్యాఖ్యలు మననం చేసుకోవాలి. ఓటర్ల నుంచి రాజకీయ లబ్ధి పొందటం కోసం అనుసరిస్తున్న జనాకర్షణ విధానాలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. దీనిపై నిషేధం విధించాల్సి ఉంటుందని కూడా అప్పట్లో ఆయన అభిప్రాయపడ్డారు. ఇది చాలా తీవ్రమైన సమస్య అంటూ...మార్గదర్శకాలను రూపొందించాలని గతంలో ఎన్నికల సంఘానికి సూచించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం కూడా తనకుతాను నియమావళిని నిర్దేశించుకుని రాజకీయ పార్టీలను కట్టడి చేయాల్సి ఉంది. అధికారం కోసం... అధికారం వనరులపై పెత్తనం కోసం రాజకీయ పార్టీలు చేస్తున్న విన్యాసాలే ఈ ఉచిత పథకాలుగా చెప్పుకోవాలి. ఎపిలో నిరంతరాయంగా డబ్బులు పంపిణీ కార్యక్రమం మనకు కళ్లకు కనపడుతోంది. జగన్ తనతాత ముత్తాతలు సంపాదించిన ఆస్తి నుంచి పంచి పెడుతున్నట్లుగా ఎపిలో బొక్కసం ఖాళీ చేస్తున్నారు. కెసిఆర్ కూడా అప్పులతో ఆస్తులు సృష్టించానని చెప్పి తెలంగాణను అప్పుల కుప్పగా తయారు చేశారు. ఈ అప్పులు తీర్చడానికి వేలకోట్లు వడ్డీలకే చెల్లించాల్సి రావడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి నేతలను నమ్మితే మనలను మనం అంగట్లో అమ్ముకోవడం తప్ప మరోటి కాదు. అధికారంలోకి రావడానికి పథకాలు ప్రకటించడం.. అధికారం లోకి వచ్చాక దానిని నిలుపుకోవడానికి నగదు బదిలీ పథకాలు ప్రవేశ పెట్టడం బాగా అలవాటు చేసుకున్నారు. ప్రజలు చెమటోడ్చి పన్నులు కడితే అభివృద్ధి పనులతో సంపదను సృష్టించాల్సిన నేతలు సంపదను హారతి కర్పూరంలా హరించి వేస్తున్నారు. మోడీతో సహా కెసిఆర్, జగన్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్ లాంటి సిఎంలంతా ఇందుకు అతీతులు కారు. ఏదో విధంగా అధికారాన్ని కాపాడు కోవాలన్న లక్ష్యంతో చేస్తున్న పథకాల కారణంగా ప్రజలు నష్టపోతున్నారు. విద్య,వైద్యం అందకుండా పోతోంది. రవాణా మార్గాలు నేటికీ అభివృద్ధి జరగడం లేదు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా కొత్తకొత్త ఉచిత పథకాలు వచ్చి చేరుతున్నాయి. ఖర్చుల భారం పెరగ డంతో ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసేస్తున్నారు. అదేమంటే అభివృద్ధికి అప్పులు తప్పవంటున్నారు. దేశవ్యాప్తంగా నడుస్తున్న ఉచిత పథకాల వ్యాప్తిని చక్కదిద్దేందుకు చర్చించాలి. రాజకీయ పార్టీలను నిలదీయాలి. లేకుంటే వారు మనలను అప్పులకు బాధ్యులుగా చేయగల సమర్థులు.

## మసకబారుతున్న సిబిఐ సమర్థత

**కేసులను తేల్చడంలో నిర్లక్ష్యం**

**ఐదేళ్లయినా కొలిక్కిరాని వివేకా హత్యకేసు**

**కడప:** సిబిఐ చేపడుతున్న కేసుల్లో ఎన్ని నిజాలు నిర్ధారణ అయ్యాయో తెలియడం లేదు. ఎన్ని కేసులు బయటకు వచ్చాయో తెలియడం లేదు. ఇటీవలి కాలంలో కొన్ని కేసులు మాత్రం కేవలం బెదిరింపులకే పరిమితం అవుతున్నాయి. లిక్కర్ కేసులో నిజాలు రాబట్టలేకపోయారు. అంతెందుకు ఐదేళ్లయినా వైఎస్ వివేకాను హత్య చేసిన వారెవరో తేల్చలేదు. నిర్ధారించలేదు. సరికదా కేసును కొలిక్కి తీసుకుని రాలేదు. ఈ కేసులో ఆరోపణలు, విచారణలు ఎదుర్కొంటున్న వారంతా అమయకులని సిఎం జగన్,సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వాపోతున్నారు. సొంత చిన్నాన్న హత్యకేసును కొలిక్కి తేవాలన్న దక్షత కూడా లేకుండా పోయింది. నిజానికి అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం సిఐడిని ఉపయోగించి అనేకానేక కేసులను తవ్వుతూ..అనుమానం ఉన్నవారినల్లా బొక్కలో తోస్తోంది. కానీ వివేకానంద రెడ్డి హత్య కేసులో మాత్రం మిన్నకుంటోంది. ఇక్కడే అందరికీ అనుమానాలు వస్తున్నాయి. సొంత చిన్నాన్న హత్య కేసును ఛేదించలేని చేవ చచ్చిన పాలకుడిగా జగన్ ప్రజల ముందు నిలిచాడు. మానాన్నను చంపినవాళ్లను ఇంకెప్పుడు పట్టుకుంటారని దారుణ హత్యకు గురైన వై.ఎస్. వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి అడిగిన సూటి ప్రశ్నకు నేటికీ సమాధానం దొరకలేదు. సోదరుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ తనకు న్యాయం జరగడం లేదని స్వయంగా ఆమె ఆవేదన వ్యక్తంచేయడం కూడా జగన్ వైఫల్యాన్ని ఎత్తి చూపింది. ఈ కేసును హైదరాబాద్‌కు బదలాయించిన తరవాతనే కొంత కదలిక వస్తోంది. అయినా సిబిఐ కూడా దీనిని తేల్చలేక పోయింది. వివేకా హత్యను ఎవరో కానీ చాలా తెలివిగా చేశారని అనిపిస్తోంది. ఎవరికీ చిక్కకుండా ఉంటున్న చిక్కడు దొరకడు ఎవడో సిబిఐ కూడా పట్టుకోలేక పోతున్నది. అంటే పక్కా ప్రణాళికతోనే చేశారని అనుకోవాలి. ఆనవాళ్లు లేకుండా..అనుమానాలు రాకుండా...విచారణలో దొరక్కుండా హత్యను చాలా పక్కగా చేశారని అర్థం అవుతోంది. సిబిఐ కూడా ఈ విషయంలో కూపీలాగ లేకపోతున్నది. మరోవైపు సిబిఐ విచారణలో భాగంగా అవినాశ్ రెడ్డిని విచారించడం తో వైసిపి ఎందుకనో ఉలిక్కిపడుతోంది. అవినాశ్ రెడ్డి అమాయకుడని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వాపోతున్నారు. రాజకీయంగా అడ్డు తొలగించుకునేందుకే వివేకాను హత్య చేశారన్న ప్రాథమిక అంచనా అంటూ ప్రచారం సాగుతోంది. ఇది నిజమా కాదా అన్నది సిబిఐ దర్యాప్తులో బట్టబయలు కానుంది. అయితే ఈ మొత్తం వ్యవహారంలో సిఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి, అవినాశ్ రెడ్డిలకు మాత్రం కేసును త్వరగా తేల్చి నిందితులను పట్టుకోవాలన్న పట్టుదల ఎక్కడా కానరావడం లేదు. పులివెందులలో తమ బంధువులు కాకుండా బయటి వ్యక్తులు వచ్చి హత్య చేసే అవకాశమే లేదని కడప ఎంపీ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిపై తనకు అనుమానం ఉందని డాక్టర్ సునీత.. గతంలోనే చెప్పారు. వివేకా హత్య జరిగి ఐదేళ్లు గడిచినా ఎటూ తేల్చకపోవడంతో సిబిఐ పనితీరుపైనా అనుమానాలు పెరుగు తున్నాయి. నిజానికి వివేకా పట్ల గౌరవం ఉండివుంటే ఈ కేసులో సిఎం జగన్ సీరియస్‌గానే స్పందించి ఉండేవారు. డాక్టర్ సునీత ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం చెప్పవలసి వస్తుందనే మౌనంగా ఉంటున్నారా అన్నది కూడా అర్థం కావడం లేదు. కోడికత్తి కేసు కూడా ఇలాగా నీరుగారి పోతోంది. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే వివేకా హత్య కేసును ఛేదిస్తారని అంతా భావించారు. కానీ నీరుగార్చే ప్రయత్నాలను ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చేశారన్న అనుమానాలు కూడా బలపడుతున్నాయి. ఎందుకంటే చంద్రబాబు హయాంలో హత్య కేసును దర్యాప్తు చేయడానికి నియమితులైన అధికారులను జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బదిలీ చేశారు. వారిలో కొందరికి పోస్టింగులు కూడా ఇవ్వలేదు. హత్య కేసును నీరుగారుస్తున్నారన్న అనుమానం రావడంతో వివేకా సతీమణి హైకోర్టును ఆశ్రయించారు. తన భర్త హత్య కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని ఆమె న్యాయస్థానాన్ని వేడుకున్నారు. సీబీఐ దర్యాప్తు విషయంలో జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక యూటర్న్ తీసుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ దర్యాప్తు కోసం హైకోర్టులో పిటిషన్ వేసిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక సీబీఐ దర్యాప్తు అవసరం లేదని ప్రభుత్వం తరఫున అఫిడవిట్ దాఖలు చేయడం జరిగింది. దీంతో కేసును త్వరితగతిన ఛేదిస్తారని అంతా భావించారు. కానీ అలాంటిదేమీ లేకుండా పోయింది. సొంత బాబాయ్‌ని దారుణంగా చంపినవారిని పట్టుకోవడానికి జగన్‌రెడ్డి ఆధీనంలోని పోలీస్ శాఖ ఎందుకు విఫలం అయ్యిందనేదానికి సమాధానం లేదు. అలాగే హత్య ఎవరు చేశారో..ఎందుకు చేశారో పక్కన పెడితే జగన్‌కు ఇందులో ఆసక్తి లేకుండా పోయిందన్నది వాస్తవం. అందువల్ల ఆయన ఈ కేసును పెద్దగా పట్టించుకోవడం లేదు. వైఎస్ షర్మిల కూడా విచారణ జరగాలని కోరుకుంటున్నారు. దోషులు పట్టుబడాల్సి ఉందంటున్నారు. కానీ కుటుంబంలో ఎక్కడా వివేకానంద మర్డర్‌పై సీరియస్‌గా మద్దతు దక్కడం లేదు. ఈ హత్య కేసులో సిబిఐ విచారణ ద్వారా నిజాలు వస్తాయని భావించినా..సిబిఐ కూడా తేల్చలేకపోయింది.

# దేశ హితం కోసమే ఉమ్మడి పౌరస్మృతి !

ఉమ్మడి పౌరస్మృతి అనగానే రాజకీయపార్టీలు, మత ఛాందసవాదులు గొంతు చించుకోవడం అలవాటు చేసుకున్నారు. ప్రజలందరి రక్తం ఒక్కటే అంటున్న కమ్యూనిస్టులు సైతం ద్వంద్వ నీతిని అవలంబి స్తున్నారు. దురాచారాలను అణచివేసే క్రమంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ వస్తున్న భారత్‌లో ఉమ్మడి పౌరస్మృతి ఓ ఆవశ్యకతగా గుర్తించాలి. గతంలో ఎన్నో దురాచారాలను మనం రూపు మాపుకున్నాం. బాల్య వివాహాలను రద్దు చేశాం. సతీసహగమనాన్ని రద్దు చేశాం. అలాగే అనేక మార్పులకు ప్రపంచం లోనవు తున్న వేళ ప్రజలకు చట్టం అన్నది ఒకే రకంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి పౌరస్మృతి అంటే మతపరమైన అచారాలు, సంప్రదాయాలకు అతీతంగా భారత భూభాగం పరిధిలో ఉన్న పౌరులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయడం.ఈ దేశంలో పెళ్లిళ్లు, విడాకులు, వారసత్వంగా వచ్చే ఆస్తులు, పిల్లలను దత్తత తీసుకోవడం, జీవన భృతి లాంటి విషయాలకు సంబంధించి చట్టాలు అందరికీ ఒకేలా లేవు. పౌరులు ఆచరించే మతం, విశ్వాసాల ఆధారంగా వేర్వేరుగా ఉంది. అయితే మతంతో సంబంధం లేకుండా, లింగ భేదాల్లేకుండా భారత పౌరులందరికీ ఒకే చట్టం వర్తింపజేయడమే యూనిఫాం సివిల్ కోడ్. ఈ డిమాండ్ దేశానికి స్వాతంత్యం÷-ర వచ్చిన నాటి నుంచే ఉంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 కూడా ఇదే చెబుతోంది. దేశ పౌరులకు యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకొచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలంటూ ఆదేశిక సూత్రాల రూపంలో రాజ్యాంగం సూచిస్తోంది. ఇప్పటి వరకు దేశంలో ప్రజాచట్టాలకు భిన్నంగా మతపరమైన చట్టాలున్నాయి. హిందూ వివాహ, వారసత్వ చట్టాలు, షరియా లాంటి ముస్లిం పర్సనల్ చట్టాలు అమలవుతున్నాయి. అయితే ఉమ్మడి పౌరస్మృతిలో ఎవరికి వాళ్లుగా అమలు చేసుకునే చట్టాలు చెల్లవు. దాంతో చాలా కాలంగా దేశంలో మైనారిటీ అయిన ముస్లింలు యూనిఫాప్ సివిల్ కోడ్‌ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇప్పుడు మళ్లీ ఉమ్మడి పౌరస్మృతి అంశంపై చర్చ మొదలయ్యింది. 2019లో ట్రిపుల్ తలాక్‌ని నేరంగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. యూనిఫామ్ సివిల్ కోడ్ వచ్చే దాకా దేశంలో లింగ సమానత్వం సాధ్యం కాదనే వాదనలున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి వల్ల దేశంలో సమానత్వం లభిస్తుంది. కొత్త సమస్యలు పుట్టుకొస్తాయని చెబుతున్న వారంతా కేవలం ఓటు బ్యాంక్ రాజకీయ ప్రయోజనాలు ఆశించేవారుగానే చూడాలి. పౌరులు తమకు నచ్చిన మతాన్ని స్వీకరించేందుకు, అనుసరించేందుకు, వ్యాప్తి చేసేందుకు వీలుంది. దీనిని ఎవరూ కాదనడం లేదు. చట్టం విషయంలోనే మతాల ఆధారంగా ఉండరాదన్నది ఆకాంక్ష. అయితే భిన్న మతాలు, నమ్మకాలున్న భారత్ లాంటి పెద్ద దేశాల్లో ఉమ్మడి సివిల్ కోడ్స్ ద్వారా అందరినీ ఏకం చేయడమనేది ఎంతో కష్టమైన విషయం అన్న వాదన తెస్తున్నారు కొందరు.

హిందువులైనా, ముస్లింలైనా వాళ్లలో వాళ్లకు అనేక భిన్నమైన నమ్మకాలు, విశ్వాసాలు ఉంటాయి. అవి వేరు..చట్టాలు వేరని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మిందువుల్లోనూ భిన్న ఆచారాలు, సంప్రదాయాలు పాటించే వాళ్లున్నారు. ముస్లింలలోనూ షరియా చట్టాలను పాటించని వాళ్లున్నారు. బోరా ముస్లింలు ఆస్తుల వారసత్వం విషయంలో హిందువుల చట్టాలను అనుసరిస్తుంటారు. ఆస్తుల వారసత్వం విషయంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా చట్టాలున్నాయి. ఇక క్రైస్తవులు మెజారిటీగా ఉండే నాగాలాండ్, మిజోరం లాంటి రాష్ట్రాలు తమకంటూ ప్రత్యేకమైన సివిల్ చట్టాలను రూపొందించుకున్నాయి. వాటికి ఆధారం వారి సంప్రదాయాలే గానీ మతం కాదు. గోవాలో 1867 నాటి కామన్ సివిల్ కోడ్ అమల్లో ఉంది. కానీ క్యాథలిక్స్, ఇతర మతస్థులకు భిన్నమైన నియమాలున్నాయి. భారత్‌లో పౌర స్మృతులు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. హిందువుల్లో కొడుకులతో సమానంగా కూతుళ్లకు వారసత్వ ఆస్తిలో వాటా పొందేలా 2005లో చట్టాలను సవరించారు. కానీ దీని కంటే ముందే పలు రాష్ట్రాలు మహిళలకు వారసత్వ ఆస్తిలో వాటా హక్కును కల్పిస్తూ చట్టాలు చేశాయి. ఇలా రాష్ట్రానికో చట్టం, మతానికో చట్టం,ప్రాంతానికో చట్టం ఉండడం వల్ల గందరగోళంగా ఉంది. దీనిని తొలగిస్తే తప్ప దేశంలో ఏకీకరణ సాధ్యం కాదు. ప్రజల్లో ఐక్యత రాదు. ఉమ్మడి పౌరస్మృతి తమ మతంపై, సంస్కృతిపై దాడి అని ముస్లింలు సహా మిగతా మైనారిటీ వర్గాలు చేస్తున్న వాదనలో నిజం లేదు. ఎందకంటే మతం ఆధారంగా చట్టాలు చేస్తూ పోతే ఇప్పటికే దేశం కులాలు, మతాలు, ప్రాంతాలుగా విభజింపబడింది. మతం లాంటి వ్యక్తిగత విషయాల్లో ప్రభుత్వ జోక్యం చేసుకోవాలని ప్రభుత్వం కూడా భావించడం లేదు. గడిచిన 40 ఏళ్లలో భిన్న తీర్పుల్లో భాగంగా దేశ సమైక్యత కోసం యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకు రావాలని సుప్రీం కోర్టు ప్రభుత్వాలకు సూచిస్తూ వచ్చింది. డెబ్బయి అయిదేండ్ల స్వాతంత్ర్యంలో ఆర్థిక అసమానతలు అంతరించకపోగా పెరిగాయి. సామాజిక అసమానతలు అలానే ఉన్నాయి! స్త్రీలను ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నారు. వారికి గౌరవం దక్కడం లేదు. ఉండటానికి కూడు, గుడ్డ, నీడ సమకూర్చనేలేదు. ఉమ్మడి పౌరస్మృతి అనగానే మతపరమైన అంశమని, అదీ మన ప్రత్యర్థి మతాన్ని నియంత్రించేదన్న ప్రచారం వాడుకలోకి తెచ్చారు. కానీ ఇది అన్ని మతాలకూ, అందరు ప్రజలకూ సంబంధించినది. అందుకనే చాలా జాగ్రత్తగా ఆలోచన చేయాలి. అందరూ సమానంగా వ్యవహరించటానికి మన రాజ్యాంగమూ అందరికీ అన్ని హక్కులనూ కల్పిస్తున్నది. అలాంటప్పుడు చట్టాలు అందరికీ ఒకేలా కాకుండా కొందరికి మరోలా ఉండడం వల్ల సమాజంలో అసమానతలు ప్రబలుతాయి. మీ చట్టం మాకు చెల్లదని ధిక్కరించే సంస్కృతి వస్తుంది. దీనిని అధిగమించి ప్రజలంతా ఒక్కటే..అందరికీ ఒకటే చట్టం అన్న భావన ఉంటే సమానభావం అలవడుతుంది. అందుకు ఉమ్మడి పౌరస్మృతి అవసరమే.

## స్థూలకాయంతో గుండెపై ప్రభావం

**ఆహారపు అలవాట్లు మార్చుకోవాల్సిందే**



**న్యూఢిల్లీ :** స్థూలకాయాన్ని వ్యాధిగా పరిగణించాలి. దీని ప్రభావం గుండెపై ఉంటుంది. గుండెపై కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. అటువంటి పరిస్థితిలో స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాదు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతారు. గుండె ఆరోగ్యం దెబ్బ తింటే శ్వాస వ్యవస్థ పాడై, శ్వాస పీల్చుకోవడంలో అనేక ఇబ్బందులు పడతారు. గుండె చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల ధమనుల్లో ఇబ్బందులు ఏర్పడతాయి. స్థూలకాయం వలన శరీరం బరువు పెరగడంతో కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడతారు. బరువులు ఎత్తినప్పుడు కీళ్లలో నొప్పి మొదలవుతుంది. శరీర బరువు మరింత పెరిగితే, అప్పుడు కీళ్ళపై భారం పడుతోంది. కీళ్లు, పాదాల ఆరోగ్యం చెడిపోకుండా మొదటి నుంచి బరువు అదుపులో ఉంచుకోవాలి.శరీర కొవ్వును ఖచ్చితంగా కొలవడం చాలా కష్టం. బాడీ మాస్ ఇండెక్స్ (బి.ఎం.ఐ) ఆరోగ్యకరమైన బరువును నిర్ణయించడానికి ఒక ప్రసిద్ధమైన మార్గం. భారతదేశంలో బి.ఎం.ఐ 23 కంటే ఎక్కువ ఉంటే, అప్పుడు అధిక బరువుగా పరిగణిస్తారు. అయితే బి.ఎం.ఐ స్థాయి 30 కంటే ఎక్కువ ఉంటే అప్పుడు ఆ పరిస్థితిని ఊబకాయం అంటారు. ఈ స్థూలకాయాన్ని తేలికగా తీసుకోవడం వల్ల అనేక వ్యాధులకు గురవుతారు. వివిధ వ్యాధుల బారినపడే ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరిస్తారు. శరీరంలోని ముఖ్యమైన అవయవాలు కిడ్నీ, కాలేయంలో కొవ్వు పేరుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ కొవ్వు ఒక రకమైన ఒత్తిడిని సృష్టిస్తుంది. ఈ కారణంగా కిడ్నీ, కాలేయం పని తీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ అవయవాలు సరిగా పనిచేయలేవు. కొవ్వు పట్టిన కాలేయానికి తగిన చికిత్స చేయకపోతే కాలేయం విఫలమై ప్రాణాంతక పరిస్థితికి దారి తీస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఊబకాయం ఉన్నవారిలో తక్కువ స్పెర్మ్ ఉత్పత్తి అవుతుంది. పెరిగిన శరీరం. చక్కెర అధికంగా ఉత్పత్తి చేస్తూ మధుమేహం ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. అందుకే పిల్లల్ని సాధ్యమైనంతవరకు ఆటల వైపు దృష్టి మళ్లించాలి. పెద్దవాళ్లువ్యాయామం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచిస్తున్నారు.

## వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

**జిల్లాల్లో మలేరియా,డెంగ్యూల ప్రభావం**


**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న వైద్యారోగ్యశాఖ**



**విశాఖపట్టణం:** యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, కరోనా నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబదిత, కీటక సంబందిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, బౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాధితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాటులో ఉండే ఆర్ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

## కోతుల బెడదతో ప్రజల ఆందోళన

**వరంగల్:** కోతుల బెడద నివారించేందుకు అటవీ ప్రాంతాల్లో పండ్ల మొక్కలు పెంచాలని, కోతులను అడవులకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. కోతులు పట్టేవారిని ప్రోత్సహించి వారికి ఉపాధి కల్పిస్తే గ్రామాల్లో బెడద ఉండదని అంటున్నారు. అలాగే పంటపొలాలకు కూడా నష్టం ఉండదని అంటున్నారు. అయితే కోతులకు అడవుల్లో ఆవాలసాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వివిధ రకాల పండ్ల మొక్కలను నాటి గ్రామాల్లో కోతులకు ఆవాసం లేకుండా చేయాలి. అడవుల్లో నేరేడు, సీతాఫలం, వెలగ, రేగు, మారేడు వంటి పండ్ల మొక్కలు నాటాలనిని చెప్పారు. ఇదిలావుంటే అడవుల్లో కోతులకు అనుకూల వాతావరణం కల్పించి మొక్కలను పెంచుతున్నామని అధికారులు అంటున్నారు. ఏరియాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు పెంచుతున్నట్లు గతంలో చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అయితే అవేవీ సాధ్యం కాలేదు. ఇదంతా ప్రచారానికి పరిమితం అయ్యింది. ఇప్పటికే అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీలు పని చేస్తున్నాయని, అటవీ నర్సరీలు ఉన్న గ్రామ పంచాయతీలు మినహాయించి మిగతా పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కొక్క నర్సరీకి జనాభా, ఇళ్ల సంఖ్య ఆధారంగా 25 వేల నుంచి లక్ష మొక్కలు పెంపకానికి లక్ష్యాలను నిర్దేశించినట్లు వివరించారు. అటవీ శాఖకు 40 లక్షల, గ్రామ పంచాయతీల నుంచి 98 లక్షలు చొప్పున హరితహారం కార్యక్రమానికి మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల్లో 25 శాతం అటవీ పండ్ల మొక్కల పెంపకాన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా హరితహారం ద్వారా మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. కానీ కోతుల బెడద నివారణకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.



## పడగొట్టిన ప్రజాస్వామ్యం..

# తొడగొడుతోంది !



చాలాకాలం తరవాత అంటే...పదేళ్ల తరవాత పార్లమెంటులో ప్రజాస్వామ్యం కనిపిస్తోంది. గతంలో లాగా ప్రధాని మోడీ కాలర్ ఎగరేసే పరిస్థితి లేదు. పూర్తిస్థాయి మెజార్టీ లేకపోవడంతో..చిన్నచూపు చూసిన నేతల ముందు మోకరిల్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. అలాగే విపక్షం కూడా బలంగా ఉంది.దేశ ప్రజాస్వామ్యంలో ఇదో మార్పుగా చూడాలి. అందుకే పార్లమెంటులో చర్చలకు అవకాశం వస్తోంది. విపక్ష సభ్యులు స్వేచ్ఛగా తమ గళాన్ని వినిపిస్తున్నారు. స్పీకర్ ఓం బిర్లా కూడా విపక్ష సభ్యులకు గౌరవం ఇచ్చి వారిని చర్చలో పాల్గొనేలా చేస్తున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంలో భాగంగా విపక్షనేత రాహుల్, సమాజ్‌వాదీ నేత అఖిలేశ్ యాదవ్ తదితరులు పార్లమెంటులో నిర్భయంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. అందులో తప్పులు తీసేస్తే..నిజాలు కూడా చాలా ఉన్నాయి. వారి విమర్శలను సూచనలుగా తీసుకుంటే ప్రజలకు మేలు కలుగుతుందని మోడీ గుర్తించాలి. పార్లమెంటులో ఈ పరిణామం ఇక బిజెపిలో కూడా రావాల్సి ఉంది. ఎందుకంటే బిజెపిలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకుండా పోయింది. ఏ అంశంపైనా, తీసుకునే నిర్ణయంపైనా పార్టీలో చర్చించిన దాఖలాలు లేవు. గత పదేళ్లుగా నిరంకుశ విధానాలు సాగాయి. దేశం ఎటు పోతుందో ..ఏ నిర్ణయం తీసుకుంటున్నారో కూడా తెలియదు. ఎంతో హుందాగా, దేశం కోసం వాజ్‌పేయ్, అద్వానీ లాంటి వారు భారతీయ జనతా పార్టీని ఏర్పాటు చేసి,ప్రజల్లో కొత్త ఆశలను నింపారు. బిజెపిని ప్రజాస్వామ్య పార్టీగా, దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే పార్టీగా తీర్చిదిద్దారు. కానీ వారి ఆశలు అడియాశలు అయ్యాయి. పెద్దలంతా తెరమరుగయ్యారు. పాతతరం నేతలకు ప్రవేశం లేకుండా చేశారు. ఒక క్రమపద్ధతిలో వారిని తప్పించారు. పార్టీలోనూ,పార్లమెంట్ లోనూ సీనియర్లు అన్న వాసన లేకుండా చేశారు. ఇప్పుడు పార్టీలో ఇద్దరి పెత్తనమే సాగుతోంది. అందుకే పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడ్డది. చాయ్‌వాలాగా చెప్పుకుంటున్న మోడీ అధికారం చేపట్టిన తరవాత చేస్తున్న విన్యాసాలతో భారత ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. గత యూపిఎ ప్రభుత్వాన్ని గద్దె దింప, మోడీని అందలం ఎక్కించినందకు పదేళ్లుగా నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా గ్యాస్ ధరలు, జిఎస్టీ వాతలు చాలు.. ఈ దేశ ప్రజలు ఎంతగా దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారో చెప్పడానికి. ఇకపోతే నిరుద్యోగం ఎలాగూ పెరిగింది. ఉద్యోగ కల్పన లేదు. చివరకు ఆర్మీలో కూడా అగ్నివీర్ పథకం పేరుతో నాలుగేళ్ల సర్వీస్‌తో ఉద్యోగాల భర్తీ మొదల య్యింది. ఇంతకన్నా దారుణం ఉంటుందా అన్నద ఇచూడాలి. ఇకపోతే ఉద్యోగాల భర్తీ అన్నదే మర్చి పోయారు. సంస్థలను తెగనమ్మేయడం, బ్యాంకులను ముంచినోళ్లు దేశం దాటివెళ్లినా..చూస్తూ ఉండడం చూస్తున్నాం. ప్రజలు మామూలు బట్టలు కూడా కట్టుకోలేని దుస్థితిలో ఉంటే మోడీ మాత్రం ఖరీదైన సూట్లు వేస్తుంటారు. కట్టిన బట్ట మళ్లీ కట్టకుండా రంగురంగుల ఖరీదైన బట్టలు వేస్తున్నారు. చాయ్ అమ్మిన వ్యక్తి ఇంతగా ఎదిగనందుకు భారతీయ ప్రజలు ఆనందించాల్సిందే. అలా అందరూ ఎదిగితేనే మనదేశ జిడిపి, ఆర్థిక వ్యవస్థ బాగా ఎదిగినట్లుగా మోడీ ఎప్పుడు గుర్తిస్తారో చూడాలి. ఈ క్రమంలో పదేళ్ల కాలం గిర్రున తిరిగింది. అయోధ్య, 370 ఆర్టికల్ పేరు చెప్పి ఓట్లు అడిగినా ప్రజలు నమ్మలేదు. మోడీ పాలనలో నిజాయితీ లేదని గుర్తించారు. అందుకే అయోధ్యలోనూ ఓడించారు. ఇవన్నీ సత్యాలు. ఈ సత్యాలు మాట్లాడితే మోడీకి కోపం వస్తుంది. గత పదేళ్లలో విపక్షం గట్టిగా లేకపోవడం వల్ల వారిని గెంటివేసి పాలన చేశారు. ఇప్పుడా పరిస్థితి లేదు. భారత ప్రజాస్వామ్యం గొప్పదనం ఇప్పుడు కనిపిస్తోంది. గడచిన పదేళ్లలో నరేంద్ర మోడీ నాయకత్వాన కేంద్ర ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపే అవకాశం వచ్చింది. రాష్ట్రపతి ప్రసంగంలో కనిపించిన అతిశయాలను ఎండగట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఎన్నికల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వ విధానాలను వెల్లడించాల్సిన రాష్ట్రపతి ప్రసంగం సొంత డబ్బా కొట్టుకునేలాపాత చింతకాయ పచ్చడిలా సాగింది. నీట్ దోషులను శిక్షిస్తామనడం తప్ప కొత్త విషయమేమీ చెప్పలేదు. పేపర్ లీక్ దోషుల్లో ఇసుమంత భయం కూడా లేకుండా పాలన సాగుతోంది. ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు ప్రధానమైనవిగా భావించిన అధిక ధరలు, పెరిగిన నిరుద్యోగం వంటి సమస్యలను వాటికి పరిష్కారాలను లేదా కనీస ఉపశమనం కల్పించడం గురించైనా ప్రస్తావించలేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలను బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్న వైనాన్ని పదేపదే విమర్శిస్తున్నా వాటిగురించి ప్రస్తావించ కుండా ప్రభుత్వ సుపరిపాలన గురించి గొప్పలు చెప్పారు. ఎన్నికల్లో ముఖ్యంగా చర్చనీయాంశమైన అగ్నిపథ్ ఊసే ఎత్తలేదు. ముఖ్యమైన ఎలాంటి చర్చ లేకుండా గిలెటెన్ చేయడం, సభలో హోంమంత్రి వివరణ ఇవ్వాలని కోరినందుకు 140 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం వంటివన్నీ ఇక గతంలో చూశాం. గత పదేళ్లుగా దేశంలో మోడీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తున్న సంగతి వదిలేసి 1975 ఎమర్జెన్సీ గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు. పార్లమెంటు ఉభయ సభల్లో ఎలాంటి చర్చ లేకుండా ఆమోదింపజేసుకున్న అనేక చట్టాలు అమలులోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్ చట్టం ఇంకా ఆచరణకు రాకపోయినా మహిళా సాధికారతకు ఎంతగానో కృషి జరిగిందని చెప్పుకోవడం దారుణం. వ్యవసాయ చట్టాలను తేవడం, వదిలించుకోవడం కూడా జరిగింది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీలను తుంగలో తొక్కారు. అందుకే ప్రజలు గడచిన రెండు సాధారణ ఎన్నికలకు భిన్నంగా బిజెపికి సొంతంగా మెజార్టీని ఇవ్వలేదు. అయినా మోడీ-అమిత్ షా ద్వయం గతంలో మాదిరిగానే పాలన సాగించా లని ప్రయత్నిస్తున్నారు. అందుకే బీజేపీ వాళ్లు హిందువులే కాదని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నిర్మొహమాటంగా అన్నారు. భయాన్ని, విద్వేషాన్ని, అబద్దాలను వ్యాపింపజేయడం హిందూధర్మం కాదని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో రాహుల్‌గాంధీ విపక్ష నేత హోదా లో తొలిసారిగా మాట్లాడారు. నిజంగా గతంలో ఇలా మాట్లాడే అవకాశం ఎవరికీ లేదు. ఇప్పుడు విపక్ష సభ్యులు మాట్లాడే అవకాశం తెచ్చుకున్నారు. అధికార కూటమితో తలపడేంతగా విపక్ష బలం పెరిగింది. రాహుల్, అఖిలేశ్ యాదవ్ల్ ప్రసంగంలో పచ్చి నిజాలు ఉన్నాయి. ప్రజలు ఆకలిబాధలు లెక్కలేయాని అఖిలేశ్ చేసిన వ్యాఖ్యలు దేశంలోని పరిస్థితులకు అద్దం పట్టింది. జిడిపి లెక్కలు, దేశం ఆర్థికంగా ఐదో స్థానంలో ఉందన్న లెక్కలు అబద్దాలని తేల్చేశారు. మొత్తంగా ప్రజాస్వామ్యం తలెత్తుకుంది. అందుకు పార్లమెంటులో సాగుతున్న ప్రసంగాలే నిదర్శనంగా చూడాలి.

# డిజిటల్ అరెస్ట్‌లు..పారాహుషార్..!

డిజిటల్ అరెస్ట్..ఇప్పుడీ భయం ప్రపంచాన్ని వణికిస్తోంది. కరోనాను మించి భూతంలా వెన్నాడుతోంది. అనేకులు మోసపోతున్నారు. బెదరించి..బ్లాక్ మెయిల్ చేయడం ద్వారా ఖాతాలను కొల్లగొట్టేస్తున్నారు. ఇలాంటి ఫేక కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసం చేస్తున్నాడని గుర్తించి పోలీసులను అప్రమత్తం చేయాలి. ఓ రకంగగా ఇలాంటి కాల్స్ వస్తే తిరస్కరించడమే మేలు. డిజిటల్ అరెస్ట్‌ల క్రమంలో భారత్ అప్రమత్తం అయ్యింది. బాధితులు హేతుబద్ధంగా ఆలోచించే వ్యవధి ఇవ్వరాదనే సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు, తక్షణం స్పందించకపోతే చట్టపరమైన చర్యలు వంటి మాటలతో భయపెట్టాలని చూస్తున్నారు. దేశీయంగా ప్రభుత్వ ఏజెన్సీలు అధికారిక లావాదేవీలకు వాట్సప్ లేదా స్కైప్ వంటి వేదికలను ఉపయో గించవు. ఎవరైనా ఫోన్‌కాల్ లేదా ఈమెయిల్ ద్వారా సంప్రదించి.. మీ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దర్యాప్తు చేస్తున్నామని చెబితే బెంబేలు పడిపోకుండా అవతలి వ్యక్తులతో మాట్లాడి వారి గుర్తింపును ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. మోసగాళ్లు మిమ్మల్ని మభ్యపెట్టి బ్యాంకు ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి తెస్తారు. ఇటువంటి సందర్భాల్లో మన భయం వారి పని సులువు చేస్తున్నదనే విషయాన్ని గుర్తించాలి. చట్టబద్ధమైన ఏజెన్సీలు ఏవీ తక్షణం డబ్బు పంపాలని ఒత్తిడి తీసుకురావు. సైబర్ నేరాలకు స్పందించే ముందు ఒక క్షణం ప్రశాంతంగా ఆలోచించాలి. తెలియని నంబర్లకు ఫోను ద్వారా, వీడియోకాల్స్ ద్వారా వ్యక్తిగత సమాచారం, ఆర్థికపరమైన వివరాలు ఇవ్వరాదు. పెరుగుతున్న సైబర్ నేరాల నుంచి రక్షించుకోవాలంటే మరింత జాగ్రత్తగా, ఎప్పటికప్పుడు ఇటువంటి పరిణామాలు తెలుసుకొంటూ ఉండటం అవసరం. ఒక్కోసారి చట్టబద్ధమైన సంస్థల లోగోలు కూడా మోసగాళ్లు వాడుతుంటారు. లాటరీ తగిలిందనే సందేశాలు వచ్చినపుడు గుడ్డిగా నమ్మడం, దురాశకు పోవడం చేస్తే సులువుగా దోచేస్తారు. వైద్య చికిత్సల కోసమని, ఫేక్ ఛారిటీ అప్పీళ్లతో భావోద్వేగాలను బలహీనతగా వాడుకునే కుంభకోణాలు, చట్టబద్ధమైన హైరింగ్ పోర్టల్స్ లేదా సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఉపాధి పోస్టులు పెట్టి నిరుద్యోగులను మోసగించే వైనాలు కూడా ఉంటున్నాయి. వినియోగదారులకు సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం ఆసరాగా చేసుకొని వైరస్ గురించి హెచ్చరించడం ద్వారా రహస్యంగా కంప్యూటర్‌ను యాక్సెస్ చేసి సున్నితమైన వ్యక్తిగత సమాచారం అపహరిస్తారు. త్వరగా డబ్బు సంపాదించాలనే బలహీనతను ఆసరాగా చేసుకొని పెట్టుబడి కుంభకోణాలు, ఫేక్ ఆన్‌లైన్ స్టోర్లతో క్యాష్ ఆన్ డెలివరీ మోసాలు కూడా పెరుగుతున్నాయి. పొరపాటున మన ఖాతాకు పంపిన డబ్బు వెనక్కు ఇవ్వాలని కోరడం.. ఓటీపీలు అడగటం.. డ్రగ్స్ పార్శిళ్లు వచ్చాయనే బెదిరింపులు, తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వజూపటం వంటి ఎత్తుగడల్లో సైబర్ నేరగాళ్లు నైపుణ్యం సాధించారు. దేశంలో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో డజనుకు పైగా సూచనలతో ప్రజలను అప్రమత్తం చేస్తూ సీఈఆర్‌టీ-ఐఎన్' కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ఆఫ్ ఇండియా అత్యవసర పబ్లిక్ అడ్వయిజరీని జారీ చేసింది. భారత సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం 'మన్ కీ బాత్'లో సైబర్ నేరాల గురించి ప్రజలను హెచ్చరించారు. అసలు 'డిజిటల్ అరెస్టు' అన్నదే పెద్ద ఆన్‌లైన్ కుంభకోణమని సీఈఆర్‌టీ-ఐఎన్ తెలిపింది. నిజానికి వారు ప్రదర్శించే ఒత్తిడి వ్యూహాలకు లొంగరాదని సీఈఆర్‌టీ-ఐఎన్ తన అడ్వయిజరీలో ప్రజలను కోరింది.'డిజిటల్ అరెస్టు'ల పేరిట ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలను ప్రధాని మోదీ ఏకంగా మన్‌కీబాత్‌లో ప్రస్తావించి.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడంతో అందరి దృష్టి వీటిపై పడింది. ఇటీవల వీటికి సంబంధించిన కీలక సమాచారాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశంలో చోటుచేసుకొంటున్న డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, రొమాన్స్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో దాదాపు 46శాతం మూడు దేశాల నుంచే జరుగుతున్నట్లు గుర్తించారు. వాటిల్లో పొరుగున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని వెల్లడించింది. ఇప్పటివరకు మొత్తంగా బాధితులు దాదాపు రూ.1,776 కోట్లు నష్టపోయారని గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటిమోసపూరిత కాల్స్..బెదిరింపులపై ఎప్పటికప్పుడు అప్రమత్తం కావాలి. ప్రజలు ఒక్క క్షణం ఆలోచించి అడుగువేస్తే డిజిటల్ అరెస్టుల మోసం నుంచి రక్షణ పొందవచ్చు. నిజానికి డిజిటల్ మోసాలపై ఆందోళన చెందవద్దు. అప్రమత్తతతో ఉంటే చాలని గుర్తించాలి. నిజానికి మోసగాళ్లు ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరించి, ఆ తర్వాత భయపెడతారు. మనకే ఆశ్చర్యం కలిగించేలా మీ సమాచారాన్ని సేకరిస్తారు. ఆ తర్వాత తమ ఆహార్యంతో ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నామనే భ్రమ కల్పిస్తారు. వారెంతగా మిమ్మల్ని భయపెడతారంటే.. మనకుకు ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వరు. ఇప్పటికిప్పుడు తాము చెప్పినట్లు చేయకపోతే అరెస్టు తప్పదని మానసిక ఒత్తిడి తెస్తారు. దీంతో కొందరు భయంతో కష్టార్జితం మొత్తాన్ని వారికి కట్టబెడుతున్నారు. అందుకే అప్రమత్తంగగా ఉండాలి. ఒకవేళ నేరగాళ్ల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే బెదిరిపోవద్దు. వీలైతే స్క్రీన్‌షాట్ తీసి, కాల్‌ను రికార్డు చేయాలి. డిజిటల్ అరెస్టు అనేది మన చట్టాల్లో లేదు. అది ముమ్మాటికీ మోసం, వంచన, అబద్ధం. ఇలాంటి పనులు చేస్తున్నవారు సమాజానికి శత్రువులు అనే గుర్తించాలి. కాల్ చేసిన వారి గురించి అస్సుల పట్టించుకోవద్దు. ఎలాంటి బెదిరింపులు, ప్రలోభాలకు లొంగగవద్ద. సాధ్యమైనంత వరకు కాల్స్ కట్ చేయాలి. బెదరింపులకు పాల్పడే వారిని గుర్తించి ఫిర్యాదు చేయాలి. అంతేగాకుండా మన తోటివారితో చర్చించాలి.

# సత్వర న్యాయం.. చట్టాల లక్ష్యం కావాలి !



బాధితులకు న్యాయం చేయడంతో పాటు..సత్వర న్యాయం మన చట్టాల లక్ష్యం కావాలి. పాలకులు వారి అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటున్న చట్టాలను కూడా చర్చించాలి. చట్టం ఎవరికైనా ఒక్కటే అన్న భావన ప్రజల్లో రావాలి. రాజకీయ నాయకులు చట్టాల నుంచి తప్పించుకోకుండా కఠిన చర్యలు తీసు కోవాలి. ఆ మేరకు చట్టాల అమలులో ప్రభుత్వాలు చిత్తశుద్దితో పనిచేయాలి. ఉదాహరణకు అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పుడు పనులకు సంబంధించి విచారణలు వేగవంత కావాలి. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను పూర్తిగా సంస్కరించి భారతదేశానికి అనుగుణంగా చట్టాల రూపకల్పన జరగాలి. ఐపిసి, సిఆర్‌పిసిల స్థానంలో కొత్తగా తీసుకుని వచ్చిన చట్టాలను స్వాగతించాల్సిందే. ఓ రకంగా చెప్పాలంటే భారత న్యాయ వ్యవస్థలో నూతన అధ్యాయానికి తెరలేచింది. మన దేశంలో బ్రిటిష్ వలస పాలన నుంచి కొనసాగుతున్న భారత శిక్షా స్మృతి(ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ), భారత సాక్ష్యాధార చట్టం కనుమరుగు కానున్నాయి. వాటి స్థానంలో గతేడాది పార్లమెంటు ఆమోదించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్(బీఎస్‌ఏ) ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. జీరో ఎఫ్‌ఐఆర్, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు, ఎస్సెమ్మెస్ లాంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో సమన్ల జారీ లాంటి అత్యాధునిక పద్ధతులు కొత్త చట్టాలతో న్యాయవ్యవస్థలోకి వచ్చాయి.. వీటిని తేవడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ, భారతీయుల కోసం భారతీయులు ఈ చట్టాలను రూపొందించారు. దీంతో ఇక వలస పాలన నాటి నేర న్యాయచట్టాలు శాశ్వతంగా కనుమరుగుకానున్నాయి. కొత్త చట్టాల ఆత్మ, శరీరం, స్ఫూర్తి అంతా భారతీయమేనని తెలిపారు. ఈ కొత్త చట్టాల ప్రకారం.. క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన 45 రోజుల్లోగా కచ్చితంగా తీర్పు వెలువడాలి. ఇందుకు అనుగుణంగా ఖచ్చితంగా పనిచేయాల్సి ఉంటుంది. తొలి విచారణ జరిగిన 60 రోజుల్లోపు అభియోగాలు నమోదు చేయాలి. వ్యవస్థీకృత నేరాలను, ఉగ్ర చర్యలను కొత్త చట్టాల్లో స్పష్టంగా నిర్వచించారు. రాజద్రోహం అనే పదాన్ని తొలగించారు. అయితే దేశ సార్వభౌమత్వం, సమగ్రతలకు భంగం కలిగించే చర్యలను శిక్షార్హం చేశారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల కోసం కొత్త అధ్యాయాన్ని చేర్చారు. కొత్త చట్టాల ప్రకారం.. చిన్నారులపై సామూహిక అత్యాచారానికి పాల్పడితే మరణశిక్ష లేదా యావజ్జీవశిక్ష పడనుంది. రద్దయిన ఐపీఎస్‌లో కొన్ని సెక్షన్లు సంక్లిష్టంగా ఉండేవి. ఏ నేరం ఏ సెక్షన్ కిందకు వస్తుందన్న విషయంలో కాస్త గందరగోళం ఉండేది. వాటిని ప్రస్తుతం సరళతరం చేశారు. భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ)లో 511 సెక్షన్లు ఉంటే భారతీయ న్యాయ సంహితలో ఆ సంఖ్యను 358కి కుదించారు. ఐపీసీలోని 6 నుంచి 52 సెక్షన్ల మధ్య ఉన్న పలు నిర్వచనా లను ఒక సెక్షన్ కిందకు తెచ్చారు. 18 సెక్షన్లను ఇప్పటికే రద్దు చేశారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడం, చిన్నారులపై సామూహిక అత్యాచారం, మూకదాడి తదితర నేరాలకు ఐపీసీలో ప్రత్యేకంగా సెక్షన్లు లేవు. దీంతో గందరగోళం ఏర్పడేది. భారతీయ న్యాయ సంహితలో ఆ లోటును పూడ్చారు. ఇందుకు సంబంధించి చట్టాలను రూపొందించారు. క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు మరింత పకడ్బందీగా జరగడానికి వీలుగా తీవ్రమైన నేరాల్లో సాక్ష్యాల సేకరణకు ఫోరెన్సిక్ నిపుణులు సంఘటన స్థలాన్ని సందర్శించడాన్ని తప్పనిసరి చేశారు. దాదాపు 150 ఏళ్లుగా అమలులో ఉన్నచట్టాలకు పాతరేయడం ఓ మంచి పరిణామంగా చేయాలి. ఇందుకు అనుగుణంగా పోలీసులు, న్యాయస్థానాలను కూడ ఆసన్నద్ధం చేయాలి. ఇప్పటికే అనేక దశలుగా పోలీస్‌లకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. కంప్యూటర్ వ్యవస్థలో అవసరమైన మార్పులు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా దర్యాప్తు, న్యాయవిచారణ చేసేందుకు కొత్త చట్టాలు ఊతమిస్తాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలి. 14 రోజుల్లోగా దర్యాప్తు చేపట్టి కేసును కొలిక్కి తేవాలన్న ప్రాథమిక లక్ష్యం ఇందులో కనిపిస్తోంది. మహిళలపై కొన్ని నేరాలకు సంబంధించి బాధితురాలి వాంగ్మూలా న్ని మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాల్సి ఉంటుంది. వారు లేని పక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాలి. బాధితులత ోపాటు నిందితులు కూడా ఎఫ్‌ఐఆర్ నకళ్లను ఉచితంగా పొందే వీలుంటుంది. వీటితోపాటు పోలీస్ రిపోర్టు, ఛార్జిషీటు, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్లను 14 రోజుల్లోగా పొందవచ్చని కొత్త చట్టం పేర్కొంటోంది. ఇదే క్రమంలో కేసు విచారణలో అనవసర జాప్యాన్ని నివారించడానికి, సకాలంలో న్యాయం అందేలా చేయడానికి, న్యాయస్థానాలు కూడా గరిష్ఠంగా రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేస్తాయి.సాక్షుల భద్రతను వారి సహకారాన్ని దృష్టిలో ఉంచుకుని, సాక్షుల రక్షణ పథకాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పని సరిగా అమలు చేయాల్సి ఉంటుంది. అత్యాచార నేరాల కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీస్‌లు నమోదు చేయాల్సి ఉంటుంది. మహిళలు, దివ్యాంగులు,దీర్ఘకాల వ్యాధిగ్రస్తులతో పాటు 15 ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్ల కంటే ఎక్కువ వయసు వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం నుంచి మినహాయింపు ఉంటుంది. వారు తాము నివాసం ఉన్న చోటే పోలీస్‌ల సాయం పొందవచ్చు. స్వల్ప నేరాలకు సంబంధించి నేరస్థులకు సమాజ సేవచేసే అవకాశాన్ని కొత్త చట్టాలు కల్పిస్తున్నాయి. ఆర్థిక సంబంధ నేరాల్లో నిందితుల ఆస్తులు, నేరం ద్వారా సంక్రమించిన సొమ్ముతో వారు కొన్న స్థిర, చరాస్తులనూ జప్తు చేసే అధికారం పోలీస్‌లకు ఉంటుంది. సాక్షుల వాంగ్మూలాలు, ఆడియో, వీడియో సాక్షాలన్నింటినీ జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన డిజి లాకర్‌లో భద్ర పరుస్తారు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం (సీసీటీఎన్ఎస్) ద్వారా ఇప్పటికే దేశ వ్యాప్తంగా అన్నిపోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేసినందున , సాక్షాలను ఆన్‌లైన్ ద్వారా పంపుతారు.

## మేడిపండు చందంగా

# చిత్రపరిశ్రమ !

**హైదరాబాద్ :**



చిత్ర పరిశ్రమ..అది దేశంలో ఏభాషలో అయినా కావచ్చు..ఆడవాళ్లను లొంగదీసుకోకుండా నడిచిన దాఖలాలు లేవు. చిత్రపరిశ్రమలోకి ఉత్సాహంగా వచ్చిన మగువలను మృగాళు ..వదలడం లేదు. అక్కడ విలువలు మృగ్యం. మగ పెత్తనమే ఎక్కువ. ఆడవాళ్లంటే నీచాతినీచంగా వ్యవహరిస్తున్న ఘటనలు ఎన్నో చూశాం. ఓ రకంగా సమాజంలో మగసామ్రాజ్యం ఎక్కడైనా ఉందంటే అది చిత్ర పరిశ్రమ అని చెప్పక తప్పదు. ఇలీవల మాలీవుడ్ అంటే..మళయాలంలో కాస్టకౌచింగ్ దుమారం రేపింది. కేరళలో జస్టిస్ హేమ కమిటీ నివేదిక తర్వాత ఒక్కసారిగా అగ్నిపర్వతం బద్దలయ్యింది. అక్కడ జరుగుతున్న దారుణాలు బయటపడ్డాయి. నీతి వాక్యాలు వల్లించే వారి బండారం బయటపడింది. అమ్మ కమిటీకి మోహన్ లాల్ రాజీనామా చేశారు. వాడుకోవడం ...వదిలేయడం చిత్రపరిశ్రమలో షరామూమూలు అన్న ప్రచారం ఉండనే ఉంది. ఈ క్రమంలో వివిధ సినీ కమిటీల బాధ్యులు లైంగిక వేధింపుల, దాడుల ఆరోపణలని ఎదుర్కొని రాజీనామా చేశారు. కొంతమందిపై కేసులు నమోదయ్యాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ చిత్ర పరిశ్రమలోని స్త్రీల పని పరిస్థితులు బాగుచెయ్యటానికి అనేక కొత్త సూచనలు చేస్తున్నారు. ప్రభుత్వం విధిలేని పరిస్థితిలో కార్యాచరణకు పూనుకుంది. ఇదే క్రమంలో నటీమణులు ఒక్కొక్కరుగా తమకు జరిగిన అనుభవాలను, బాధలను బయటపెడుతున్నారు. నిజానికి ఆడవాళ్లు ధైర్యం చేసి చిత్రపరిశ్రమలోకి రాకుంటే...విర్రవీగుతున్న మగాళ్లు ఏమవుతారు. ఆడవేశాలు కూడా వారే వేసుకుంటారా అన్నది ఆలోచన చేయాలి. స్త్రీలు భీష్మించుకుని చిత్రరంగంలోకి రాకుంటే ..డ్రామా కంపెనీల్లాగా చిత్రపరిశరమ దుర్గతిని ఎదుర్కోక తప్పదు. నీతి వాక్యాలు వల్లిచే హీరోలు, నిర్మాతలు, దర్శకులు దీనిపై ఆలోచన చేయాలి. చిత్రపరిశ్రమను ఆదర్శం గా నిలపడానికి కృషి చేయాలి. పని స్థలాల్లో స్త్రీల లైంగిక వేధింపుల గురించి తెలుగు సమాజాల్లో జరుగుతున్న చర్చ దేశంలో ఇతర చోట్ల జరుగుతున్న చర్చలకి పూర్తి వ్యతిరేకంగా ఉంది. బెంగాల్‌లో ఆర్‌జి కార్ ఆస్పత్రిలో జరిగిన ఘటన తర్వాత ఆ రాష్ట్రంలో హింసా సంస్కృతి గురించే కాకుండా, పని స్థలాల్లో లైంగిక వేధింపులు, దాడుల్ని సమర్థించే సంస్కృతి గురించి అందరూ మాట్లాడుతున్నారు. వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఎంతోమంది వాదిస్తున్నారు. అయితే ఎన్ని ఘటనలు జరుగుతున్న..కుక్కతోక వంకర అన్న చందంగా మన దగ్గర మాత్రం ఇలాంటి చర్చలు జరగటం లేదు. పరిశ్రమలో ఆడవాళ్ళ పని పరిస్థితుల గురించి అస్సలు ఎవ్వరూ మాట్లాడటంట్లేదు. వారిని తోటివారుగా గౌరవించడం లేదు. ఇలా తమిళనాడు, బాలీవుడ్, ఒక్కటేమిటి అన్ని భాషల్లోనూ చిత్రపరిశ్రమలోకి రావాలనుకున్న...వచ్చిన మహిళలు వివక్షను, వేధింపులను ఎదుర్కొంటున్నారు. నిజానికి పనిప్రదేశాల్లో అన్ని చోట్లా ఇదే దుస్థితి ఉంది. కాకపోతే చిత్రపరిశ్రమలో కాస్తా ఎక్కువగా ఉంటుందని చర్చించుకోవాల్సి వస్తోంది. తెలుగు సినిమా పరిశ్రమలో పేరున్న డాన్స్ మాస్టర్ జానీ మీద అతని అసిస్టెంట్ దాఖలు చేసిన లైంగిక వేధింపులు, దాడికి సంబంధించిన ఫిర్యాదు గురించిన చర్చ ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో వందలాది మందిని కదిలించింది. అయ్యో జానీ మాస్టార్ అంటూ నీతులు వల్లిస్తున్నారు. ఆ అమ్మాయి సొంతంగా బతుకీడుద్దామనుకుంటున్న తరుణంలో కూడా వేధింపులకు పాల్పడ్డ జానీ తీరును ఖచ్చితంగా ఎండగట్టాల్సిందే. ఆమె ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడే ..ఎందుకు ఫిర్యాదు చేసింది..ఇన్నాళ్లూ ఇష్టంతోనే అతడితో ఉంది కదా? ఆమెను ఎవరు వాడుకుంటున్నారు. అతని పట్ల అసూయతోనే ఈ ఫిర్యాదు చేయించారు అంటూ నస పెడుతున్న వారు నిజాలు ఆలోచన చేయాలి. ఇటువంటి వాదనలతో నిజాలను పక్కదారి పట్టించలేరు. సోషల్ మీడియా ఇదే వాస్తవమన్న అభిప్రాయాన్ని కలుగచేస్తోంది. తెలుగు సినిమా పెద్దలు కూడా నేరం రుజువయితేనే అతని మీద చర్యలు తీసుకోవాలి అంటూ ఆయనకి పరోక్షంగా మద్దతు కూడగడుతున్నారు. జానీ మాస్టర్ అలా చేయడని కొందరు వంతపాడుతున్నారు. ఎవరు ఎలాంటి వారన్నది ఇలా ఆరోపణలు యటకు వచ్చినప్పుడే కదా తెలిసేది. 2018లో శ్రీరెడ్డి, ఇతర కళాకారులు తెలుగు సినీ పరిశ్రమలోని పురుషాధిపత్య సంస్కృతినీ, లైంగిక దాడీనీ తమ నిరసనల ద్వారా అందరి ముందుకీ తెచ్చారు. అప్పుడు ఆమెను వెక్కిరించినవారు, ఈసడించుకున్న వారే ఎక్కువ. డ్రగ్స్‌తో పట్టుబడ్డప్పుడు కూడా ఇలాగే వాదిస్తున్నారు. కానీ నిజాలను ఒపపుకోరు. తమకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకుని బతుకుతున్నారు. దాని జోలకి ఎవరూ రావద్దని వారు కోరుకుంటున్నారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో ఉన్న పరిస్థితి ప్రకారం కొత్తవాళ్ళకి పని చేసే అవకాశం రావాలన్నా, లేక అసోసియేషన్ కార్డు పొందాలన్నా కోఆర్డినేటర్లపైనా, పైనున్న మగ మాస్టార్లపైనా ఆధార పడాలి. వారికి లొంగి ఉంటేనే అసలు పనిచేసే అవకాశాలు వస్తాయి. పరిశ్రమ వారి మాటే వింటుంది. అందుకే జానీమాస్టర్ లాంటి వారు దీనిని అలుసుగా తీసుకుని లొంగగదీసుకుంటున్నారని అర్థం అవుతోంది.తనకంటే 20ఏళ్ళు చిన్నదైన అమ్మాయి, అదీ మైనారిటీ తీరని వయసులో ఉన్న అమ్మాయి పట్ల ఓ మాస్టర్ వ్యవహరించిన తీరుపైన చర్చించాలి. పరిశ్రమలో నిలబడడానికి వచ్చిన జూనియర్‌ను ప్రోత్సహించాల్సింది పోయి..బ్లాక్‌మెయిల్ చేసి కామవాంఛ తీర్చుకునే దగుల్బాజీలను ఎండగట్టాల్సిందే. సినిమా పరిశ్రమలో అత్యధిక శాతం తనకి మద్దతు ఇవ్వదని, వ్యతిరేకంగా మాట్లాడతారని తెలిసి కూడా ఆమె ఫిర్యాదుకు వచ్చిందంటే జానీ మాస్టర్ ఆమెను ఎంత తీవ్రంగా నియంత్రిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఆమెతో పాటు పని చేసే డాన్సర్లు, ఇతర సంఘాల్లో ఉండే అనేక మంది స్త్రీలు, ఇంకా చెప్పాలంటే పరిశ్రమలో దాదాపు అందరు స్త్రీలు కూడా ఇటువంటి పరిస్థితిలోనే ఉన్నారని మనం అనుకోవచ్చు. వాళ్ళు చెయ్యలేని ధైర్యం ఆమె చేసినందుకు అభినందించాలి. మాలీవుడ్ లాగా టాలీవుడ్‌లోనూ జస్టిస్ హేమ కమిటీ లాంటిది రావాలేమో. అలాంటి పరిస్థితి తెచ్చుకునే దాకా తెలుగు పరిశ్రమ రాకుండా ఉంటే మంచిది. పరిశ్రమలో ఉన్న సినీ దిగ్గజాలు ఈ దుస్థితిపై చర్చించాలి. పరిశ్రమ గౌరవాన్ని కాపాడాలి. తమకు చెడ్డపేరు రాకుండా చూసుకోవాలి. నిజానికి చెప్పాలంటే ఇలాంటి దుస్థితి అన్ని పరిశ్రమల్లో ఉంది. ఎక్కడ ఉన్నా దానిని ఎదరించాల్సిందే. నిలదీయాల్సిందే. సమర్థించే వారిని నిగ్గదీయాల్సిందే. అప్పుడే భయం అన్నది పుట్టుకుని వస్తుంది.

## డీలిమిటేషన్ అన్యాయాలపై

# చర్చ మొదలవ్వాలి !

**హైదరాబాద్ :**



దేశ జనాభాకు అనుగుణంగా పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు ఎప్పుడో పెరగాల్సి ఉంది. కానీ ఈ సీట్లు పెరగడం లేదు. సరికదా కేంద్రంలో పాలన చేసిన పార్టీలన్నీ కాలయాపన చేస్తూ వచ్చాయి. సీట్లు పెరిగితే తమకు ఎక్కడ ముప్పు వస్తుందో అన్న ఆలోచనలో పాలక పార్టీలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన కత్తి మీద సాములాంటిది. ఇది ఎన్నో కీలక రాజకీయ పరిణామాలకు దారి తీసే అవకాశం ఉంది. దీనికితోడు జనాభా కూడా పాపం పెరిగినట్లు పెరుగుతోంది. జనాభా కంట్రోల్ చేయడంలో కొన్ని రాష్ట్రాలు బాగా కృషి చేస్తుంటే..బీహార్, బెంగాల్ వంటి రాష్ట్రాలు అస్సలు పట్టించుకోవడం లేదు. అంతెందుకు గణాంకాల ప్రకారం ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ పట్టించుకోలేదు. దక్షిణాదిలో జనాభా నియంత్రణ కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. ఈ క్రమంలో అక్కడ డీలిమిటేషన్ జరిగితే అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని ఇతర రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణలో కృషి చేస్తున్న తమకు అన్యాయం జరిగేలా ఉందని ఇటీవల తెలంగాణ మంత్రి కెటిఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాకుండా దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల పంపిణీలో అన్యాయం జరుగుతుందని కూడా అన్నారు. నిజంగానే ఇది ఆలోచించాల్సిన విషయం. కేరళ లాంటి రాష్ట్రాలు అక్షరాస్యత,జనాభా నియంత్రణలో ముందున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే దేశ జనాభా 140 కోట్లకు చేరినందున వారికి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించే వారి సంఖ్య కూడా పెరగాలని కోరుకుంటున్నారు. అందుకే జనాభా ప్రాతిపదికన విభజించి 846 నియోజకవర్గాలు చేయాలన్న ఆలోచన ఉంది. అలా చేస్తే.. ఒక్క యూపీకే 143 లోక్ సభ సీట్లు వస్తాయి. మొత్తం దక్షిణాదికి 160 వరకూలోక్ సభ సీట్లు ఉంటాయి. అంటే... మొత్తం దక్షిణాది అంతాకూడా యూపీతో పోటీపడదన్న మాట. దీంతో పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాబల్యం తగ్గిపోవడం ఖాయం అన్న ఆందోళన మరోవైపు వెన్నాడుతోంది. అందుకే దక్షిణాది రాష్ట్రాలు నియోజకవర్గాల పునర్వి భజనకు జనాభాను ప్రాతిపదికగా తీసుకోకూడదని డిమాండ్ చేస్తున్నాయి. దేశంలో జనాభాను నియంత్రిం చడంలోనే కాకుండా మానవ అభివృద్ధి సూచికల్లో కూడా దక్షిణాది రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. జనాభా లెక్కల ఆధారంగా చేసే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కత్తి దక్షిణాది రాష్ట్రాలపై వేలాడుతోంది. మహిళా రిజర్వేషన్‌బిల్లు ఆమోదించిన తరువాత జరిగే తొలి జనగణన తరువాత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి.. మహిళా రిజర్వేషన్‌లను అమలు జరుపుతామని లోక్‌సభలో కేంద్రం ప్రకటించింది. దీంతో.. మళ్లీ నియోజక వర్గాల పునర్విభజన అంశం తెరమీదకు వచ్చింది. జనాభానే ప్రాతిపదికగా తీసుకుంటే దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గే ప్రమాదం ఉందని ఇప్పటికే అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఎంపీ స్థానాలకు 1971 నాటి జనగణన ప్రాతిపదిక. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలకు ప్రస్తుతం 129 లోక్‌సభ స్థానాలున్నాయి. జనాభా లెక్కలు తీసిన తర్వాత పునర్విభజనలో వీటి సంఖ్య 103కు పడిపోతుంది. ఉత్తరాదిలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య పెరుగుతుంది. ప్రస్తుతం ఈ నాలుగు రాష్ట్రాల్లోని లోక్‌సభ స్థానాల సంఖ్య 174 కాగా పునర్విభజనతో వీటి సంఖ్య ఏకంగా 204 స్థానాలకు చేరుకుంటుంది. పశ్చిమబెంగాల్, ఒడిషా కూడా భారీగా నష్టపోతాయి. ప్రసుతం ఈ రెండు రాష్ట్రాలకు కలిపి 42 లోక్‌సభ స్థానాలుంటే.. కొత్తగా జరిగే పునర్విభజన తరువాత వాటి సంఖ్య 34కు పడిపోయే అవకాశం ఉంది. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు జరిపినందుకు దక్షిణాది రాష్ట్రాలు దారుణంగా నష్టపోతుండగా.. జనాభా నియంత్రణలో పూర్తిగా విఫల మై.. జనభా విస్ఫోటంతో నానా అవస్థలు పడుతున్న ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం లబ్ధి పొందడం దారుణం కాకా మరోటి కాదు. ఇదే విషయాన్ని కెటిఆర్ లెక్కలతో సహా విరించి..జరుగబోతున్న నష్టాన్ని ప్రజల ముందుంచారు. దక్షిణాది రాష్ట్రాల నేతలు కూడా ఇదే విషయంపై మండిపడుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు కేవలం జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకూడదని ఈ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేటీఆర్ కూడా ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం చేశారు. అందుకే నియోజకవర్గాల పునర్విభజ నలో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని హామీ ఇవ్వాలంటూ తమిళనాడు సిఎం స్టాలిన్ ప్రధాని మోడీని డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల బిల్లును తీసుకు వచ్చిన సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన తరవాత అమలు చేయడం అని అందులో షరతు పెట్టింది. దీంతో ఈ నియోజకవర్గాల పునర్విభజన తెరపైకి వచ్చింది. ఇదే జరిగితే దక్షిణాది పరిస్థితి ఏమిటన్నదానిపై చర్చలు ప్రారంభమయ్యాయి. దేశంలో జనాభా పెరిగిపోతోందని జనాభా నియంత్రణను మన ప్రభుత్వాలు చేపట్టాయి. జనాభాను నియంత్రించిన వారికి ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు మెరుగ్గా ఉన్నాయి. ప్రజలు చిన్న కుటుంబాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఫలితంగా దక్షిణాదిలో జనాభా పెరుగుదల నిష్పత్తి తగ్గింది. అభివృద్ధిలో ముందుకు వెళ్లింది. కానీ ఉత్తరాదిలో జనాభా పెరుగుదల నిష్పత్తి తగ్గలేదు... అక్కడి ప్రజలు జనాభా నియంత్రణ పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు జనాభా ప్రకారం డీలిమిటేషన్ జరిగితే.. నష్టపోయేది దక్షిణాది. లాభపడేది ఉత్తరాది. ఈ అన్యాయన్ని ఎలా సరిచేస్తారన్నదే ఇప్పుడు దేశం ముందున్న ప్రశ్న.

# పరస్పర విమర్శలకే నేతల ప్రాధాన్యం

**హైదరాబాద్ :**

ఎన్నికల్లో అన్ని అంశాలు పక్కకు పోతున్నాయి. దూషణల పర్వం విపరీతంగా ముందుకు పోతోంది. ఎంత ఎక్కువగా దూషిస్తే అంతగా పాపులారిటీ అన్న పంథాలో పార్టీలు, వాటి నేతలుముందుకు సాగుతున్నారు. రాజకీయాల్లో ఇలాంటి అవాంఛనీయ వ్యవహారాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రధాని మోడీ సైతం ఇదే పంథాలు సాగుతున్నారు. ఎపిలో జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పరస్పర దూషణలు చేసుకోవడంతోనే ప్రచారాన్ని హైటెల్ చేస్తున్నారు. తెలంగాణలో కూడా ఇదే తరహా పరిస్థితి ఉంది. అధికార కాంగ్రెస్, విపక్ష బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు పదేపదే విమర్శలతో కాలం గడుపుతున్నారు. సవాళ్లు విసరుతున్నారు. నిజానికి ప్రజలకు ఇవన్నీ అవసరం లేదు. ఏం చేస్తారో చెప్పాలి. ఏం చేశామో చెప్పాలి. ఎపినే తీసుకుంటే..రాష్ట్ర విభజన తరువాత 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం మిగిలిన అంశాలను విస్మరించి కేవలం రాజధాని భూముల సమీకరణ, సింగపూర్ నమూనా తదితర అంశాలకే పరిమితమైంది. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ఆలోచనలు చేయలేదు. 2019-2024 మధ్య పాలించిన వై.యస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కేవలం 'బటన్ నొక్కుడు' పరిమితమై మిగిలిన అన్ని అంశాలను నిర్లక్ష్యం చేసింది. మౌలిక వసతులలో భాగంగా కనీసం రోడ్ల నిర్మాణం కూడ చేయలేదు. టిడిపి-జనసేన కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో అభివృద్ధికి అవసరమైన అంశాలను తాము విస్మరించిన తీరును ప్రజలు గుర్తించకుండా ఉండటానికే ఎన్నికల ప్రచారంలో పరస్పర దూషణలు, వ్యక్తిగత దూషణలు చేసుకుంటున్నాయి. అభివృద్ధి అంశాలను ప్రస్తావించకుండా కేవలం సంక్షేమ అంశాలకే పరిమితమైనారు. అభివృద్ధి- సంక్షేమాన్ని సమతుల్యం చేయాలనే ఉద్దేశం మూడు ప్రాంతీయ పార్టీలకు లేకపోగా, మూడు పార్టీలు కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి అంటకాగటంపైనే దృష్టి సారించారు. మోడీ ముందు మోకరిల్లే రాజీకాయలకు పరిమితం అయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి స్పష్టమైన విధానాలు ప్రకటించలేక పోతున్నారు. మూడు ప్రాంతీయ పార్టీలు విస్మరించిన అంశాలపై వాటిని నిలదీయాల్సిన అవసరముంది.సాధారణంగా ప్రాంతీయ పార్టీలు ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షల నుంచి ఉద్భవించి, తమ రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం పోటీ పడతాయి. తెలుగుదేశం పార్టీ 1982లో 'ఆంధ్రుల ఆత్మగౌరవం' నినాదంతో ఏర్పడింది. ఉమ్మడి ఎపిలో పార్టీ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ జీవితాంతం అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన అందించారు. కానీ పదవీచ్యుడుతు కావడంతో ఆయన ప్రతిభ పోయింది. చంద్రబాబు హయాంలో కొంత అభివృద్ధి సాగింది. కానీ జగన్ పాలనలో విడివడ్డ ఎపి అప్పులకుప్పగా మారింది. తెలంగాణలో కెసిఆర్ అభివృద్ధి ముసుగేసి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసింది. 1980వ దశకంలో శ్రీమతి ఇందిరా గాంధీ నాయకత్వానగల కేందప్రభుత్వ ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా ఎన్.టి.రామారావు, జ్యోతిబసు, రామకృష్ణ హెగ్డే, మొదలగు నాయకులు సమావేశాలు జరిపి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో మార్పు తెచ్చి, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇచ్చేలా సర్కారియా కమిషన్‌ను నియమించిన సంగతి తెలిసిందే. మోడీ అధికారంలోకి వచ్చాక నీతి ఆయోగ్ ఏర్పాటు చేశారు. ప్రణాళికా సంఘాన్ని తొలగించారు. కానీ రాష్ట్రాలకు చేయూతనిచ్చి అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇకపోతే తాజా ఎన్నికల్లో కూడా అభివృద్ధి నినాదం వెనక్కి పోయింది. మూడు ప్రాంతీయ పార్టీల అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను విస్మరించాయి. గత పదేళ్లుగా ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ, పోలవరం నిర్మాణం మొదలగు అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి, పోరాడి హక్కులను సాధించుకోవడానికి బదులు కేంద్రానికి సాగిలబడ్డాయి. భావితరాలకు అన్యాయం చేసేవిధంగా మూడు ప్రాంతీయ పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలలో ఈ అంశాలు కనిపించలేదు. ప్రత్యేక హోదా గురించి మూడు ప్రాంతీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలలో చేర్చలేదు.ప్రత్యేక హోదా వలన రాష్ట్రంలో పారిశ్రామిక రాయితీలు, పన్ను రాయితీలు లభించి పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంది. ప్రత్యేక హోదా కోసం గత దశాబ్ద కాలంలో అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ వాటిని అణచివేయడానికే ప్రయత్నించారు. ఒక్కసారి కూడా ప్రత్యేక హోదాపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించటానికి ప్రయత్నించలేదు. ఎన్నికల మ్యానిఫెస్టోలలో ప్రత్యేక హోదాను విస్మరించటం శోచనీయం.త దశాబ్ద కాలంలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరగలేదు. మూడు ప్రాంతీయ పార్టీలకు పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పనపై స్పష్టమైన దృక్పథం లేదు. రాష్ట్రంలో ఐ.టి రంగం, ఫార్మా రంగం, టెక్స్‌టైల్స్, వ్యవసాయాధారిత పరిశ్రమల అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. విశాఖపట్నంతో పాటు తిరుపతి, అనంతపురం, ప్రకాశం జిల్లాలో దొనకొండ, గన్నవరం తదితర ప్రాంతాలను పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. నిరుద్యోగులకు ప్రభుత్వ శాఖలలో ఖాళీగా వున్న ఉద్యోగాలతో పాటు, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయటం ద్వారా ఉపాధి కల్పించాలి. పెద్ద సంఖ్యలో ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులరైజేషన్‌తో ఉద్యోగ భద్రత కల్పించాలి. అనేక రాష్ట్రాలలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో సిపిఎస్ రద్దు గురించి 2014-19 మధ్య తెలుగుదేశం, 2019-2024 మధ్య వైఎస్‌ఆర్ ప్రభుత్వం మాట తప్పాయి. ఇప్పుడు ఎన్నికల మ్యానిఫెస్టోలలో సిపిఎస్ గురించి చర్చిస్తామని చెప్పారు తప్పితే రద్దు చేస్తామని మూడు పార్టీలూ పేర్కొనలేదు. ఇక తెలంగాణలో ఇదే పరిస్తితి నెలకొంది. పరస్పర విమర్వలు చేసుకోవడంతోనే కాలం గడిపేస్తున్నారు. ఈ క్రమంలోప్రజలే దీనిని గుర్తించి ఓటేయాలి. చైతన్యం ప్రదర్శించాలి.


తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
సోమవారం 2-6-2025



# నినాదంగానే మిగిలిపోతున్న అభివృద్ధి !







**హైద్రాబాద్ :** విపక్షంలో ఉన్నప్పుడు కనిపించిన అనేకానేకసమస్యలను... అధికారంలో ఉన్నప్పుడు విస్మరిస్తున్నారు. ప్రజలు, రైతులు, నిరుద్యోగులు తదితర సమస్యలు అధికారంలోకి వచ్చాక వారికి కనిపించడం లేదు. ఇందుకు మోడీ కూడా మినహాయింపు కాదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ అనేక రకాలుగా యూపిఎ ప్రభుత్వాన్ని విమర్శించి, మన్మోమన్ సింగ్‌ను మౌనసింగ్‌గా అభివర్ణించిన మోడీ ఇప్పుడు ప్రధాన సమస్యలను పట్టించుకోవడం లేదు. ఇప్పటికే పదేళ్ల పుణ్యకాలం గడిచిపోయింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం జరుకున్నాం. ఇంకా రైతులు, నిరుద్యోగుల సమస్యలు రెట్టింపు అయ్యాయే తప్ప తగ్గలేదు. మన నాయకులు కూడా నైతికంగా పతనమవుతూ వచ్చారు. అధికారమే పరమావధిగా రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. అధికారం కోసం సమాజాన్ని కులాలు, మతాల పేరిట ముక్కలు చెక్కలు చేశారు. తప్పుడు పనులు చేసే వారు కూడా కులాన్ని రక్షణ కవచంగా వాడుకోవడం మొదలెట్టారు. వజ్రోత్సవాల సందర్భంగా మన పతనాన్ని చూస్తే ఆవేదనే మిగులుతుంది. ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నా పట్టించుకోవడం లేదు.నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో చర్చించడం లేదు. పార్లమెంటులో చర్చించడం లేదు. అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించడం లేదు. మోడీ పార్లమెంటులో కనిపించరు. ప్రజల్లోకి రారు. ప్రజలు తమస సమ్యలను ఎక్కడ చెప్పుకోవాలో తెలియడం లేదు. ప్రజల్లోకి వెళ్లి సమస్యలను ఆరా తీయడం లేదు. ఇలాగే పాలన కొనసాగిస్తే మరో 20 ఏళ్లయినా భారత్ బలపడదు. అత్యాచార ఘటనలు, పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. పన్నలు వసూళ్లతో ప్రజలను పీల్చి పిప్పి చేయడం తప్ప మరో ధ్యాస బిజెపి పాలకులకు కనిపించడం లేదు.ఈ దశలో భారతదేశం స్వాతంత్ర్యోత్సవాలను పురస్కరించుకుని 78 ఏళ్ళు అవుతున్న సందర్భంగా దేశ విదేశాల్లోనూ వేడుకలు అంబరాన్ని అంటాయి. ఊరూవాడా మువ్వన్నెల జెండా రెపరెప లాడింది. ప్రజలు తమ దేశభక్తిని మనసారా చాటారు. ఈ స్ఫూర్తిని ఇంకా ముందుకు తీసుకుని పోవాలని ప్రజలు మాత్రమే సంకల్పం ప్రకటించారు. పాలకులు ఇక తమ రాజకీయాలను పక్కన పెట్టి దేశంకోసం శ్రమించాల్సిన సమయమిది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక, ఆర్థిక న్యాయానికి విలువనిచ్చే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర గ్రూపులు స్వార్థపర రాజకీయశక్తులతో పోరాడేందుకు సమైక్యంగా కృషి చేయాలి.అప్పుడేపోరాట యోధులు సాధించి పెట్టిన స్వాతంత్ర్య లక్ష్యాలను ముందుకు తీసుకెళ్ళ గలుగుతాం. ఆధునిక కాలంలో ఒక స్వతంత్ర దేశం సాధించిన పురోగతిని అంచనా వేయడానికి 78 ఏళ్ల సుదీర్ఘ కాలం సరిగ్గా సరిపోతుంది. మనం సంబరంగా జరుపుకుంటున్న ఈ ఉత్సవాలను పునఃసమీక్షించు కుని ముందుకు సాగాల్సి ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు పూర్తయినా ఇంకా దారిద్య్రం పోలేదు. పేదలు పేదలుగా ఉంటున్నారు. గృహవసతి అందని ద్రాక్షగా మారింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధిని సాధించాం. ఆర్థికంగా కూడా పురోగమించాం. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన దేశ వార్షిక బడ్జెట్ 250 కోట్లు దాటలేదు. ఇందులో దాదాపు 30 కోట్ల ద్రవ్యలోటు ఉంది. ఇప్పుడు దేశ వార్షిక బడ్జెట్ దాదాపు 30 లక్షల కోట్ల వరకు ఉంది. వార్షిక ఆదాయం 170 కోట్ల వరకు మాత్రమే ఉన్నప్పటికీ నాటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను, సాగునీటి ప్రాజెక్టులను చేపట్టారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా వాటిని పూర్తి చేశారు. ఇప్పుడు ప్రభుత్వ ఆదాయం ఇబ్బడిముబ్బడి గా పెరిగినప్పటికీ దశాబ్దాల క్రితం ఏర్పాటైన ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుం టున్నాం. ఉపాధి ఉద్యోగ రంగాలను దెబ్బతీస్తున్నాం. దేశం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని చెప్పుకొంటున్న పాలకులే పేదరికం పేరిట ఉచిత పథకాలకు తెర తీస్తున్నారు. మరోవైపు లక్షల కోట్ల కార్పోరేట్ రుణాలను మాఫీ చేస్తున్నాం. ప్పుడు రాష్ట్రాల్లో గానీ, కేంద్రంలో గానీ అధికారంలో ఉన్నవారెవరూ 1947కి ముందు పుట్టినవాళ్లు కారు. ప్రజా జీవితంలో ఉన్నత ప్రమాణాలు అంటే ఎలా ఉంటాయో చెప్పేవారు కూడా లేరు. ఎవరైనా చెప్పడానికి ప్రయత్నించినా ఎగతాళికి గురవుతున్నారు. అత్యంత దుర్భరమైన దారిద్య్రం నెలకొన్న, వ్యాధులతో కునారిల్లుతున్న, నిరక్షరాస్యులైన ప్రజలతో నిండిన ఒక దేశంలో ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించాలని భారతదేశంలో అధికారంలోకి వచ్చిన కొత్త పాలక వర్గాలు భావించాయి. రెండు శతాబ్దాల పాటు సాగిన వలస పాలనతో దేశం మొత్తంగా కుంగుబాటుకు గురైంది. అభివృద్ధి వెనుకపట్టు పట్టింది. స్వాతంత్యానికి ముందు అర్థ శతాబ్దంలో వ్యవసాయ జనాభా తలసరి ఆదాయం పూర్తిగా క్షీణించింది. 1950లో రాజ్యాంగాన్ని ఆమోదించడం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేయడం స్వతంత్ర భారతదేశం సాధించిన ముఖ్యమైన విజయం. నయా ఉదారవాద విధానాలకు మారడంతో, మూడు దశాబ్దాల క్రితం వరుసగా వచ్చిన ప్రభుత్వాలు సంపన్నులను మరింత సంపన్నులుగా తయారు చేసే అభివృద్ధి పంథాను పెంచి పోషిస్తూ వచ్చాయి. బూర్జువా సంస్థలకు, వారితో కుమ్మక్కైన – అంతర్జాతీయ ఆర్థిక పెట్టుబడి దారులకు అనుకూలంగా లొంగి వుండేటు వంటి విధానాల రూపకల్పన పెరుగుతూ వచ్చింది. మోడీ ప్రభుత్వం కూడా గత ఎనిమిదేళ్ళ కాలంలో నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అమలు చేసింది. దీనివల్ల పరిస్థితులు మరింత అధ్వాన్నంగా మారాయి.ప్రజారోగ్య వ్యవస్థ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ ల్లో అభివృద్ధి, విస్తరణకు సంబంధించి వైఫల్యం నెలకొంది. ఇన్నేళ్ల తర్వాత కూడా, ప్రజారోగ్యంపై పెట్టే ఖర్చు జిడిపిలో కేవలం ఒకే ఒక్క శాతంగా వుంది. ప్రపంచంలోనే చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ మనదేనంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా రూపాయి పతనాన్ని అడ్డుకోలేక పోతున్నాం. ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం సఫలీకృతం కాలేదంటూ రాజ్యాంగం తుది ముసాయి దాను ఆమోదించిన సమయంలోనే 1949లో రాజ్యాంగనిర్ణాయక అసెంబ్లీ లో డాక్టర్ అంబేద్కర్ హెచ్చరించారు. బడా కార్పొరేట్ సొమ్ము రాజకీయ వ్యవస్థను కాలుష్యం చేస్తోంది. రాజ్యాంగం లో పొందు పరచబడిన విలువలు అన్నీ కూడా తీవ్ర దిగ్బంధాన్ని ఎదుర్కొం టున్నాయి. మరింత మెరుగైన జీవితం కావాలన్న ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదు. బతకడమే భారంగా మారేలా విధానాలు ఉన్నాయి. మెరుగైన పాలన కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర గ్రూపులు సమైక్యంగా వుండేందుకు ప్రయత్నాలు చేయాలి. అప్పుడే స్వాతంత్ర్య ఉద్యమ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్ళగలుగుతాం. దేశాన్ని వేగంగా ముందుకు తీసుకుని వెళ్లగలం. కార్పోరేట్లకు దోచిపెట్టే దేశ సంపదను అడ్డుకోవాల్సిందే. అప్పుడే ప్రజలకు ఈ దేశ ఆస్తులపై హక్కు లభిస్తుంది. అందరికీ ఆహారం, కూడు, గుడ్డా, నివాసం వంటి లక్ష్యాలను చేరుకోవాలి. ఉద్యోగం లేదా ఉపాధి అన్నది హక్కుగా రావాలి. ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న డబ్బును దుబారా చేయకుండా నిరోధించాలి. పాలకులు తమ జేబులోంచి ఇస్తున్నట్లుగా చేస్తున్న పందేరాలకు అడ్డుకట్ట వేయాలి. అభివృద్ధి పనులకే సొమ్మును వినియోగించాలి. అప్పుడే దేశ మనుగడ సాగిస్తుంది.

# నిగ్రహం కోల్పోతున్న నేతలు !

**హైద్రాబాద్ :** విగ్రహాల సంగతి ఎలా ఉన్నా..నేతలకు నిగ్రహం ఉండాలి. మాట్లాడేప్పుడు నిగ్రహంతో మాట్లాడాలి. ఏదిపడితే అది మాట్లాడడం సరికాదు. భాషను పరిమితి మేరకు ఉపయోగించాలి. మరీ ముఖ్యంగా అధికారంలో ఉన్నప్పుడు కొంత నిగ్రహంగా మాట్లాడాలి. ఎన్నికల సమయంలో ప్రచారం కోసం భాషను ఇష్టానుసారం ఉపయోగిస్తున్నారు. వాడరాని పదాలన్నీ వాడేస్తున్నారు. సరే ఎన్నికల ప్రసంగం కాబట్టి వదిలేద్దామని అంతా అనుకుంటారు. కానీ అధికారంలో ఉన్నా..విపక్షంలో ఉన్నా నేతలు తమ మాటల్లో తప్పులు, బూతులు, ఇతరత్రా వాడకూడని పదాలు దొర్లకుండా చూసుకోవాలి. ఎదుటివారి మీద ఎంతగా కోపం ఉన్నా..అందుకు అనుగుణంగానే భాషను ఉపయోగించాలి. ఈ విషయంలో దివంగత వాజ్‌పేయ్ ప్రసంగాలు ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన ఎప్పుడూ పరుషంగా మాట్లాడిన సందర్భాలు లేవు. విమర్శలను కూడా సుతిమెత్తగా చేసేవారు. ఒకవేళ ఎవరైనా తనపై విరుచుకు పడ్డా..ఆయన అంతకు మించిన సంయమనంతో సమాధానం చెప్పేవారు. ఒకవేళ పరుషపదజాలంతో ఎవరైనా దూషిస్తే..మీకు ఇది ఉచితం కాదని సున్నితంగా హెచ్చరిక చేసేవారు. మొన్నటి ఎన్నికల సమయంలో ఏపి సిఎంగా ఉన్న జగన్, ఆయన అనుచరులు కూడా బూతులు మాట్లాడారు. తాము పదవుల్లో ఉన్నామన్న జ్ఞానం లేకుండా మాట్లాడారు. ఇలాంటివి ప్రజలు గుర్తిస్తారు. అలాగే హర్షించరని కూడా గుర్తించాలి. ఇప్పుడు తెలంగాణలో విగ్రహాల గొడవ నడుస్తోంది. గతంలో కూడా ఇలాంటిదే నడిచింది. పాలకులకు విగ్రహాల మీద ఉన్న శ్రద్ధ.. ప్రజల సమస్యలపైన లేదు. తెలంగాణ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. ఇంకా వాటిని కాంగ్రెస్ గుర్తించనే లేదు. వాటిపైన దృష్టిని కాస్తా ఇప్పుడు విగ్రహాల మీదకు మరల్చారు. ఎదుటి వారితో సై అంటే సై అనేలా మాటల తూటాలు పేలుతున్నారు. తాజాగా తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం వ్యవహారం ఇప్పుడు దుమారానికి కారణమయ్యింది. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలను కున్నామని బిఆర్ఎస్ వాదిస్తోంది. కానీ అక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలని అధికార కాంగ్రెస్ నిర్ణయించింది. నిజానికి తెలంగాణ కోసం పోరాడిన, అమరులైన వారు ఎందరో ఉన్నారు. వారెవ్వరూ విగ్రహాలు పెట్టించుకునేంత స్థాయికి రాలేదు. ఎందుకంటే నేతలు వారి త్యాగాలను గుర్తించిన సందర్భాలు లేవు. కనీసం ప్రొఫెసర్ జయశంకర్ లాంటి వారిని కూడా గుర్తించలేదు. ఇదే సందర్భంలో ఇప్పుడు రాజీవ్ విగ్రహం పెట్టాల్సిన అవసరం లేదు. అయితే స్వామి భక్తి చాటుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌లో ఎప్పుడూ ఉంటుంది. విగ్రహాలు పెట్టడం లేదా పథకాలకు పేర్లు పెట్టడం ద్వారా కాంగ్రెస్ పెద్దలను ఎప్పుడూ కొలిచే పద్దతి ఒకటి ఉంది. కాంగ్రెస్‌లో ఇలాంటి పనులు చేస్తుండాలి. లేకపోతే అధిష్ఠానం కోపానికి గురికాక తప్పదు. కాంగ్రెస్‌లో నెహ్రూ వారసులను స్మరిస్తూ పోవాలి. రేవంత్ రెడ్డి కూడా ఇలా చేయాల్సిందే. చేయకుండా ఉండలేరు కూడా. అందుకే తెరపైకి రాజీవ్ విగ్రహం వచ్చి చేరింది. గతంలో వైఎస్ కూడా ఇలాగే చేశారు. చంద్రబాబు హయాంలో ఉమ్మడి ఎపిలో రాజధానిగా ఉన్న హైదరాద్ నెక్లెస్ రోడ్డును అందంగా తీర్చి దిద్దారు. పార్కులు కట్టారు. ఇలా ప్రసాద్ ఐ మాక్స్ పక్కన చక్కని సర్కిల్ ఏర్పాటు చేసి, పూలవనంగా తీర్చి దిద్దారు. వైఎస్ సిఎం అయ్యాక అక్కడ ఇందిరాగాంధీ విగ్రహం పెట్టారు. ఇప్పుడు అక్కడ ఆ విగ్రహం ఉంది. విమానాశ్రయానికి రాజీవ్ పేరు పెట్టారు. క్రికెట్ స్టేడియానికి కూడా రాజీవ్ పేరు పెట్టారు. ఇలా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందంటే స్వామిభక్తి చాటుకునేందుకు ఇలాంటి పనులన్నీ చేస్తూ పోవాలి. ఈ క్రమంలోనే ఇప్పుడు రేవంత్ వంతు వచ్చింది. అందుకే సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహం పెట్టాలని తనవంతుగా భక్తిని చాటుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ నిర్ణయాన్ని సహజంగానే బిఆర్ఎస్ వ్యతిరేకించింది. తాము మళ్లీ అధికారంలోకి రాగానే విగ్రహాన్ని తొలగిస్తామని, రాజీవ్ పేరు ఉన్న విమానాశ్రయానికి లోకల్ లీడర్ల పేరు పెడతామని కెటిఆర్ ఘాటుగానే హెచ్చరించారు. రాజీవ్‌కు తెలంగాణకు సంబంధమేమిటని ప్రశ్నించారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ రాజీవ్ జయంతి సభ వేదుకగా ఘాటు విమర్శలు చేశారు. రాజీవ్ విగ్రహం పెడితే తొలగిస్తామని కొందరు మాట్లాడుతున్నారు, 'చేతనైతే ఆ విగ్రహాన్ని టచ్ చేయండి.. అంతు చూస్తాం' అని సిఎం రేవంత్‌రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. అధికారం పోయినా బిఆర్ఎస్ నాయకుల్లో కొందరికి అహంకారం తగ్గడం లేదని కూడా మండిపడ్డారు. పనిలోపనిగా సచివాలయం ఎదుట కెసిఆర్ విగ్రహాన్ని పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్న మీరు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదని కూడా బిఆర్ఎస్‌ను ప్రశ్నించారు. పదేళ్లలో ఏనాడూ విగ్రహం పెట్టాలన్న ఆలోచన రాని వాళ్లకు ఈరోజు రాజీవ్ విగ్రహాన్ని పెడితే ప్రశ్నించే నైతిక హక్కు లేదని అన్నారు. డిసెంబర్ 9వ తేదీలోపు సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం కూడా పెడతామని సిఎం రేవంత్ ప్రకటించారు. ఈ విగ్రహాన్ని సచివాలయం లోపలే పెడతామని కూడా స్పష్టం చేశారు. రాజీవ్ విగ్రహాన్ని ముట్టుకోకముందే ఏమవుతుందో చూపిస్తాం అంటూ..కొంచెం పరుష పదజాలంతోనే విమర్శలు చేశారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ముట్టుకోకముందే ఏమవుతుందో చూపిస్తామని హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకులు విచక్షణ కోల్పోయి అర్థం పర్థం లేని మాటలు మాట్లాడితే తెలంగాణ సమాజం సామాజిక బహిష్కరణ చేస్తుందని హెచ్చరించారు. రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని మంగళవారం ప్రారంభించాలని ముందుగా నిర్ణయం తీసుకున్నా మని, కానీ, ఇంకా కొన్ని పనులు మిగిలి ఉండటం మూలంగా దానిని వాయిదా వేసుకున్నామని తెలిపారు. రాజీవ్ గాంధీ విగ్రహం అమరవీరుల జ్యోతి పక్కన ఉండటం సముచితం అనికూడా సమర్థించుకున్నారు. అలాగే రాజీవ్ దేశానికి చేసిన సేవల గురించి కూడా ప్రస్తావించారు. చివాలయం ముందు దొంగలకు, తాగుబోతులకు స్థానం లేదని పరోక్షంగా కెసిఆర్‌ను ఉద్దేశించి విమర్శలు కూడా చేశారు. ఇదే సందర్భంలో పలు విమర్శలు కూడా చేశారు. ఎన్నికల సమయంలో ఇలాంటి భాష వాడితే తప్పులేదు. కానీ ఇప్పుడు ఇలాంటి భాష అవసరం లేదు. అలాగే రాజీవ్ విగ్రహం కూడా అవసరం లేదు. సచివాలయం ముందు ఇంకెవరిదైనా... లేకపోతే ప్రొఫెసర్ జయశంకర్ లాంటి వారి విగ్రహం పెట్టివుంటే హుందాగా ఉండేది. తెలంగాణ ఆకాంక్షలకు అనుగుణంగగా ఉండేది. రాజీవ్‌కు ఇప్పుడు కొత్తగా ఇవ్వాల్సిన గౌరవం ఏమీ లేదు. ఆయనకు దక్కాల్సిన గౌరవం దక్కింది. అదే సందర్భంలో సిఎంగా ఉన్న రేవంత్ రెడ్డి నిగ్రహంతో ఉండాలి. పరుషంగా మాట్లాడడం వల్ల సిఎం హుందాతనాన్ని కోల్పోతారు. ఇదికూడా గమనించాల్సి ఉంది.

# నియంతృత్వంపై తిరుగుబాటు !

**హైద్రాబాద్ :** శ్రీలంక తరవాత బంగ్లాదేశ్..ఈ రెండు దేశాలు ప్రపంచానికి ఓ పాఠం చెప్పాయి. నేతల నియంతృత్వ ధోరణలు..ప్రజల ఆకాంక్షలను పట్టించుకోని తీరును ప్రపంచానికి తెలియచేశాయి. చరిత్ర తిరగేస్తే..నియంతలకు స్థానం లేదని ఎప్పుడూ నిరూపిస్తూనే ఉంది. బంగ్లా ప్రధాని షేక్ హసీనా నియతృత్వ పోకడలు ఆమెనే గద్దె దించాయి. దేశ విముక్తి పోరాటంలో పాల్గొన్న వారికి రిజర్వేషన్ల పేరుతో తన పార్టీ వారికి లబ్ది చేకూర్చే విధంగా చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను గుర్తించకుండా మొండిగా, నిరంకుశంగా నిర్ణయాలు తీసుకున్నారు. బంగ్లా సుప్రీంకోర్టు రిజర్వేషన్ల కోటాను తగ్గించినా ప్రజల్లో ఆగ్రహం చల్లారలేదు. దీనికితోడు నేతు విలాసాలకు అలవాటు పడుతున్నా రు. ప్రజల సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. ఇది ప్రజల్లో ఆగ్రహానికి కారణం అవుతోంది. అదే బంగ్లాదేశ్‌లో తిరుగు బాటుకు బీజం వేసింది. గత కొన్ని వారాలుగా బంగ్లాదేశ్‌లో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను పొరుగుదేశాలు, స్నేహితులు గమనిస్తున్నారు. బంగ్లాదేశ్ ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసన షేక్ హసీనా గతంలో సంక్షోభాలను ఎదుర్కొన్నట్లుగానే ఈ సమస్యను కూడా పరిష్కరించగలరా అని అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఎందుకంటే పరిస్థితులు దిగజారుతున్నా పట్టించుకోకుండా ముందుకు వెళ్లారు. అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పలేదు. బతుకుజీవుడా అంటే దేశం విడిచి పెట్టా పారిపోవాల్సి వచ్చింది. గతంలో శ్రీలంక ప్రధాని కూడా ఇలాగే పారిపోయారు. స్వేచ్ఛ, నిష్పక్షపాతమైన, విశ్వసనీ యమైన ఎన్నికల ద్వారా 2009లో షేకహేసీనా అధికారం చేపట్టారు. అయితే ఆ తర్వాత 2014, 2018 మరియు 2024లో ఎన్నికలు వివాదాస్పద మైనప్పటికీ.. అధికారాన్ని చేపట్టారు. తన తండ్రి షేక్ ముజీబ్‌ర్ రహమాన్ ప్రతిష్టను అడ్డం పెట్టుకుని ఆమె రాజ్యమేలారు. అయితే దేశంలో అనూహ్యంగా రాజకీయ పరిణామాలు మారిపోయాయి. 15 ఏళ్ల సుదీర్ఘపాలనను ముగిస్తూ సోమవారం ఆమె ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఉద్యోగాల్లో కోటాను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ప్రారంభమైన విద్యార్థుల నిరసనలు వేగంగా దేశవ్యాప్త ఆందోళనలుగా మారాయి. స్వదేశంలో విదేశాలలో షేక్ హసీనా సాధించిన ఆర్థికాభి వృద్ధిని కప్పిపుచ్చుతూ, ఆమె నిరంకుశత్వం, అవినీతి, బంధుప్రీతిపై అంసతృప్తిని బహిర్గతం చేశాయి. ఓవైపు దేశంలో ప్రజాస్వామ్య విలువలు, పౌరహక్కులను హరించివేస్తూ, మరోవైపు ఆర్థిక పురోగతి సాధించినంత మాత్రాన ఆ నేత ప్రజాదరణను పొందలేరని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. రిజర్వేషన్ల కోటాను వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేపట్టిన శాంతియుత నిరసనలు, వివాదాస్పద రాజకీయ పరిణామాలుగా మారాయి. అయితే ఈ నిరసనలను అణచివేసేందుకు ఆమె సైన్యాన్ని రంగంలోకి దింపారు. దీనిపై ప్రజాగ్రహం పెల్లుబికింది. కర్ఫ్యూ, షూట్ ఎట్ సైట్ ఆదేశాలు, ఇంటర్నెట్‌పై నిషేధం ఉద్యమాలను మరింత ఉధృతం చేశాయి. ప్రదర్శనకారులను 'రజాకార్లు' అని హసీనా పేర్కొనడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ ఉద్యమాలకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, సామాజిక సంస్థలు సహా సమాజం లోని విభిన్న వర్గాలు మద్దతు ప్ర కటించాయి. తమ డిమాండ్లు నెరవేరేంతవరకు ప్రధానితో చర్చలకు విద్యార్థులు నిరాకరించారు.ప్రజాస్వామ్య విలువలు, పౌరహక్కులను తుంగలో తొక్కి కేవలం ఆర్థికాభివృద్ధికి మాత్రమే ప్రాధాన్యత నిచ్చే నేతలకు షేక్ హసీనా పతనం ఉదాహరణగా నిలిచింది. ఆమె తండ్రి జైలు శిక్ష అనుభవించినప్పటికీ దేశం విడిచి పారిపోలేదు. హసీనా నిష్క్రమణ బంగ్లాదేశ్ రాజకీయాల్లో గణనీయమైన మార్పును సూచిస్తుంది. హసీనా తన పదవికాలంలో లిఖించదగిన ఆర్థికాభివృద్ధి ని సాధించారు. ప్రపంచం లోనే అత్యంత పేదరిక దేశంగా ఉన్న బంగ్లాదేశ్ ..ఆమె హయాంలో ఆ ప్రాంతంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థ గా రూపాంతరం చెందింది. పొరుగునే ఉన్న భారతదేశాన్ని కూడా అధిగమిం చింది. దశాబ్ద కాలంలో దేశ తలసరి ఆదాయం మూడింతలైంది. గడిచిన 20 ఏళ్లలో దేశంలో 25 మిలియన్లకు పైగా ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. హసీనా ప్రభుత్వం దేశీయ నిధులు, రుణాలు అభివృద్ధి నిధుల సాయంతో గంగానదిపై 2.9 బిలియన్ డాలర్ల పద్మ వంతెనవంటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను చేపట్టారు. అయితే ఈ ఆర్థికాభివృద్ధి గణనీమైన ఖర్చుతో కూడుకుంది. దీంతో 2014, 2018 మరియు 2024లో జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు తక్కువ ఓటింగ్, హింస, ప్రతిపక్ష పార్టీల బహిష్కరణల మధ్య జరిగాయి. భయం,అణచివేత వాతావరణాన్ని సృష్టించి, నియంత్రణను కొనసాగించడానికి హసీనా ప్రభుత్వం పూర్తి సైన్యాన్ని వినియోగించింది. 2018లో అమలు చేసిన డిజిటల్ భద్రతా చట్టం విమర్శకుల గొంతుకను అణిచివేసేందుకు, ముఖ్యంగా ఆన్‌లైన్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడానికి ప్రభుత్వానికి, అధికార పార్టీ కార్యకర్తలకు శక్తివంతమైన ఆయుధంగా మారింది. పత్రికా స్వేచ్ఛ దెబ్బతినింది. హసీనా తన అధికార స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంతో పౌర హక్కులు, క్రమపద్ధతిలో అణచివేసారు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న సమయంలోనే ప్రజలమధ్య ఆర్థిక అసమానతలు పెరిగాయి. బ్యాంకు మోసాలు పెరిగాయి. రుణ ఎగవేతదారుల జాబితా పెరిగింది. సిఎల్‌సి పవర్, వెస్టర్న్ మెరైన్ షిప్‌యార్డ్ రెమెక్స్ ఫుట్‌వేర్ వంటి కంపెనీలు దివాలతీసిన జాబితాలో అగ్రస్థానంలో నిలిచాయి. 965 కోట్ల నుండి 1,649 కోట్ల బంగ్లాదేశ్ టాకాల వరకు మొండి బకాయిలు పెరిగాయి. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, ప్రబలమైన అవినీతి, మొత్తం ఆర్థిక పురోగతి ఉన్నప్పటికీ ప్రజల్లో అసంతృప్తికి ఆజ్యం పోసింది. నియంతలకు ఇది గుణపాఠం కావాలి. ఒంటెద్దు పోకడలతో తీసుకునే నిర్ణయాలు ఎప్పటికైనా ప్రజల్లో తిరుగుబాటుకు కారణమవుతాయి. ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని కాదని తీసుకునే నిర్ణయాలు నిలబడవనడానికి బంగ్లాదేశం ప్రత్యక్ష ఉదాహరణ.



# పాలకుల తీరుపై చైతన్యం కావాలి !

ఒక్కసారి అధికారం చేపడితే మరోమారు దానిని కాపాడుకుని ఓట్లు పొందదమెలా అన్న సూత్రం..అన్నీ రాజకీయ పార్టీలు అవలంబిస్తున్నాయి. ఇందుకు బిజెపి భిన్నంగా ఏమీ లేదు. ప్రాంతీయ పార్టీల తీరులోనే బిజెపి కూడా ఆలోచిస్తోంది. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి మరోమారు కేంద్రంలో పగ్గాలు దక్కించుకోవాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తోంది. ఎన్‌డిఎలో కొత్త మిత్రులను చేర్చుకోవాలని ఉబలాట పడుతోంది. అలాగే పదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ ఇండియా కూటమితో గద్దెనెక్కాలని చూస్తోంది సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నా ..కలసివచ్చే ప్రాంతీయ పార్టీలను కలుపుకుని ముందుకు సాగుతోంది. కూటమిలోని ప్రాంతీయ పార్టీల డిమాండ్లకు తలొగ్గి పనిచేస్తోంది. ఇకపోతే గత ఐదేళ్లుగా ఎపిలో చేతికి ఎముకే లేదన్న చందంగా ఖజానాను ఊడ్చిపెట్టిన జగన్ ఇప్పుడు మరోమారు అధికారం కోసం ఎత్తులు పైఎత్తులు వేస్తున్నారు. నిజానికి రాష్ట్రం అభివృద్ధి జరిగివుంటే ప్రజలు అడక్కుండానే ఓట్లేస్తారు. కేవలం డబ్బులు పంచడమే పాలన అన్న చందంగా జగన్ పాలన సాగింది. దీంతో ఎపి కూడా అప్పులకుప్పగా మారింది. తెలంగాణలె నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ ఊదరగొట్టి ప్రజలను వంచించిన కెసిఆర్‌ను, ఆయన పార్టీని ప్రజలు మొన్నటి ఎన్నికల్లో దించేసారు. ఇప్పుడు ఎంపి ఎన్నికల్లో నాలుగైదు సీట్లు సంపాదిస్తే తప్ప ప్రజలు ఆదరించరు. నాయకులు కలసి ఉండరు. అందుకే కెసిఆర్ ఊతకర్ర పట్టుకుని అడుగులు వేస్తున్నారు. రాజకీయ నాయకుల సరికొత్త రాజకీయాల కారణంగా ప్రజల సమస్యలు పక్కకు పోతున్నాయి. రాజకీయనేతలు..వారి సమస్యలు ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. రాజకీయాల్లో కక్షసాధింపు వ్యవహారాలు మిన్నంటాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అయినా.. ప్రాంతీయ పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో అయినా కక్షసాధింపు రాజకీయాలు సాగుతున్నాయి. తమ ఆలోచనలకు అనుగుణంగా సాగడం..ప్రజల గురించి పట్టించుకోక పోవడం.. ప్రశ్నించిన వారిని కేసులు పెట్టి వేధించడం పరిపాటిగా మారింది. ఎపిలో అయితే దాడులు, కేసులు, హత్యలు నిత్యకృత్యంగా మారాయి. తాజాగా వివేకానంద కేసులతో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరి తండ్రిపై దాడి జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. నేతల్లో నిజాయితీ లోపించిందన్నది నూటికినూరుపాళ్లు నిజం. నిజానికి అవినీతి కావచ్చు, అక్రమాలు కావచ్చు... అందరినీ ఒకే గాటన కట్టే పాలన రావాలి. రాజకీయ లబ్ది కోసం చేసే ప్రయత్నాలను ప్రజలు ఎప్పుడూ హర్షించరని గుర్తించాలి. బెయిల్‌పై ఉన్న జగన్ సిఎం గద్దెనెక్కినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలి. ఇలా అనేకానేక కేసులను పక్కన పెట్టారు. బ్యాంకులను దోచుకున్న వారు ఎందరో దర్జాగా తిరుగుతున్నారు. అందుకే తమైదన రీతిలో పాలనలో రాటుదేలిన పాలకులు ప్రజా ఉద్యమాలకు పెద్దగా జంకడం లేదు. వాటిని కఠినంగా అణచివేసే విధానాలు బాగా వంటబట్టించుకున్నారు. తమ విధానాలతో కార్పోరేట్ సంస్థలకు లబ్ది చేకూర్చే లక్ష్యంతో పాలనా వ్యవహారాలను నడుపుతున్నారు. రాష్ట్రాల్లో కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్నారు. వారికి పనులు అప్పగిం చడం..అందులో లాభాలు పొందడం అలవాటు చేసుకున్నారు. కాళేశ్వరం అవినీతిలో ఇదే జరిగింది. కార్పోరేట్ సంస్థలు విదులుస్తున్న డబ్బులతో అధికారంలోకి రావడ.. వారి కోసం ప్రభుత్వ పరంగా చేయాల్సని పనులు చక్కబెట్టడం రివాజు గా మారింది. ప్రాంతీయ పార్టీలైనా, దేశభక్తిని నరనరాన జీర్ణించుకున్నానని బీరాలు పలికే బిజెపి అయినా.. కార్పోరేట్లకు దాసోహం అంటోంది. ఎన్నికలకు ముందు ప్రజలను మచ్చిక చేసుకోవడం.. డబ్బులు పంచడం...అధికారంలోకి వచ్చాక ప్రజలను నట్టేట ముంచే పనులు చేయడం దేశంలో అలవాటుగా మారింది. దీనికి ఘనమైన ప్రజాస్వామ్య ముసుగు వేస్తున్నారు. అమరావతి రాజధానిని కొనసాగించాలని రైతులు ఉద్యమిస్తున్నా సిఎం జగన్ పట్టించుకోవడం లేదు. ఉద్యోగాలు భర్తీ చేయండనో లేదా ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని తెలంగాణలో చేస్తున్న ఆందోళనలను గులాబీ బాస్ కెసిఆర్ ఖాతరు చేయలేదు. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో అయినా ఏ ప్రభుత్వం ఉన్నా.. ప్రజాందోళనలను పట్టించుకోక పోవడం అన్నది ఓ విధానంగా మారింది. తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్న చందంగా..తమకు అనుకూల మైన విధానాలను అవలంబిస్తూ ప్రజా సంక్షేమం అన్న ముసుగు కప్పి అధికారం చెలాయిస్తున్నారు. ప్రాంతీయ పార్టీలు అయినా,జాతీయ పార్టీలు అయినా, కమ్యూనిస్టులు అయినా భారతగడ్డపై ప్రజల కోసం పాటుపడే పార్టీలులేవని తేలిపోయింది. మనపాలకులు బ్రిటిషర్ల కన్నా దారుణమైన అణచివేత విధానాలను అలవర్చుకున్నారు. వారి కన్నా కొంచెం కనికరముండేదేమో.. అభివృద్ధి పట్ల వారికున్న చిత్తశుద్ధి నేటి పాలకులకు లేకపోవడం విచారకరం. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలన్న కేందప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడాలనే సంకల్పం వైసీపీ ప్రభుత్వానికి ఏ కోశాన కూడా లేదు. విశాఖ రైల్వేజోన్ గాలికి పోయింది. ప్రత్యేక హోదా ఊసే లేదు. అయినా ప్రజలకు ఆ స్పృహ కూడా లేదు. ఉన్నా పోరాడే శక్తి లేదు. పోరాడినా పోయేవి ప్రాణాలే తప్ప మరోటి కాదని పాలకులు తేల్చేశారు. ఆందోళనలను పట్టించుకోవడం లేదు. అందుకు అమరావతి, రైతు ఉద్యమం నిదర్శనంగా చూడాలి. ప్రజాందోళనలను పట్టించుకోక పోవడం అన్నది తెలంగాణలో కెసిఆర్ రాకతో మొదలయ్యిందనే చెప్పాలి. ప్రజాందోళనలు పట్టించుకోకపోవడం, ఖాతరు చేయకపోవడం అన్నది అలవాటుగా చేసుకున్నారు. ఎన్నికలప్పుడు ప్రజలు గొర్రెల్లాగా ఓట్లు వేస్తారని కూడా ప్రగాఢమైన నమ్మకం తో ఉన్నారు. ప్రజల ఆందోళనలతో ప్రభుత్వాలను నిలదీ యడం సాధ్యం కాదని కూడా ప్రజలు గుర్తించా లి. ఓటు వేసే సమయంలో పడ్డ కక్కుర్తి కారణంగా ప్రజలు మోసపోతున్నామని గుర్తించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. నిజాయితీ కలిగిన నేతలను గుర్తించాలి. అందుకు ఓటర్లు ముందుగా చైతన్యం కావాలి.

# ట్రంప్ సుంకాల ప్రభావంపై ఆలోచించాలి

**దేశీయంగా సన్నద్ధతను సంతరించాలి**

**మేధావులు,రాజకీయ, ఆర్థికవేత్తలతో చర్చించాలి**

**న్యూఢిల్లీ :** ట్రంప్ అమెరికా అధ్యక్షుడుయ్యాక మన పరిస్థితి ఎలా ఉందో బేరీజు వేసుకునే సమయం వచ్చింది. నిరుద్యోగ భారతాన్ని ఇంకెంతో కాలం నెట్టుకు రావడం సాధ్యం కాదని మోడీ గుర్తించాలి. ఈ క్రమంలో అమెరికా ప్రభావంపై దేశీయంగా చర్చించాలి. మేధావులు, ఆర్థికవేత్తలు, విదేశీ నిపుణలతో పాటు రాజకీయనేతలో వరుసగా చర్చలు చేయాలి. ఇందులో సిగ్గుపడాల్సిన పనిలేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం కూడా సరికాదు. పదేళ్ల పదవీ కాలంలో నిరుద్యోగులను అగాధంలోకి నెట్టిన మోడీ బృందానికి సహజంగానే విమర్శలను జీర్ణించుకునే స్థాయి లేదు. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా.. గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు.సత్యాలను కూడా అంగీకరించలేని స్థితికి ఆ పార్టీ చేరింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పాలన సాగిస్తున్న తీరు సరికాదు. చంద్రబాబు లాంటి వారు ఇప్పటికైనా స్పందించాలి. మోడీ విధానాలకు తందానా అనకుండా అంతర్గగత చర్చలకు పట్టుబట్టాలి. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోవడం మానుకోవాలి. ఆర్థిక ఉపద్రవం ముంచుకు వస్తున్న వేళ జాగ్రత్తలు తీసుకోవడంలో తప్పులేదు. దేశంలో నిరుద్యోగం 46 ఏళ్ల గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడం తప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. జిఎస్టీ లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు ప్రస్తుత విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోవడం లేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెట్టి నిరుద్యోగాన్ని రూపుమాపకుండా ఉపన్యాసాలతో కాలం వెళ్ల దీసారు. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన మోదీ వైఫల్యాన్ని కాలంగడుపుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. నల్లధనాన్ని తవ్వితీయ దమనే ప్రకటిత లక్ష్యాన్ని సాధించకపోగా, నలుపును తెల్లగా మార్చి, చక్కగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. మనది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. దీనిని గుర్తించి పన్నులను హేతుబద్ధీ కరించాలి. పోపుల డబ్బాలో కూడబెట్టుకున్న దానికి సైతం జిఎస్టీ కట్టే దరిద్రం దాపురించింది. అధికారం లోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. ఆర్థిక వ్యవస్థ నాశనం చేసి ఇప్పుడు ఆత్మనిర్భర భారత్ జపం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత 45 ఏళ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి దాపురించలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నా అది అసమతుల్యంగా ఉండడం వల్ల తగినన్ని ఉద్యోగాల సృష్టి జరగక లక్షలాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఎప్పుడూ లేనంత నిరుద్యోగం ఇప్పుడు ఉన్నదనీ, కోట్లాది ఉద్యోగాలు సృష్టిస్తామన్న మోదీ హామీ అమలు కాలేదు. ఈ క్రమంలో అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో విస్తృత చర్చ జరగాల్సి ఉంది.

## తిరుమలలో విఐపిలకే ప్రాధాన్యం

**సామాన్యులకు దక్కని దర్శనభాగ్యం**

**తిరుమల :** తిరుమలలో వేసవి రద్దీ కొనసాగుతోంది. కంపార్ట్‌మెంట్లో నిండి బయటకు క్యూలు కడుతున్నారు. ఏటా ఇదే తంతు సాగుతోంది. విఐపిలు పదేపదే రావడంతో వారికోసం దర్శనాలను నిలిపివేస్తున్నారు. వారి రాకను నియంత్రిస్తామన్న హామీ నెరవేరడం లేదు.తిరుమల శ్రీవారిని సామాన్యులు మాత్రమే దర్శించుకునేలా ఆంక్షలు విధించాలని భక్తులుకోరుతున్నారు. రద్దీ ఉన్న సమయాల్లోనూ విఐపిలు రావడం వల్ల తీవ్రిబ్బందులు కలుగుతున్నాయని, సామాన్యులకు దర్శనం కలగడం లేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. భక్తులు తమ ఆపదల మొక్కులు తీర్చుకోవడానికి వస్తారని అలాంటి సమయంలో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. అయినా దేవుడికి భక్తుడికి మధ్య అధికారుల పెత్తనం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. తిరుమలలో ముందు భక్తులకు సత్వర దర్శనం కలిగేలా విఐపిలను నియంత్రించాలని అన్నారు. ఆ నిబంధనేదో ముందు ప్రజాప్రతినిధులకు విధించాలని అంటున్నారు. తిరుమల ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రం. కావడంతో దేశ విదేశాల నుంచి భక్తులు శ్రీవారిని దర్శించుకుంటారు. ప్రశాంతతకు మారుపేరు తిరుమల.. అయితే పెత్తనం చెలాయించాలను కోవడం సరికాదు. ఇకపోతే ఇటీవల ఇక్కడ అన్యమత ప్రచారాలు, మద్యం, మాంసం తదితర విషయాల్లో కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# గవర్నర్ వ్యవస్థ రద్దు కోసం పోరాడాలి !

**న్యూఢిల్లీ :** సుప్రీం కోర్టు ఇటీవల అనేక చారిత్రక తీర్పులను వెలువరిస్తోంది. అనేక విషయాల్లో మార్గనిరద్దేశనం చేస్తోంది. ఇవన్నీ కూడా పాలకులకు కనువిప్పు కావాలి. రాజకీయ నాయకులపై కేసులు కావచ్చు..వారి ఆస్తులు కావచ్చు..గవర్నర్ వ్యవస్థ కావచ్చు..ఇలా అనేక త చారిత్రక తీర్పులు వస్తున్నాయి. ఇకపోతే గవర్నర్ వ్యవస్థ ఆరోవేలు లాంటిది. దానితో ఆడుకోవడం రాజకీయ నాయకులకు అవసరం. అందుకే గవర్నర్ వ్యవస్థను ఎత్తేయలేకపోతున్నారు. దేశంలో ఈ వ్యవస్థ వల్ల ఏటా వేలకోట్లు దుర్వినియోగం అవుతున్నాయి. రాజకీయ పాచికలు ఆడేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఉపయోగించు కుంటోంది తప్ప ప్రజలకు నేరుగా ఉపయోగం లేదు. అంతేకుండా రాష్ట్రాల్లో అనవసర అధికార కేంద్రంగా మారింది. దీనిని ఎత్తేయాలని ఎన్టీఆర్ సహా అందరూ డిమాండ్ చేసినవారే. కానీ వినేదెవ్వరు... వినిపించే దెవ్వరు అన్న చందంగా ఇప్పుడు పరిస్థితి తయారయ్యింది. గవర్నర్ పోస్టు లేకుండా ప్రభుత్వం నడుస్తుంది. కానీ దీనివల్ల ఉపయోగం లేదని తెలిసినా కొనసాగిస్తున్నారు. తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ఉపయోగిస్తున్నారు. అధికారంలో కాంగ్రెస్, ఉన్నా, ఇప్పుడు బిజెపి ఉన్నా ఒరిగిందేమీ లేదు. అందుకే దివంగత ఎన్టీఆర్ దీని రద్దు కోసం ఆనాడు గట్టిగానే డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులు కూడా ఇవే డిమాండ్ చేస్తున్నారు. అయితే కాంగ్రెస్, బిజెపిలు మాత్రం రోరు మెదపడం లేదు. ఇటీవల తమిళనాడు వ్యవహారం తీసుకుంటే ఎంత రచ్చయ్యిందో చూశాం. గతంలో బెంగాల్లోనూ, కేరలలోనూ ఇదే తరహా రాజకీయాలు నడిపారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న తమిళిసై సైతం ఇదే తరహాలో వ్యవహరించింది.కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తెలంగాణ వంటి పలు రాష్ట్రాల గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ తాబేదార్లు గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ల వైఖరిని వ్యతిరేకిస్తూ కేరళ ప్రభుత్వం న్యాయపోరాటం చేస్తోంది. కేరళ ప్రభుత్వం లేవనెత్తిన అంశాల ప్రాధాన్యతను, ఔచిత్యాన్ని ఈ తీర్పు నొక్కిచెప్పింది. కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన పలు బిల్లులను నిలిపివేసిన సంగతి తెలిసిందే. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి. ఇటీవల సుప్రీంతో చివాట్లు తిన్నారు. అంతేగాకుండా ఆయన ప్రమేయం లేకుండానే బిల్లులను పాస్ చేస్తున్నట్లు సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. అనేక చారిత్రాత్మక తీర్పులను వెలువరిస్తున్న సుప్రీంకోర్టు...మరో చారిత్రాత్మక తీర్పుతో తమిళనాడు గవర్నర్ చెంపచెల్లుమనిపించింది. గవర్నర్ల మితిమీరిన నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు...బిజెపి కాంగ్రెస్‌లకు కనువిప్పుకావాలి. కాంగ్రెస్ కాలం నుంచే గవర్నర్ వ్యవస్థను రాజకీయపునరావాస కేంద్రాలుగా మార్చుకుంది. బిజెపి కూడా దానిని కొనసాగించింది. తమిళనాడు గవర్నర్ రవి అనుసరించిన తీరుపై సుప్రీం తీర్పు రాజ్యాంగ వ్యవస్థను బలోపేతం చేసేదిగా ఈ తీర్పు... సహజంగానే డిఎంకె ప్రభుత్వానికి భారీ విజయంగా చూడాలి.. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఫెడరలిజం బలోపేతానికి జరుగుతున్న పోరాటానికొక ఊతం. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులకో రక్షణ కవచం. ఈ తీర్పు ఒక్క తమిళనాడుకు మాత్రమే పరిమితమైనది కాదు. మొత్తం భారతదేశంలోని రాష్ట్రాలన్నింటికీ సంబంధించినది. జస్టిస్ జె.బి.పార్ధివాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పు సూటిగా ఉంది. ఇందులో ఎలాంటి అనుమానాలు లేవు. అంతేకాదు గవర్నర్లు ఎంతో ఉండాలో నిర్దేశించింది. నెలలోగా బిల్లులను ఆమోదించాలని చెప్పింది. లేకుంటే అవి బిల్లులగా మారుతాయని తేల్చింది. ఈ తీర్పు ఎలాంటి అనుమానాలు లేకుండా చాలా స్పష్టంగా వుంది. గవర్నర్లంటే... కేంద్ర ప్రభుత్వానికి ఊడిగం చేసే దుస్సంప్రదాయానికి ఈ తీర్పు చెల్లుచీటీ రాసింది. బిజెపి ఎక్కడా ఈ తీర్పుపై మాట్లాడ లేదు. రాజ్యాంగానికి దెబ్బపడకుండా చూస్తామని చెప్పలేదు. గవర్నర్ అంటే కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో మెలగవలసిన వ్యక్తి కాదని, ఆ పదవి రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థ అని గతంలో 'ఎస్.ఆర్ బొమ్మై వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. తాజాగా తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించకుండా తనవద్దే తొక్కిపెట్టిన గవర్నర్ వైఖరిని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. 'కీలకమైన 10 బిల్లులను ఆమోదించకుండా తన వద్దనే తొక్కిపెట్టి , ఆయన తీసుకున్న నిర్ణయం, వ్యవహరించిన తీరు చట్టవిరుద్ధం, ఏకపక్షం' అని అభివర్ణించింది. తమిళనాడు గవర్నర్ రవి తన నియామకం జరిగిన నాటినుంచీ ఇలాగే వ్యయహరించారు. ఒకసారి శాసనసభ బిల్లులను ఆమోదించిన తర్వాత వాటిపై నిర్ణయం తీసుకోవడానికి న్యాయస్థానం కాలపరిమితిని కూడా నిర్దేశిరచింది. ఈ బిల్లులకు సంబంధించి గవర్నర్ తీసుకున్న చర్యలన్నీ రద్దవుతా యని, అసెంబ్లీ... గవర్నర్‌కు తిరిగి పంపిన తేదీ నుంచి ఈ బిల్లులన్నీ ఆమోదం పొందినట్లు- పరిగణించాలని సుప్రీం స్పష్టం చేసింది. అంతేకాదు, గవర్నర్ రవి చిత్తశుద్ధితో వ్యవహరించలేదని కోర్టు తప్పుబట్టింది. ప్రజలచే ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల సలహా మేరకు గవర్నర్ వ్యవహరించాలని, రాష్ట్రాలను వీటో చేసే అధికారం రాజ్యాంగం వీరికి ఇవ్వలేదని కోర్టు పునరుద్ఘాటించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావసరాలు, సంక్షేమం కోసం చట్టాలను రూపొందిస్తాయి. వాటిని నిరోధించే వైఖరి రాజ్యాంగ విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డుపడటం గవర్నర్ పని కాదని ఎత్తిచూపుతూ...గవర్నర్ రవి అడ్డుకున్న పది బిల్లులను సుప్రీం ఆమోదించింది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని సమర్థించే ఈ తీర్పు...అసెంబ్లీ హక్కులను హరించే గవర్నర్ల వైఖరికి ఒక హెచ్చరిక. కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలకు చెంపపెట్టు లాంటిదని కడా చెప్పకతప్పదు. అంబేద్కర్ యంతికి ముందు వచ్చిన ఈ తీర్పు రాజ్యాంగాన్ని కాలరాస్తున్న వారికి కనువిప్పుకావాలి. ఈ సందర్భంగా ఉటంకించిన సుప్రీంకోర్టు పాలకులకు గట్టిగానే చురకలు వేసింది. ఈ క్రమంలో వచ్చిన ఈ తీర్పుతో...అస్పష్టతకు తెరపడింది. బిల్లులపై సంతకం చేయడానికి రాజ్యాంగం నిర్దిష్ట సమయాన్ని పేర్కొనలేదని చేసే వాదనలకు సుప్రీంకోర్టు చెక్ పెట్టింది. ఈ తీర్పుతో అయినా గవర్నర్ వ్యవస్థ పనిలేదని గుర్తించాలి. దీనిని రద్దు చేసేందుకు అంతా ఉద్యమించాలి.

# చైనా తెగువను చూసి నేర్చుకోవాలి !



**న్యూఢిల్లీ :** అమెరికా ఆశలు గల్లంతవుతున్నాయి. అక్కడికి వెళ్లి ఉద్యోగాలు చేస్తామన్న భరోసా లేకుండా పోయింది. మనం అమెరికాతో ఎంత సన్నిహతంగా ఉన్నా ట్రంప్ మాత్రం మనలను శతృవులుగానే చూస్తున్నారు. విదేశాల్లో సైతం మాంద్యం ఆవరించింది. ట్రంప్ సుంకాల పుణ్యమా అని అమెరికాతో పాటు ప్రపంచంలో ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం దాడి చేస్తోంది. ట్రంప్‌ను ఎదుర్కోవడంలో చైనా చూపిన తెగువ అభినందనీయం. అలాంటి ధైర్యం మనం చేయలేకపోతున్నాం. చైనా ప్రభుత్వం ఎగుమతుల కోసం కొత్త నియంత్రణ వ్యవస్థ, విధానాలను రూపొందిస్తోందని, కార్ల నుంచి క్షిపణుల దాకా అన్నింటి తయారీకి అవసరమయ్యే అయస్కాంతాల ఎగుమతుల్ని నిలిపేసినట్లు, అనేక చైనా ఓడరేవుల్లో షిప్‌మెంట్స్ ఉన్నట్లు ది న్యూయార్క్ టైమ్స్ నివేదిక తెలిపింది. నివేదికల ప్రకారం, కొత్త నియంత్రణ వ్యవస్థ అమలు లోకి వచ్చిన తర్వాత అమెరికన్ మిలిటరీ కాంట్రాక్టర్లతో సహా అన్ని కంపెనీలకు వస్తువులు చేరకుండా శాశ్వతంగా నిరోధించవచ్చని తెలుస్తోంది. అమెరికా చాలా వరకు చైనా దిగుమతుల పై ఆధారపడింది. దీంతో చైనా ట్రంప్ సుంకాలకు ప్రతీకారం తీర్చుకోవడం ప్రారంభించింది. చైనా ప్రపంచంలోనే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌లో దాదాపుగా 90 శాతం ఉత్పత్తిని కలిగి ఉంది. ఇది రక్షణ, ఎలక్ట్రిక్ వాహనాలు,ఎనర్జీ అండ్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. రేర్ ఎర్త్ మూలకాల్లో 17ఉన్నాయి. సమారియం, గాడోలినియం, టెర్బియం, డిస్ప్రోసియం, లుటేటియం, స్కాండియం, యట్రియం సంబంధిత వస్తువులతో సహా ఏడు వర్గాల మధ్యస్థ, భారీ అరుదైన ఎర్తలను ఎగుమతి నియంత్రణ జాబితాలో ఉంచారు. ట్రంప్ సుంకాలు విధించానే చైనా బెంబేలెత్తి పోలేదు. ధీటుగా ప్రతీకార సుంకాలు విధించింది. అమెరికాకు అవసరమైన అనేక వస్తువుల ఎగుమతులను నిషేధించింది. దీంతో ఇప్పుడు ట్రంప్ గిలగిల కొట్టుకుంటున్నాడు. అలాంటి ధైర్యం మనం కూడా చేయాలి. కీలెరిగి వాత పెట్టాలి. ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా దౌత్యపరంగా హెచ్చరికలు చేయాలి. మనదేశం నుంచి కూడా అనేక రకాల వస్తువులను అమెరికా కొనుగోలు చేస్తోంది. అందులో అత్యంత ముఖ్యమైనవేవో ఉంటాయి. వాటి విషయంలో మనం కూడా చైనా లాగా మంకుపట్టాలి. అప్పుడు ట్రంప్ దిగివస్తాడు. అక్కడి భారతీయులకు కూడా ఇది ముఖ్యం. ఎందుకంటే దేశంలో ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణం తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు విధిస్తే మన విదేశీ మారక నిల్వలు పడిపోతాయి. ఇప్పటికే దేశీయంగా మన యువత నిరుద్యోగం ఎదుర్కొంటోంది. ఎలాగూ అమెరికాలో ఉద్యోగావకాశాలు తగ్గాయి. యూరప్ దేశాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. మనతిండి మనం తింటూ..మన పనులను మనం చేసుకుంటే స్వయం శక్తిని అవలంబించుకోవాలి. అదేపనిగా అమెరికా లాంటి దేశాలపై ఆధారపడకుండా చూసుకోవాలి. దేశంలో ప్రస్తుత పరిస్థితులును చర్చించాలి. ఆర్థికంగా అనేక విషయాలు చర్చించాల్సి ఉంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారు. నిరుద్యోగం ఇంతని చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. రైతులకు మద్దతు ధరలు ధైర్యం దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. బ్ఆయంకుల రుణాలు కూడా తీల్చి పిప్పి చేస్తున్నాయి. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్ధికి నమూనా ఎలా అవుతుందన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్ కళ్లముందే వెక్కిరిస్తోంది. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. అమ్మాయిలు చదువుకునే పరిస్థితి లేదు. వారికి కనీస రక్షణా లేదు. కనీసం బాలికా విద్యకు అవసరమైన రుణాలకు కూడా వెసలుబాటు లేదు. వ్యవసాయాన్ని సాంకేతికతను జోడించడంతో దేశీయంగా ఉపాధి రంగాన్ని పరుగులు పెట్టించాలి. నిజానికి వ్యవసాయ రంగం అతిపెద్ద పరిశ్రమగా పాలకులు గుర్తించడం లేదు. దీనిని గుర్తించి అనుబంధ పరిశ్రమలు చేపడితే దేశంలో సగం నిరుద్యోగం పోతుంది. అలాగే దేశీయంగా పంటలకు ప్రాధాన్యం పెరుగుతుంది. నగదు రహిత ఆరోగ్య సేవలు పొందే విధంగా బీమా పథకం అమలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందించే స్థాయికి వైద్యరంగం బలపడాలి. మహిళలు, యువత, నిరుపేదలు, రైతులు సంక్షేమమే లక్ష్యంగా దేశంలో విధానాలు మారాలి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలి. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలి. దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు పెంచు తామని బిజెపి చేసిన హామీలు అమలు చేసుకోవడానికిదే సరైన తరుణం. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ముద్ర రుణాలను సరళీకరించాలి. ఈ క్రమంలో వ్యవసాయ ఎగుమతులు పెంచుకోవాలి. మనవద్ద పండుతున్న మిర్చి, పత్తి, పసుపు, అల్లం వంటి వాణిజ్య పంటలను ప్రపంచ దేశాలకు విరివిగా ఎగుమతి చేయడం ద్వారా ఆదాయాలను సమకూర్చు కోవాలి. ఇటీవల ఆక్వా ఎగగుమతులపై ట్రంప్ ప్రభావం పడింది. దానిపై దృష్టి సారించాలి. చైనా లాగా మానవవనరులను ఉపయోగించి వస్తూత్పత్తిని పెంచుకోవాలి. ప్రపంచ దేశాలపై ఆధారపడే విధానం పోవాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలోపతేం కాగలదు. నిరుద్యోగం సమిసి పోగలదు. చైనా తరహాలో కఠినంగా సాగితేనే ఇది సాధ్యమని గుర్తించాలి.



# పెళ్లి కాకుంటే ఆ హీరోతో డేటింగ్..

అందాల ముద్దుగుమ్మ అనసూయ న్యూస్ రీడర్‌గా కెరియర్ మొదలు పెట్టి, ఆ తర్వాత యాంకర్ గా మారింది. జబర్దస్త్‌తో ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న తర్వాత సినిమాలలోకి అడుగుపెట్టింది. 2013లో మొదటి సారి తెరపై కనిపించిన అనసూయ దాదాపు 13 సంవత్సరాల తర్వాత 'సోగ్గాడే చిన్ని నాయనా' చిత్రంలో నాగార్జునతో కలిసి నటించి తెలుగు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అందులో అనసూయ నటనకి మంచి మార్కులే పడ్డాయి. ఇక అదే సంవత్సరం అనసూయ చేసిన 'క్షణం' చిత్రం కూడా మంచి ఆదరణ పొందింది. ఇక నటిగా అనసూయ స్థాయిని పెంచిన చిత్రం రంగస్థలం కాగా, ఇందులో రంగమ్మత్త పాత్ర ఆమె కెరీర్‌లో మైల్ స్టోన్‌గా నిలిచింది. ప్రస్తుతం టీవీ షోలతోపాటు కొన్ని సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తున్నారు అనసూయ భరద్వాజ్.అయితే అనసూయ తాజాగా ఓ బుల్లితెర కార్యక్రమంలో తన కెరీర్ గురించి మాట్లాడుతూ టాలీవుడ్ హీరోలపై సరదాగా కామెంట్స్ చేసింది. యాంకర్ రవి, శ్రీముఖి హోస్ట్ చేసిన టీవీ షోలో టాస్క్ ప్రకారం అడిగిన ప్రశ్నలన్నింటికి నిజాయితీగా సమాధానం చెప్పాలి. లేదంటే పచ్చి మిరపకాయ తినాల్సి వస్తుంది అని యాంకర్ రవి, శ్రీముఖి తెలిపారు. దీంతో అనసూయ ఛాలెంజ్ ని యాక్సెప్ట్ చేసింది. ఇక రవి ప్రశ్నిస్తూ మీకు ఒకవేళ పెళ్లి కాకుంటే టాలీవుడ్‌లో ఏ హీరోతో డేటింగ్ చేసేవారు అని అడగ్గా, దానికి ఏ మాత్రం ఆలోచించకుండా రామ్ చరణ్ అని సమాధానం చెప్పింది. అలానే అడవి శేష్ గురించి కూడా కామెంట్స్ చేస్తూ.. శేష్ షూటింగ్ లొకేషన్ లో మిలిటరీ ఆఫీసర్ లాగా స్ట్రిక్ట్ గా ఉంటారు. అడవి శేషు అలా ఉండడం వల్లే క్షణం కానీ, అతని ఇతర చిత్రాలు కానీ విజయం సాధిస్తున్నాయంటూ ప్రశంసలు కురిపించింది. ఇక ఇదే షోలో తన భర్త శశాంక్ భరద్వాజ్ గురించి మాట్లాడుతూ.. ఆయనలో ఉన్న ఒకే ఒక్క నెగిటివ్ క్వాలిటీ షార్ట్ టెంపర్ అని పేర్కొంది. మిగిలిన అన్ని విషయాల్లో తన భర్త మిస్టర్ పర్ఫెక్ట్ అంటూ ప్రశంసలు కురిపించింది. తన పేరు గురించి కూడా ప్రస్తావిస్తూ.. మొదట తన తల్లి తనకి పవిత్ర అనే పేరు పెట్టాలనుకుంది. అందుకే పవిత్ర అనే పేరు కూడా తనకిష్టమని అనసూయ తెలిపింది.

# ఊహించలేని కొత్త పాయింట్‌తో..



అశ్విన్‌బాబు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. మామిడాల ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. మెడికో థ్రిల్లర్ కథాంశమిది. ఈ సినిమా టీజర్‌ను మ్యూజిక్ డైరెక్టర్ తమన్, దర్శకుడు శైలేష్ కొలను విడుదల చేశారు. 'ధర్మం దారి తప్పినప్పుడు, ఏ అవతారం రానప్పుడు, వచ్చినవాడు గౌతమ్..' అంటూ హీరో మనోజ్ మంచు వాయిస్ ఓవర్‌తో మొదలైన టీజర్ ఆసక్తికరంగా సాగింది. హీరో అశ్విన్‌బాబు పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించారు. ఈ సందర్భంగా అశ్విన్‌బాబు మాట్లాడుతూ.. ఎవరూ ఊహించలేని కొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని తీశామని, ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసే అంశాలుంటాయని అన్నారు. రొటీన్ యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌కు భిన్నంగా ఉండే చిత్రమిదని దర్శకుడు పేర్కొన్నారు. ఈ సినిమాకు మంచి టీమ్ కుదిరిందని, సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుందని నిర్మాత తెలిపారు. రియా సుమన్, అయేషాఖాన్, మురళీశర్మ, సచిన్‌ఖేడేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎం.ఎన్.బాల్‌రెడ్డి, సంగీతం: గౌర హరి, నిర్మాణ సంస్థ: అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్స్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: మామిడాల ఎం.ఆర్.కృష్ణ.

# వర్జిన్ బాయ్స్ హంగామా



గీతానంద్, మిత్రాశర్మ జంటగా నటించిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. దయానంద్ దర్శకుడు. రాజ్‌గురు ఫిల్మ్స్ పతాకంపై రాజా దరపునేని నిర్మించారు. ఇటీవల ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'నేటి జనరేషన్ రిలేషన్ షిప్స్‌ను ప్రజెంట్ చేసే చిత్రమిది. చక్కటి వినోదం, రొమాన్స్, ఎమోషన్స్‌తో ఆకట్టుకుంటుంది. యువతను మెప్పించే అన్ని అంశాలుంటాయి. పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అని మేకర్స్ తెలిపారు. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిదని, యూత్‌కు రిలేట్ అయ్యే అన్ని ఎలిమెంట్స్ ఉంటాయని నిర్మాత పేర్కొన్నారు. శ్రీహన్, రోనీత్, జెన్నీఫర్, అన్నల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: స్మరణ్‌సాయి, దర్శకత్వం: దయానంద్.

# సందేశాత్మకంగా జనం



సుమన్, అజయ్‌ఘోష్, కిషోర్, వెంకటరమణ, ప్రగ్య నైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. స్వీయ దర్శకత్వంలో వెంకటరమణ పసుపులేటి రూపొందించారు. ఈ నెల 29న ఈ చిత్రాన్ని రీరిలీజ్ చేయబోతున్నారు. గత ఏడాది నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రానికి మంచి ఆదరణ దక్కిందని మేకర్స్ తెలిపారు. దర్శకనిర్మాత వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ 'రాజకీయ వ్యవస్థలోని లోపాల్ని చర్చిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. నేటి తరానికి చక్కటి సందేశాన్నందిస్తుంది. ఈ సినిమాలో సుమన్‌గారు పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో నటించారు. సందేశంతో పాటు థ్రిల్లింగ్ అంశాలుంటాయి' అన్నారు.

# అంతా విచిత్రంగా చూస్తే, ఆమె మాత్రం..

సినిమారంగంలో రాణించాలనే కోరిక బలంగా ఉన్నా.. ఆ విషయంలో తల్లిదండ్రులు ప్రోత్సహం మాత్రం తెలుగమ్మాయిలకు అరుదే. కాస్టింగ్ కౌచ్ అనేది అన్ని రంగాల్లోనూ ఉంది. అయితే సినిమా రంగం అనేసరికి భూతద్దంలో చూడటం సమాజానికి పరిపాటైపోయింది. యాక్ట్రస్‌గా రాణించే విషయంలో తెలుగమ్మాయిలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కరువవ్వడానికి అదికూడా ఓ కారణం. ఈ విషయంలో తనది మాత్రం భిన్నమైన అనుభవమని అంటున్నది అచ్చతెలుగు అందం రీతూవర్మ. 'మా ఇంట్లో అందరూ ఇంజనీర్లూ, డాక్టర్లే. మా అమ్మ అయితే.. సొంతంగా స్కూల్ రన్ చేస్తున్నారు. నాకేమో చిన్నప్పట్నుంచీ యాక్టింగ్ అంటే ఇంట్రస్ట్. ఈ విషయం ఇంట్లో చెప్పినప్పుడు అంతా నన్ను విచిత్రంగా చూశారు. కానీ అమ్మ మాత్రం 'వెళ్లు.. ఓ ప్రయత్నం చేయ్' అంటూ ప్రోత్సహించారు. అమ్మకు నాపై ఉన్న నమ్మకం అలాంటిది. కెరీర్ తొలినాళ్లలో చిన్నచిన్న పాత్రలు చేస్తున్నప్పుడు కూడా అమ్మ నన్ను తప్పు పట్టలేదు. నిజంగా ఆమె సహకారం వల్లే ఈ రోజు హీరోయిన్ స్థాయికి చేరుకోగలిగా. అమ్మ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటూ వస్తున్నా. ఇండస్ట్రీలో జరిగే ప్రతి విషయాన్నీ అమ్మతో పంచుకుంటా. సమస్యలెదురైతే వాటిని కూడా అమ్మతోనే షేర్ చేసుకుంటా. వాటికి వెంటనే అమ్మ పరిష్కారం చెప్పేస్తుంది. అమ్మ వృత్తి రీత్యా ఎంత బిజీగా ఉన్నా.. నాకు మాత్రం ఏ లోటూ రానివ్వదు.' అని చెప్పుకొచ్చింది అందాలభామ రీతూవర్మ.

